శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 69 | శుక్రవారం | 06-02-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


డబ్ల్యుపిఎల్ విజేత ఆర్‌సిబి

ఉత్కంఠ పోరులో ఢిల్లీపై విజయం

09



## బిజెపి, బిఆర్‌ఎస్‌ది ఫెవికాల్ బంధం

**రాష్ట్రంలో ఆ రెండు పార్టీలూ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయ్**

- కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు?
- పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఎందుకివ్వలేదు?
- మెట్రోరైల్, మూసీ ఊసెత్తని బిజెపి నాయకులు రాష్ట్రంలో ప్రచారానికి ఎలా వస్తారు?
- మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి ఒక్క సీటుకూడా దక్కనియ్యం
- గత పదేళ్లలో బిఆర్‌ఎస్, పన్నెండేళ్లలో మోదీ ఏం చేశారో చర్చిద్దాం రండి
- బిజెపి, బిఆర్‌ఎస్ నేతలకు సిఎం రేవంత్‌రెడ్డి సవాల్
- కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 'ప్రజాపాలన- ప్రగతి బాట'



ప్రజాపక్షం/కరీంనగర్

రాష్ట్రంలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమని, గత పార్లమెంట్ ఎన్నికల్లో అవయవదానం చేసినట్టు 8 సీట్లను బిజెపికి దానం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయాలని కేంద్రానికి పంపించామని ఆరు నెలలైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంగా మారిందన్న ప్రధాని ఎందుకు సిబిఐ విచారణ చేపట్టడం లేదని, ఫార్ములా ఈ రేసు కేసులో ఐఎఎస్‌పై విచారణకు అనుమతి కోరుతూ లేఖ రాస్తే ఇప్పటికీ స్పందన లేదన్నారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. రామడుగులో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రూ. 5 కోట్లతో గంగాధర మండలం మధురానగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి తరువాయి 2లో



## రాజ్యసభలో ప్రధాని ప్రసంగం బహిష్కరణ

- మల్లికార్జున ఖర్గేను మాట్లాడేందుకు అనుమతించని చైర్మన్
- నిరంకుశత్వం చెల్లదని, అవమానాలను సహించబోమని కాంగ్రెస్ సభ్యులనినాదాలు

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో గురువారం తీవ్ర గందరగోళ పరిస్థితిమధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించి వెళ్ళిపోయాయి. "నిరంకుశత్వం చెల్లదు..అవమానాలను సహించబోం" అని నినాదాలు చేశారు. వాకౌట్ చేశారు. అనంతరం మోదీ లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులపై తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. వంద నిమిషాలపాటు చేసిన తన ప్రసంగంలో పూర్తిగా ప్రతిపక్షాలను తిట్టిపోయడంపైనే దృష్టి కేంద్రీకరించారు. కాగా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేను రెండు నిమిషాలపాటు మాట్లాడేందుకు అనుమతించాల్సిందిగా సభాపతిని ప్రతిపక్ష సభ్యులు మొదట కోరారు. కానీ సభాధ్యక్షుడు సి.పి.రాధాకృష్ణన్ అందుకు అనుమతించలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రసంగించడానికి అనుమతించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తూ ఉభయ సభలనూ ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై చర్చకు ప్రధానమంత్రి సమాధానమిస్తూ, ఎన్నికల్లో వరుస అపజయాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, తనకు వ్యతిరేకంగా లోతుగా ప్రజల్లో ద్వేషాన్ని పెంచిపోషించినాగానీ తన గోతిని తవ్వే తరువాయి 2లో

## రాష్ట్రపతిని అవమానించారు

రాహుల్ గాంధీపై మోదీ ఆరోపణ



లోక్‌సభలో రాహుల్‌గాంధీ కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూను ద్రోహి అంటూ అవమానించారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. రాజ్యసభలో ధన్యవాదాల తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ, కేంద్రమంత్రిని ద్రోహి అని విమర్శించడం సిక్కు మతానికే అవమానమన్నారు. అదేవిధంగా దేశంలో ఆదివాసీ జాతి నుండి వచ్చిన మొట్టమొదటి మహిళా రాష్ట్రపతి, అత్యున్నతమైన రాజ్యాంగ సంరక్షకురాలిని ప్రతిపక్షం లోక్‌సభలో అవమానించిందని అన్నారు. సభకు అంతరాయం కలిగినందుకు మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక పేద ఆదివాసీ మహిళ రాష్ట్రపతికి మాత్రమే తరువాయి 2లో

### ప్రధాని సమాధానం లేకుండానే తీర్మానం ఆమోదం

లోక్‌సభలో గురువారం అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య, ప్రధాని నరేంద్ర మోదీ సంప్రదాయ ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని సభ ఆమోదించింది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన ధన్యవాద తీర్మాన సవరణలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్‌కు పెట్టినప్పుడు ప్రధాని సభలో లేరు. ఆ తరువాత ఆ సవరణలను తిరస్కరించారు. అనంతరం, జనవరి 28న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని స్పీకర్ చదివి వినిపించారు. ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య ఈ తీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని జవాబు ఇవ్వకుండా ఆమోదించడాన్ని రాజ్యాంగ నిపుణుడు పిడిటి ఆచార్య గతంలో ఎన్నడూ లేని పరిణామంగా వివరించారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సభలో ఉన్నప్పటికీ, అప్పటి ప్రతిపక్ష బిజెపితో కుదిరిన అవగాహన ప్రకారం ప్రసంగం చేయలేదని చెప్పారు. 'స్పీకర్ గారూ, రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని నేరుగా ఓటింగ్‌కు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించాలని ఇరుపక్షాల రాజకీయ పార్టీల మధ్య ఒక అవగాహన కుదిరినట్లు నేను తెలుసుకున్నాను. కాబట్టి, దయచేసి ఆ తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని మన్మోహన్ సింగ్ 2004 జూన్ 10న అన్నారు.

## రైతాంగాన్ని అగాధంలోకి నెట్టొద్దు

- సార్వభౌమత్వానికి ముప్పు తలపెట్టొద్దు
- ఒత్తిళ్లకు తలొగ్గి రాయితీలిచ్చి జీవనోపాధి దెబ్బతీయొద్దు
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సిపిఐ ఆగ్రహం



**న్యూఢిల్లీ:** అమెరికాతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం దేశ సార్వభౌమత్వానికి, రైతాంగానికి ముప్పు కలిగిస్తుందని సిపిఐ హెచ్చరించింది. పారదర్శకతసమానత్వం లేకుండా సర్దుకుపోవాలనేలా భారతీయ సాగుదారులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తూ... అమెరికాకు ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు కల్పించేలా ఈ ఒప్పందమున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఒక ప్రకటనలో దుయ్యబట్టింది. మార్కెట్ విస్తరణ ప్రగల్భాల వెనుక దేశ వాణిజ్య, ఆర్థిక విధానాన్ని నీరుగార్చే చేదు నిజం దాగివుందని వ్యాఖ్యానించింది. ఏయే షరతులతో ఒప్పందం చేసుకున్నారో ప్రజలకు, పార్లమెంటుకు చెప్పాలని డిమాండ్ చేసింది. విదేశాల ప్రయోజనాల కోసం దేశ రైతాంగాన్ని అగాధంలోకి నెట్టవద్దని, బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గి... మినహాయింపులు ఇచ్చి రైతుల జీవనోపాధికి హాని తలపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల కలిగే నష్టాల దృష్ట్యా ఆ దేశ ప్రయోజనాలకు తీసుకున్న నిర్ణయాలన్నీ మార్చుకోవాలని కోరింది. భారతీయ ఉత్పత్తులపై అమెరికా సుంకాల తగ్గింపును తరువాయి 2లో

## గ్రూప్ 1 అభ్యర్థులకు భారీ విజయం



ప్రజాపక్షం/హైదరాబాద్

**సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన హైకోర్టు**

గ్రూప్–1 కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో విజయం లభించింది. గ్రూప్–1 నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పూర్తిగా రద్దు చేసింది. గ్రూప్–1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎంపికైన అభ్యర్థులు వేర్వేరుగా దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లను అనుమతించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం 123 పేజీల కీలక తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది. గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చింది. అవకతవకలు జరిగినట్లుగా ఆధారాలు కూడా లేవని స్పష్టం చేసింది. గ్రూప్–1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేయడమే కాకుండా తరువాయి 2లో

## 12 మంది మావోయిస్టులు లొంగుబాటు

- వారిపై సమష్టిగా రూ.46 లక్షల రివార్డు
- లొంగిపోయిన వారిలో ఎనిమిది మంది మహిళలు
- బిజాపూర్ ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు మృతి



**బిజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దఫాదఫాలుగా లొంగుపోతున్నారు. తాజాగా బిజాపూర్ జిల్లాలో గురువారం రూ. 46 లక్షల సామూహిక రివార్డు కలిగిన పన్నెండు మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. మావోయిస్టుల 'సౌత్ సబ్ జోనల్ బ్యూరో'కు చెందిన ఈ క్యాడర్లలో ఎనిమిది మంది మహిళలు ఉన్నారని, వీరు బస్తర్ పోలీసుల 'పూనా మార్గెం' (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు) కార్యక్రమం కింద ఇక్కడ సీనియర్ పోలీసు అధికారుల ముందు లొంగిపోయారని బిజాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం కూడా వారిని ప్రభావితం చేసిందని ఆ అధికారి చెప్పారు. వీరిలో, డివిజనల్ కమిటీ సభ్యుడు, మావోయిస్టుల కటేకల్యాణ్ ఏరియా కమిటీ ఇన్‌ఛార్జి అయిన సోమడు మడ్కామ్ (42), అలాగే వేర్వేరు యూనిట్లకు చెందిన పార్టీ సభ్యులైన హుంగి కుంజమ్ (19), తరువాయి 2లో

**బొగ్గు గనిలో భారీ పేలుడు...**

## 18మంది కూలీలు మృతి

- శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొందరు
- మేఘాలయలోని తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో విషాద ఘటన
- సహాయక చర్యలు చేపట్టిన విపత్తు బృందాలు



**షిల్లాంగ్ :** మేఘాలయలో అక్రమ బొగ్గుగని 18మంది కూలీల ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. గురువారం ఉదయం ఓ బొగ్గు గని తవ్వకాల సమయంలో చోటుచేసుకున్న ఒక భారీ పేలుడు దుర్ఘటనలో 18మంది కూలీలు దుర్మరణం చెందారు. మేఘాలయ రాష్ట్రం తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘోర ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కాగా, మరికొంతమంది కూలీలు కూడా గనిలో చిక్కుకుపోయి ఉంటారని మేఘాలయ డిజిపి ఐ.నాన్‌గ్రాంగ్ చెప్పారు. మృతులు, చిక్కుకుపోయిన వారిలో ఎక్కువ మంది అసోంకు చెందిన వారుగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా తరువాయి 12లో

## సైబర్ నేరాల నివారణే లక్ష్యం

- సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ 'షీల్డ్ 2026'ను ప్రారంభించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరాల నివారణే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతిష్టాత్మక సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ 'షీల్డ్ 2026' రెండవ ఎడిషన్‌ను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టిజిసిసిసిలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డిజిపి బి. శివధర్ రెడ్డితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పరిశ్రమల ప్రతినిధులు, తరువాయి 12లో






## టీచర్లకు న్యాయం చేయండి

- దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి
- ఎఐజెఎసిటిఒ డిమాండ్
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోకేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆర్‌టిఈ చట్టాన్ని సవరించడంతో కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐజెఎసిటిఒ) నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐజెఎసిటిఒ ఆధ్వర్యంలో గురువారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘాల నేతలు సిఎన్.భారతి (ఎస్‌టిఎఫ్‌ఐ), కె.నరసింహారెడ్డి (ఎఐఎస్‌టిఎఫ్), బస్వరాజ్ గురికర్ (ఎఐపిటిఎఫ్), సి.ఎల్.రోజ్ (ఎఐఎఫ్‌టిఒ) తరువాయి 2లో

డిజిపి నియామకంలో జాప్యం

## మా దృష్టికి తేండి

- యుపిఎస్‌సికి సుప్రీంకోర్టు అధికారం
- తెలంగాణలో శాశ్వత డిజిపి నియామక సిఫారసు కోసం సమావేశం ఏర్పాటుకు నాలుగు వారాలు గడువు

**న్యూఢిల్లీ :** డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) నియామకాల విషయంలో సుప్రీంకోర్టు ఒక కీలక ఆదేశం జారీ చేసింది. డిజిపి నియమాకం ప్రతిపాదనలను పంపించే విషయంలో పలు రాష్ట్రాలు చేస్తున్న తీవ్రజాప్యాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. అటువంటి సందర్భాలను తన దృష్టికి తీసుకురావడానికి గురువారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)కు అధికారం ఇచ్చింది. 2017లో చివరి డిజిపి పదవీ విరమణ చేసిన తెలంగాణకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నియామకానికి సిఫార్సు కోసం యుపిఎస్‌సి సమావేశం తరువాయి 12లో

# నాలుగేళ్ళలో 55 వేలమంది సైనికులు మృతి

## సంఖ్య తక్కువ చెబుతున్న జెలెన్స్కీ!

**కీవ్:** నాలుగేళ్ళుగా జరుగుతున్న యుద్ధంలో 55,000 మంది సైనికులు మరణించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. ఫ్రాన్స్ ఇన్ఫోసంస్థకు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్స్కీ మృతులసంఖ్యను 55వేలగా పేర్కొన్నారు. యుద్ధభూమిలో దేశం నలుదిశలా భారీసంఖ్యలో సైనికులు జాడ తెలియకుండా పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంకోసం ప్రాణాలు అర్పించిన సైనికులకు ఆయన నివాళులు అర్పించారు. తీవ్ర సంతాపం ప్రకటించారు. ఇప్పటికే రెండు దేశాలు మూడు విడతలుగా మరణించిన సైనికుల మృతదేహాలను, ఖైదీలుగా ఉన్న సైనికులను ఇచ్చిపుచ్చుకున్నాయని, ఇక మరో విడత కూడా ఇరు దేశాలూ ఖైదీల పరస్పర మార్పిడి కార్యక్రమాన్ని చేపడతాయని చెప్పారు. అబుధాబిలో చర్చలు ప్రయోజనాత్మకంగా ఉన్నాయన్నారు. అబుధాబిలో చర్చలవేళ జెలెన్స్కీ పైవిధంగా స్పందించారు. ఐతే రష్యన్ పత్రిక మాత్రం జెలెన్స్కీ పత్రికను తీవ్రంగా తప్పుపట్టింది. వాస్తవంగా మరణించిన సైనికులకంటే ఆయన సంఖ్య తక్కువచేసి చూపిస్తున్నారని విశ్లేషణ ప్రచురించింది.

ఇరుదేశాలు నెలవారీ ప్రాతిపదికపై సైనికుల అవశేషాలను ఇచ్చిపుచ్చుకుంటున్నాయని, ఈ మేరకు చూస్తే జెలెన్స్కీ దేశానికి తిప్పిపంపిన మృతదేహాల లెక్కలు జోడించకుండా గణాంకాలను ప్రకటిస్తున్నారని పేర్కొంది. గతనెలలో ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 46 వేలమంది సైనికులు మరణించినట్లు జెలెన్స్కీ చెప్పారని, 9వేలమందికంటే ఎక్కువ మృతదేశాలు యుద్ధభూమి నుండి ఉక్రేన్‌కు తిరిగి వెళ్ళాయని పత్రిక పేర్కొంది.

# లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

పాయకి కుంజమ్ (22)లకు ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ఉంది. మరో ముగ్గురు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, ఒక క్యాడర్‌కు రూ. 2 లక్షలు, ఐదుగురు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున రివార్డు ఉందని ఆయన తెలిపారు. వారు ఒక ఎకె 47 రైఫిల్, రెండు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్), 250 జిలెటిన్ స్టిక్స్, 400 డిటోనేటర్లు, మందుగుండు సామగ్రితో నింపిన ఒక ప్లాస్టిక్ డ్రమ్, ఒక కార్డెక్స్ వైర్ కట్టను కూడా లొంగిపోయినట్లు ఆ అధికారి చెప్పారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ. 50,000 చొప్పున అందజేస్తామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి తదుపరి పునరావాసం కల్పిస్తామని ఆయన తెలిపారు. బిజాపూర్‌లో జనవరి 1, 2024 నుండి ఇప్పటివరకు 888 మంది నక్సలైట్లు హింసను విడనాడి ప్రధాన స్రవంతి లోకి తిరిగి వచ్చారని, 1,163 మందిని అరెస్టు చేశారని, వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 231 మందిని హతమార్చారని ఆ అధికారి తెలిపారు.

**బిజాపూర్ ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు మృతి**

ఛత్తీస్‌గఢ్‌లో ఒకవైపు మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగు తుండగా, మరోవైపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. బిజాపూర్ జిల్లాలో గురువారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో తలపై రూ. 8 లక్షల రివార్డు ఉన్న ఒక సీనియర్ నక్సలైట్ హతమయ్యాడని పోలీసులు తెలిపారు. అతడిని నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) దక్షిణ బస్తర్ డివిజన్‌కు చెందిన డివిజనల్ కమిటీ సభ్యుడు ఉధమ్ సింగ్‌గా గుర్తించారు. సింగ్ దక్షిణ బస్తర్ డివిజన్‌లోని ప్లాటూన్ నంబర్ 13కు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నాడని అధికారి తెలిపారు. తర్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ, కొండ ప్రాంతాలలో సింగ్, ఇతర సాయుధ కేడర్‌ల ఉనికి గురించి అందిన నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, భద్రతా సిబ్బంది ఆపరేషన్‌ను ప్రారంభించారని బిజాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), సిఆర్‌పిఎఫ్ ఉన్నత కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) కమాండోలు పాల్గొన్నారని ఆయన చెప్పారు. 'ఉదయం 7.30 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. కాల్పులు ఆగిపోయిన తర్వాత, ఉధమ్ సింగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఒక ఎకె 47 రైఫిల్, 28 రౌండ్లతో రెండు మ్యాగజైన్‌లు, కార్డెక్స్ వైర్, ఒక వైర్‌లెస్ సెట్, ఒక మొబైల్ ఫోన్, పౌచ్, బ్యాక్‌ప్యాక్, టిఫిన్ బ్యాగ్, ఇతర మావోయిస్టు వస్తువులను స్వాధీనం చేసుకున్నాం' అని ఎస్‌పి తెలిపారు. బిజాపూర్ జిల్లాలోని బసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్టగూడ గ్రామానికి చెందిన సింగ్, 2002–03లో పార్టీ సభ్యుడిగా మావోయిస్టు సంస్థలో చేరాడు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో చురుకుగా ఉన్నాడు. గత మూడేళ్లుగా అతను పామెడ్ ఏరియా కమిటీతో సంబంధం కలిగి ఉన్నాడని అధికారి తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అతనిపై నక్సలైట్ సంఘటనలకు సంబంధించిన తొమ్మిది కేసులు నమోదయ్యాయి. తర్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండం అటవీ ప్రాంతంలో 2023లో పోలీసు బృందంపై జరిగిన దాడి, బసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుట్‌కెల్–చిపుర్‌భట్టి అడవిలో 2024లో జరిగిన పోలీసుమావోయిస్టుల ఎదురుకాల్పులు, 2024లో జిద్పల్లి క్యాంప్‌పై జరిగిన దాడిలో అతను పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి అని ఎస్పీ తెలిపారు.

# డాన్‌బాస్‌ను రష్యా భూభాగంగా ప్రకటించాలి

### అబుదాబి చర్చల్లో అదే ప్రధానాంశం!

### 318 మంది యుద్ధ ఖైదీల విడుదల

### మళ్ళీ సమావేశానికి త్వరలో తేదీలు ఖరారు

**మాస్కో :** నాలుగు సంవత్సరాలుగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేంపకు అబుదాబిలో వరుసగా రెండోరోజు గురువారం జరిగిన త్రైపాక్షిక చర్చల్లో సానుకూల పరిణామాలు ఏర్పడ్డాయి. కొద్దివారాల్లో ఉక్రేన్‌లో శాంతికి మరింత ప్రగతి సాధించగలమని అమెరికా ప్రతినిధులు చెప్పారు. 314 మంది ఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకోవడానికి ఉక్రేన్–రష్యా ప్రతినిధులు మొదటిరోజు చర్చల్లో అంగీకరించారు. రెండోరోజు గురువారం చర్చల నాటికి అంగీకారం ప్రకారం రెండు దేశాలు ఖైదీలను విడుదల చేశాయని టాస్‌వార్తా సంస్థ ప్రకటించింది. ఐతే వీరు ఇంకా ఆ దేశాలకు చేరుకోవాల్సి ఉంది. 157 మంది రష్యా సైనికులను ఉక్రేన్ విడుదల చేయగా, రష్యా కూడా 157 మంది యుద్ధ ఖైదీలను జైళ్ళ నుండి విడుదల చేసింది. ముగ్గురు రష్యన్ పౌరులను, కుర్స్క్ రీజియన్ పౌరుణ్ణి కూడా ఉక్రేన్ అదనంగా విడుదల చేసింది. ఐతే వీరికి ఇంకా మానసిక,వైద్య చికిత్సలు చేసి స్వదేశాలకు పంపుతారని టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. పూర్తయ్యాక ఒక ఉమ్మడి ప్రకటన కాకుండా చర్చలకు ఆతిథ్యం ఇచ్చిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్వయంగా ఒక ప్రకటనను తర్వాత విడుదల చేస్తుంది. రెండు దేశాలూ పరస్పర దాడులు, యుద్ధ ఆరోపణలు చేసుకుంటున్నప్పటికీ, చర్చలు ఆటంకం లేకుండా మధ్యవర్తుల సహాయంతో చర్చలు కొనసాగాయి. 314 మంది యుద్ధ ఖైదీలను విడుదల చేసేందుకు రెండు దేశాలు అంగీకరించాయని, అబుదాబిలోనే తదుపరి చర్చలు కొనసాగించేందుకు తిరిగి కొత్త తేదీలను నిర్ణయించేందుకు కూడా రెండు దేశాల ప్రతినిధులు అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ ఎక్స్ వేదికగా చెప్పినట్లు టాస్ వార్తాసంస్థ ప్రాథమికవార్తగా తెలియజేసింది. పరస్పర ప్రయోజనాత్మకంగా చర్చలు కొనసాగుతున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా డాన్‌బాస్ ప్రాంతాన్ని అన్ని దేశాలూ గుర్తించేవిధంగా రష్యా భూభాగంగా ప్రకటించాలన్నదే చర్చల్లో ప్రధాన ఒప్పంద ప్రతిపాదనగా రష్యా ప్రతినిధులు భావిస్తున్నారు. చర్చలు ప్రధానంగా వివాదాస్పద భూభాగాల విషయంపైనే జరుగుతున్నాయి. దీనికితోడు ఈ చర్చలపట్ల అమెరికా–రష్యా ప్రతినిధులు ఉన్నంతవరకూ సానుకూల స్పందనలు వ్యక్తం చేయడం కొత్త పరిణామం. చర్చలు ప్రయోజనాత్మకంగా జరిగాయని జెలెన్స్కీ కీవ్ నుండి ప్రకటించారు.

నిజమైన శాంతిసాధన దిశగా చర్చలు ముందుకు సాగాలని ఆయన కోరారు. రష్యా ప్రతినిధులు కూడా చర్చలపట్ల ప్రాథమికంగా సంతృప్తి వ్యక్తం చేశారు. యుద్ధ దాడులు ఆపేవిధంగా రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన మిత్రదేశాలను, మధ్యవర్తి దేశాలను సోషల్ మీడియా వేదికగా కోరారు. అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్, ఉక్రేన్ రక్షణ మంత్రి రుస్టెమ్ ఉమరోవ్, జెలెన్స్కీ కార్యాలయ అధిపతి కిరిల్ బుడనోవ్, రష్యా సైనిక విభాగం అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ బృందం తదితరులు పాల్గొన్నారు. యూరప్‌లో నాటో కమాండర్ జనరల్ అలెక్స్ గ్రైన్క్‌విచ్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా రష్యా తమపై ఎలాంటి దాడులూ చేయకుండా భద్రతా హామీలు కావాలని ఈ నేపథ్యంలో జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. చర్చల్లో నిజమైన పురోగతి ఉండాలన్నారు. ఒకవైపు చర్చలు జరుగుతుంటే రెండోవైపు రష్యా దాడులు కూడా కొనసాగిస్తోందన్నారు. శీతాకాలంలో ఇంధన వనరులపై దాడులవల్ల లక్షలమంది ప్రజలు విద్యుత్ కొరతతో, హీటర్లు లేక చలి బారినపడ్డారని సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. ఉక్రేన్ తూర్పు, దక్షిణ ప్రాంతాలలో రష్యాతో 1000 కి.మీ పొడవునా సరిహద్దులు ఉన్నాయి.

**చర్చలు అడ్డుకునేందుకు ఇ.యు– బ్రిటన్ యత్నం**

ఉక్రేన్‌లో శాంతి యూరప్‌కు ఇష్టంలేదని, యూరోపియన్ శక్తులు ఈ చర్చల ప్రగతిని తప్పుతోవ పట్టించేందుకు తమ యత్నాలను ముమ్మరం చేశాయని పుతిన్ దూత, చర్చల్లో కీలక ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్ అబుదాబిలో గురువారం పాత్రికేయులవద్ద విమర్శించారు. ముఖ్యంగా బ్రిటన్, యూరప్ దేశాలే చర్చల్లో పురోగతిని అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. చర్చలు ప్రధానంగా వివాదాస్పద భూభాగాల గురించే జరుగుతున్నాయని ఆయన చెప్పారు. అదేవిధంగా అమెరికా–రష్యా మధ్య కూడా ఆర్థిక సంబంధాల పునరుద్ధరణకు రెండు దేశాలు క్రియాశీల కృషి చేస్తున్నాయని చెప్పారు.

ఈ చర్చల్లో ఖచ్చితంగా సానుకూలమైన ప్రగతి ఉందని, చర్చలు ముందుకు వెళుతున్నాయని అన్నారు.



## చైనాకు పోటీగా అమెరికా 'ప్రాజెక్ట్ వాల్ట్'

**వాషింగ్టన్ :** సమకాలీన సాంకేతిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అవసరమైన కీలక ఖనిజవనరుల పరిశ్రమలో ప్రపంచవ్యాప్తంగా చైనా అధిపత్యాన్ని దెబ్బతీసేందుకు ''ప్రాజెక్ట్ వాల్ట్'' పేరుతో ట్రేడ్‌జోన్ ఏర్పాటుకు అమెరికా తొలి అడుగులు వేసింది. ఈ మేరకు మెక్సికో,జపాన్,యూరోపియన్ యూనియన్‌లతో కార్యాచరణ ఒప్పందాలు చేసుకుంది. గడచిన నాలుగు రోజులుగా డోనాల్డ్ ట్రంప్ ప్రాజెక్టు వాల్ట్ గురించి అట్టహాసంగా చెబుతున్నారు. గురువారం వాషింగ్టన్‌లో అనేక భాగస్వామ్యదేశాల సమక్షంలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,విదేశీమంత్రి మార్కో రుబియో ఈ మినరల్ మినిస్టీరియల్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. యూరప్, ఆఫ్రికా,ఆసియాల నుండి అనేక దేశాల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ఏడాదికాలంగా అమెరికా–చైనా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధంద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు చైనాయే ఈ ఖనిజాల సరఫరాలో కీలకంగా ఉందన్న విషయం ప్రధానాంశంగా బయటకు వచ్చింది. అమెరికా చేస్తున్న స్వీయ రక్షణ చర్యలకు ఈ ప్రాజెక్టు ప్రతిరూపం. ప్రాజెక్టు వాల్ట్ పేరుతో 12 బిలియన్ డాలర్లు విలువైన ఒక ఖనిజ నిల్వను సృష్టిస్తున్నట్లు ట్రంప్ ఇప్పటికే చెప్పారు. అంతరిక్షం, స్మార్ట్‌ఫోన్లు,ఆటోమొబైల్స్,ఎలక్ట్రానిక్స్,పవన విద్యుత్, రక్షణ పరికరాలు,అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, జెట్ ఇంజన్ల తయారీ,సెల్‌ఫోన్‌ల తయారీ, ఇతర అవసరాల నిమిత్తం ఉపయోగించే ఖనిజాల కొరత రాకుండా తక్కువ ఖర్చుతో, నామ మాత్రపు టారిఫ్‌లతో చైనాకు వ్యతిరేకంగా తనుతాను రక్షించుకునేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఈ సదస్సులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అర్జెంటీనా దేశాలు అమెరికాతో కీలక ఖనిజ ఒప్పందాలపై సంతకాలు చేశారు. దక్షిణ కొరియాకూడా ఈ జాబితాలో ఉంది. భాగస్వామ్యదేశాలు,మిత్రులు ఒక ట్రేడింగ్ బ్లాక్‌గా ఏర్పడి అమెరికా పారిశ్రామిక శక్తి సత్తా చాటేందుకు భరోసాగా ఉండాలని జె.డి.వాన్స్ సదస్సు ప్రారంభంలో చెప్పారు.

# ఫెవికాల్ బంధం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపనలు చేశారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, వెలిచాల రాజేందర్ రావు, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచి సోనియా గాంధీ మాట ఇచ్చారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని అవాంతరాలు ఎదురైనా సర్వం కోల్పోయినా.. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటు చేశారన్నారు. పదేళ్లు అంది వచ్చిన అధికారాన్ని అవకాశాన్ని ఉపయోగించుకుని బిఆరెస్ నాయకులు వేల కోట్లు సంపాదించుకున్నారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇప్పుడు వాళ్లు విషం చిమ్ముతున్నారని, పదేళ్లలో కనీసం పేదలకు డబుల్ బెడ్రూంలు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో పాలమూరుకు వచ్చిన ప్రధాని మోదీ పాలమూరు రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామన్నారు. ఢిల్లీ నుంచి పాలమూరుకు వచ్చిన జాతీయ అధ్యక్షుడు ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. మెట్రో రైలు రెండో విడత గురించి మాట్లాడలేదని, కాళేశ్వరం విచారణపై మాట్లాడలేదు. మూసీ ప్రక్షాళన నిధుల ఊసు ఎత్తలేదు. ఏం మొహం పెట్టుకుని బిజెపి జాతీయ నాయకులు రాష్ట్రానికి ప్రచారానికి వస్తున్నారు..? అని విమర్శించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి, డికె అరుణ జాతీయ నాయకులందరినీ తీసుకురండీ, కాంగ్రెస్ కార్యకర్తలు మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బిజెపిని గెలవనీయరని అన్నారు.

రెండేళ్లలో ఏం చేశారని బిజెపి, బిఆరెస్ మమ్మల్ని ప్రశ్నిస్తోందని, పదేళ్లలో బిఆర్ఎస్ ఏం చేసింది.. పన్నెండేళ్లల్లో మోదీ ఏం చేశారో చర్చిద్దాం రండని సవాల్ విసిరారు. రెండేళ్లలో మేం ఏం చేశామో చెబితే మీ గుండెలు పగులుతాయని, నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచామన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తున్నామన్నారు. రైతులకు 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేశామన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. కేవలం రైతుల కోసమే రెండేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశామన్నారు. వరి వేస్తే ఉరి అని మీరంటే.. రైతులు పండించిన ప్రతీ గింజ కొంటుమన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామన్నరు. ఆడబిడ్డలు కట్టుకునే చీరల్లో కూడా గత ప్రభుత్వంలో కమిషన్లు తీసుకున్నారని విమర్శించారు. మా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లల్లో రూ. 9 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. రెండేళ్లలో రూ. 27 కోట్లు మహిళలకు రుణాలు అందించి వ్యాపారంలో ప్రోత్సహిస్తున్నామని, ఆర్‌టిసి బస్సులకు యజమానులను చేశామన్నారు. రాష్ట్రంలో సహజవనరులను దోపిడి చేసి మున్సిపల్ ఎన్నికల్లో గెలవాని చూస్తున్నారని విమర్శించారు. 2027 లో రాబోతున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలన్నిటీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దుతామన్నారు. బిఆరెస్ ఎన్ని శాపనార్థాలు పెట్టినా మరో ఎనిమిదేళ్లు అధికారం మాదేనని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, కరీంనగర్ కు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేసి రెండింటి మధ్యలో డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. బండి సంజయ్ మాపై రంకెలేయడం కాదు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయించి చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీ నుంచి కరీంనగర్ మున్సిపల్ అభివృద్ధికి ఏం నిధులు తెచ్చారో బండి సంజయ్ చెప్పాలన్నారు. ఎవ్వరు ఏం ఇచ్చినా ఇవ్వకపోయినా తెలంగాణ అభివృద్ధి ఆగదని, మున్సిపల్ ఎన్నికల్లో మంచి వాళ్లను ఎన్నుకోండి. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో చివరగా 2676 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.110 కోట్ల 10 లక్షల 12 వేల రూపాయల చెక్కులను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు.

# భారీ విజయం

(మొదటి పేజీ తరువాయి)

మెయిన్స్ జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును రద్దు చేసింది. జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని లేకుంటే తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలన్న తీర్పు చెల్లదని తేల్చింది. సింగిల్ జడ్జి తీర్పు అమలును పూర్తిగా నిలిపివేసింది.

**తీర్పులో ఏముందంటే..**

గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష నిర్వహణ, మూల్యాంకన విధానం, హాల్ టికెట్ల జారీ, పరీక్ష కేంద్రాల కేటాయింపు తదితర అంశాలపై ఆరోపణలకు ఆధారాలు లేవని డివిజన్ బెంచ్ తీర్పులో వివరించింది. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు రెండు హాల్ టిక్కెట్లు ఇవ్వడం వల్ల ఎవరికీ నష్టం వాటిల్లలేదని, ఈ విధానం ఇతర పరీక్షల్లో కూడా అమలు జరిగిందని తెలిపింది. అభ్యర్థికి అన్యాయం జరిగినట్లు ఆదారాలు చూపలేదంది. పరీక్ష కేంద్రాల కేటాయింపులో మహిళా అభ్యర్థులను ప్రత్యేక కేంద్రాలకు కేటానయింపు వివక్ష కాబోదని,దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారని తెలిపింది. పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో తేడాలున్నాయని చెప్పి అక్రమాలు జరిగాయంటే ఎలాగని ప్రశ్నించింది. రెండు సార్లు చేశాక మార్కుల్లో వ్యత్యాసం ఉంటే మూడో మూల్యాంకం చేయడం వల్ల నిష్పక్షపాతంగా జరిగిందని, మొదటి, రెండో మూల్యాంకనాల్లో 15 శాతానికి మించి మార్కుల్లో తేడా ఉంటే మూడో మూల్యాంకనం చేయడం పారదర్శకతకు నిదర్శమని స్పష్టం చేసింది. వ్యక్తిగత ఆరోపణల ఆధారంగా పరీక్షల ప్రక్రియ ఆగడానికి వీల్లేదని చెప్పింది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీక్, సామూహిక కాపీయింగ్ వంటి జరిగాయని ఎవరూ చెప్పలేదని, ఆ తరహా ఆధారాలు కూడా ఎవరూ చూపలేదని తెలపింది. పోస్టుల భర్తీ వ్యవహారంలో కోర్టు జోక్యానికి కచ్చితమైన ఆధరాలు ఉండాలంది. కాబట్టి సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నట్లు డివిజన్ బెంచ్ ప్రకటించింది. గ్రూప్–1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరించిన విధానాలు, నిబంధనలు చట్టబద్ధంగానే ఉన్నాయని ధర్మాసనం తేల్చింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానాలను నిర్ణయించే స్వేచ్ఛ ఉందని తేల్చి చెప్పింది. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, జరిగాయనే ఆరోపణలకు కచ్చితమైన ఆధారాలు లేనప్పుడు, తీవ్ర స్థాయిలో ఉన్నాయని చెబుతున్న లోపాలు రుజువుకానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోరాదని వెల్లడించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పులు కూడా ఉన్నాయని వాటిని ఉదహరించింది. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ వ్యవహారంలో పరీక్ష మొత్తం న్యాయసమ్మతంగా జరగలేదనే ఆరోపణలకు ఆధారలు లేవని అభిప్రాయపడింది. అభియోగాలను నిర్ధారించే స్థాయిలో ఆధారాలు లేవని వెల్లడించింది.

# అగాధంలోకి నెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

గొప్ప ప్రయోజనంగా చేస్తున్న ప్రచారాన్ని ఖండించింది. ఈ మినహాయింపులు పరిమితం... షరతులభరితమని సిపిఐ స్పష్టంచేసింది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు మించి దిగుమతులకు భారత్ కట్టుబడేలా దొడ్డిదారుల్లో వెళితే... పారదర్శకతకు, ప్రజాస్వామిక నిఘాకు, ఆర్థిక సార్వభౌమత్వానికి హాని తప్పదని హెచ్చరించింది. ఈ ఒప్పందం భారతీయ రైతులు, వ్యవసాయ కార్మికులపైనే అధిక ప్రభావం చూపుతుందని పేర్కొంది. అమెరికా వ్యవసాయ వాణిజ్యపరమైన భారీ సబ్సిడీలతో పోటీ మీద భారతదేశ వ్యవసాయ రంగం ఆధారపడదని... సుంకాలు, ఆంక్షలు, ప్రొక్యూర్‌మెంట్ యంత్రాంగాలతో గ్రామీణ జీవనోపాధికి లభించే భద్రతే దీనికి ఆధారపమని సిపిఐ స్పష్టం చేసింది. ఈ భద్రత కోల్పోతే సుంకాల్లో కోతలు, టారిఫ్ కోటాలు లేదా భవిష్యత్ సర్దుబాట్లు లక్షల మంది రైతుల ప్రయోజనాలను కాపాడలేవని హెచ్చరించింది.

అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), ఎంఎస్‌పీకి చట్టబద్ధత, సరసరమైన ధరలకు సముచితంగా ఎరువుల సరఫరా, ఇతర అవసరాల కోసం దేశ రైతాంగం డిమాండ్ చేస్తుంటే ఇలాంటి ఒప్పందం చేసుకోవడం ద్వారా వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రమవుతుందని పేర్కొంది. అమెరికా వ్యవసాయోత్పత్తులకు, ఆహార ఉత్పత్తులకు పరిమిత మార్కెట్ కల్పించినాగానీ దేశీయంగా ధరాఘాతం... స్థానిక విపణులు డీలా పడటం, సంక్షోభం మరింత తీవ్రమవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని వెల్లడించింది. వ్యవసాయ రంగానికి, పాడి పరిశ్రమకు సంపూర్ణ మద్దతు అంటూ ఇచ్చిన అనేక హామీలు ఒట్టి మాటలుగా మారిందని... బాహ్య ఒత్తిళ్లకు యంత్రాంగం తలొగ్గిందని సిపిఐ వ్యాఖ్యానించింది. ఈ ఒప్పందం క్రమంలో భారత్‌లో వ్యవసాయాధారిత వాణిజ్యం, కోఆపరేటివ్‌లు, ఆహార శుద్ధీకరణ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితమవుతాయని పేర్కొంది. ఈ ఒప్పందం భౌగోళికరాజకీయ లక్షణం కూడా ఆందోళన కలిగిస్తోందని, ముడి చమురు దిగుమతులు సైతం ప్రభావితం కాగలవని సిపిఐ వెల్లడించింది. వాషింగ్టన్ వ్యూహాత్మక అజెండాకు అనుకూలంగా ఆర్థికవిదేశాంగ విధానపరమైన నిర్ణయాలు తీసుకునేలా అమెరికా యంత్రాంగం భారత్ చెయ్యి మెలిపెడుతోందని సిపిఐ వ్యాఖ్యానించింది. ఇలాంటి పరిస్థితి భారత్ వ్యూహాత్మక స్వావలంబన, సహకార సంప్రదాయానికి తూట్లు పొడుస్తూ... బలవంతపు ఆధారం (కోయర్సివ్ డిపెండెన్సీ) మూలంగా తీసుకునే స్వతంత్ర నిర్ణయాల పద్ధతికి దారితీస్తుందని హెచ్చరించింది. కార్మికులు, కర్షకులు, సాగుదారుల ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్య ఒప్పందం ఉండాలేగానీ అధికారపరమైన ఒత్తిడికి అస్త్రంగా కాదని సిపిఐ స్పష్టం చేసింది. ఈ ఒప్పందం వివరాలన్నీ పార్లమెంటుకు తెలపాలని సిపిఐ డిమాండ్ చేసింది. రైతుల జీవనోపాధికి ముప్పు తలపెట్టే అన్ని రకాల మినహాయింపులు ఉపసంహరించుకోవాలని, దేశ సార్వభౌమత్వంతో రాజీ పడేందుకు బలవంతపెట్టే అనేక రకాల ఆర్థికభౌగోళిక రాయకీయ చర్యలను తిరస్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది.

# బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

శక్తిసామర్థ్యాలు ప్రతిపక్షాలకు ఎన్నటికీ ఉండవని తీవ్ర పదజాలం ప్రయోగించారు.

మల్లికార్జునఖర్గేను మాట్లాడేందుకు అనుమతించాలని ప్రతిపక్ష ఎంపీలు సభాపతిని అడుగుతూ ఉండగానే ప్రధానమంత్రి మాట్లాడతారంటూ సభాపతి రాధాకృష్ణన్ ప్రకటించారు. ప్రధానమంత్రి లేచి నిలబడగానే ప్రతిపక్ష ఎంపీలు ఖర్గేను మాట్లాడేందుకు అనుతించాలని కోరారు. అందుకు రాధాకృష్ణన్ తిరస్కరించారు. అప్పటికే ప్రధానమంత్రి మోదీ ఏ మాత్రం ఆగకుండా మాట్లాడటం ప్రారంభించారు.

దీంతో సభలో పరిస్థితి నిరసనలకు దారితీసింది. ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాల లో లేచి నిలబడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని అడున్డకున్న ఉదంతాన్ని ఎంపీలు ప్రధాని ఎదుట ప్రస్తావించి నిరసన తెలియజేశారు. దిగువసభలో ఏ ఒక్క ప్రతిపక్ష ఎంపీని ప్రసంగించేందుకు అనుమతించలేదంటూ రాజ్యసభలో ప్రతిపక్షాలు నిరసన తెలియజేశాయి.

**ప్రజాస్వామ్య మూలస్తంభాలను నాశనం చేయలేరు : ఖర్గే**

రాజ్యసభలో ధన్యవాదాల తీర్మానంపై చర్చకు సమాధానం చెప్పేందుకు ప్రధానమంత్రి ప్రసంగం ప్రారంభించగానే 'నిరంకుశత్వం,ఏకఛత్రాధిపత్యం చెల్లదు...అవమానాలను మేం సహించం' అంటూ ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. తర్వాత పార్లమెంటు మకర ద్వారం నుండి వాకౌట్ చేశారు. మకరద్వారం వెలుపల ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ, రాజ్యసభలో మమ్మల్ని (ప్రతిపక్ష ఎంపీలను) మాట్లాడనివ్వలేదని చెప్పారు. ''వారు మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించడంలేదు..లోక్‌సభ–రాజ్యసభ రెండూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల వంటివి, ఈ రెండూ మూలస్తంభాలలో ఏ ఒక్కదాన్నీ వారు ధ్వంసం చేయలేరు, మీ చేష్టల ద్వారా నాశనం చేయలేరు..'' అని విమర్శించారు. సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ, రెండు నిమిషాలు సభలో ఖర్గేను మాట్లాడనివ్వమని ప్రతిపక్ష ఎంపీలు సభాపతిని కోరారని, అందుకు ఆయన తిరస్కరించారని చెప్పారు. గౌరవనీయుడైన ''లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని రెండు నిమిషాలు కూడా మాట్లాడాలన్నది మా ఉద్దేశం, కానీ వారు ఒప్పుకోలేదు, ఆ అవకాశం ఇవ్వలేదు, ఆయన ప్రసంగాన్ని పూర్తిచెయ్యనివ్వలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడికి కూడా ప్రధానమంత్రితో సమానహోదా ఉంటుంది, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తన అభిప్రాయాలు చెప్పేందుకు లేచి నిలబడ్డారు,మాట్లాడటం ప్రారంభించారు, కానీ మాట్లాడనివ్వలేదు'' అని జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ, రాజ్యసభలో రెండు నిమిషాలు మాట్లాడేందుకు ఖర్గేకు అనుమతి ఇవ్వాలని కోరామనీ, అందుకు సభాపతి తిరస్కరించారన్నారు. ''ఖర్గేజీ, చాలా ముఖ్యమైన, విలువైన అంశాన్ని సభలో ప్రస్తావించాలని కోరుకున్నారు, కానీ ఆ యత్నం ఫలించలేదు, ఎవ్వరూ మా గోడు వినలేదు, పార్లమెంటు ఎంతమాత్రం తమను విశ్వాసంలోకి తీసుకోలేదు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుణ్ణి గౌరవించలేదు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుణ్ణి మాట్లాడేందుకే అనుమతించలేదు, అందువల్లనే వాళ్ళ ప్రసంగాలు వింటూ కూర్చోవడానికి బదులుగా వాకౌట్ చేసి వచ్చేశాం'' అని తిరుచ్చి శివ చెప్పారు. గురువారం మధ్యాహ్న భోజన విరామానికి ముందు కూడా ఇదే సమస్యపై ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి.

# అవమానించారు

(మొదటి పేజీ తరువాయి)

అవమానం కాదని, రాజ్యాంగ సంరక్షుకురాలికి జరిగిన అవమానమన్నారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. పశ్చిమ బెంగాల్‌లోకి చొరబాటుదారులను ఆమె ప్రోత్సహిస్తున్నారని ఆ రాష్ట్రంలో యువకుల ఉద్యోగాలను, హక్కులను, గిరిజన భూములను లాక్కుపోయారో అలాంటి చొరబాటుదారులను ఆమె ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రి పదవిని కాంగ్రెస్‌పార్టీ కుటుంబం తన సొంత జాగీరుగా భావిస్తోందని విమర్శించారు. వారు ఎన్నటికీ తన గోతిని తవ్వలేరన్నారు. ప్రతిరోజు వారు నన్ను నిందిస్తున్నారని, ఎందుకంటే నా లాంటి పేదవాడు దేశ అత్యున్నతమైన పదవిని అలంకరించడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు. భారత పౌరులను కాంగ్రెస్‌పార్టీక సమస్యగా చూస్తుంటే, తమ పార్టీమాత్రం దేశ ప్రజలను సవాళ్ళ పరిష్కారానికి ఒక పెద్ద బలంగా భావిస్తోందన్నారు. ఇక తర్వాత ప్రధానమంత్రి బిజెపి ప్రభుత్వం సాధించిన విజయాలను ఒక్కొకటిగా చెబుతూ వచ్చారు. ఇటీవల యూరప్‌తో జరిగిన వాణిజ్య ఒప్పందం, అమెరికాతో జరిగిన ఒప్పందాలను ప్రస్తావించారు. బడ్జెట్‌లో చెప్పినట్టుగా రిఫామ్స్ ఎక్స్‌ప్రెస్ గురించి చెప్పారు.

# దయచేసి వాకౌట్ చేయకండి

### అమెరికాకు ముస్లిం, అరబ్ దేశాల విజ్ఞప్తి

**మస్కట్ :** ఇరాన్–అమెరికా ప్రతినిధుల మధ్య ఒమన్ రాజధాని మస్కట్‌లో అణుచర్చలు ప్రారంభం కానుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకున్నది. మరోవైపు చర్చల నేపథ్యంలో చమురు మార్కెట్‌లో ధరలు గణనీయంగా క్షీణించాయి. న్యాయబద్ధమైన,గౌరవ ప్రదమైన చర్చలకు తాము కట్టుబడి ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. ఇరాన్ తరపున అరాఘ్చి,అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ పాల్గొంటారు.

# టీచర్లకు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షవర్గంగా వ్యవమరించారు. ధర్నాలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ,రాజ్యసభ సభ్యులు సెల్వరాజ్ (సిపిఐ), జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్ (సిపిఐ(ఎం), కుమార్ నాయక్ (కాంగ్రెస్), రాజారామ్ సింగ్(సిపిఐఎంఎల్ ), ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీ మూర్తి (ఎపి), శ్రీపాల్ రెడ్డి (తెలంగాణ), వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పాల్గొని ఉపాధ్యాయులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఎంపిలు హామీ ఇచ్చారు. ఎఐజెఎసిటిఓ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఎఐఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్, నాయకులు చావా రవి, కమలాకాంత్ త్రిపాఠి, రామ్మూర్తి స్వామి, పి. దామోదర్ రెడ్డి, వరల్డ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు అమియకుమార్ మోహంతీ, ఎఐఎఫ్‌యుసిటిఓ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరుణ్ కుమార్, ఎఐఎఫ్ఆర్‌టిఇ కార్యదర్శి ప్రొఫెసర్ వికాస్ గుప్తా, ఎఐఎస్ఈసి కార్యదర్శి శారదా దీక్షిత్, ఎఐటిఎ అధ్యక్షుడు రిజ్వాన్ తదితరులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా ఎన్‌సిటిఇ నోటిఫికేషన్‌కు విరుద్ధమని ఎఐజెఎసిటిఓ నాయకులు అన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం, టెట్ నిబంధన 2010 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుందని, ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇచ్చారని గుర్తు చేశాయి. గత 15 ఏళ్లుగా అదే విధానం అమలులో ఉందని పేర్కొన్నాయి. కాని సుప్రీంకోర్టు తీర్పు కారణంగా ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సర్వీస్ ఉన్న వారికి టెట్ మినహాయింపు ఉన్నప్పటికీ, పదోన్నతులు మాత్రం లభించవని ఇది తీవ్ర అన్యాయమన్నారు. ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌టియుటియస్ రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గౌరవాన్ని అన్యాయంగా తగ్గించే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం టెట్ అనే అంశాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. టెట్ అర్హత దేశంలో సుమారు 25 లక్షల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిందని అన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టుగజేందర్‌తో పాటు 33 జిల్లాల నుండి పెద్ద ఎత్తున సంఘ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ బకాయిలు విడుదల చేయండి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చాడ వెంకట రెడ్డి లేఖ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాపితంగా 2024 సంవత్సరం నుండి ఇప్పటి వరకు దాదాపు 21 నెలల నుండి పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పదవీ విరమణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి చాడ వెంకట రెడ్డి గురువారం లేఖ రాశారు. చివరి దశలో ఉద్యోగంలో జమ చేసిన డబ్బులను ఇవ్వకపోవడంతో వద్ధాప్యంలో వారు ఇతరులపైన ఆధారపడే పరిస్థితి వచ్చిందన్నారు. పదవీ విరమణ పొందిన వారికి వెంటనే వారి వారి పదవీ విరమణ బకాయిలను వెంటనే ఇప్పించాలని వారు తమ దృష్టికి తీసుకొస్తున్నారని చాడ వెంకట రెడ్డి సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

**కాంగ్రెస్- బిఆర్ఎస్ రెండు ఒక్కటే : కిషన్‌రెడ్డి**



**ప్రజాపక్షం/రామాయంపేట:** కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రామాయంపేటకు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి మాట్లాడారు. నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ఎంతో మంది నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం తెలంగాణ ప్రజల కోసం తెచ్చిన ఉచిత వైద్యాన్ని కెసిఆర్ అడ్డుకున్నాడన్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పోటీపడ్డాయని, అవినీతి పార్టీలు గా పేరొందిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే హక్కులేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎంపి రఘునందన్‌రావు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థులను కొంతమంది బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మా కార్యకర్తల జోలికి వస్తే ఎవరిని చూడమని అలాంటి వారిని తొక్కేస్తామని, తీహార్ జైల్లో చిప్పకూడు తినిపిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల కోసం మోసగాళ్లు వస్తున్నారు... జాగ్రత్త





● కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి ● సిపిఐ,టిడిపి, ప్రజా సంఘాల కూటమిని గెలిపించండి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగురవేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన 57 డివిజన్ అభ్యర్థి సహేరా మహ్మద్, 56 విడిజన్ అభ్యర్థి గడ్డం శాంతిప్రియ, 55 డివిజన్ అభ్యర్థి చల్లా భాస్కర్ రావు, 28వ డివిజన్ అభ్యర్థి కోలపూరి ధర్మరాజు, 29వ డివిజన్ అభ్యర్థి మాచర్ల శ్రీనివాస్, 30వ డివిజన్ అభ్యర్థి బ్యాండు దుర్గ, 52వ డివిజన్ అభ్యర్థి బానోత్ కళావతి, 53వ డివిజన్ అభ్యర్థి బండి నర్సింహారావు, 54వ డివిజన్ అభ్యర్థి పల్లపోతు భాగ్యలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, సిపిఐ, టిడిపి, ప్రజాసంఘాల కూటమిగా పోటీలో ఉన్న సిపిఐ అభ్యర్థిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



 తాను ఎంఎల్ఎగా గెలిచిన ఈ రెండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి పెద్ద ఎత్తున నిధులను తీసుకొచ్చి సమగ్రాభివృద్ధిని చేస్తామన్నారు. సిపిఐ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయడమంటే తనకు ఓట్లు వేసినట్లే అని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించినట్లుగానే ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా గెలిపించాలని, తద్వారా మరింత అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ఉండే సిపిఐకి ప్రజా సమస్యలపై ఎక్కువ అవగాహన ఉంటుందని, అలాంటిది మన అభ్యర్థిలే కార్పొరేటర్లుగా ఉండటం ద్వారా ప్రజలకే మేలు చేకూరుతుందని, కంకి కొడవలి గుర్తుకు ఓట్లు వేసి సిపిఐ, టిడిపి, ప్రజా సంఘాల కూటమి అభ్యర్థును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల సమయంలో పూటకో పార్టీ మారుతూ, నిమిషానికో కండువా కప్పుకునే కంత్రీగాళ్లు మీ వద్దకు వస్తుంటారని, కళ్లబొల్లి మాటలు చెప్పిన ఓట్లు దండుకుని ముఖం చాటేస్తారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా మం చివారైన సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌తో సీట్ల సంఖ్య సర్ధుబాటు కాని కారణంగా సిపిఐ కూటమి 60 డివిజన్ల వ్యాప్తంగా పోటీలో ఉందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు, అభిష్టాల మేరకు ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకన్న, చలిగంటి శ్రీనివాస్, వై ఉదయ్ భాస్కర్, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, కందుల భాస్కర్, గెద్దాడు నగేష్, నెరేళ్ల రమేష్, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, వంగా వెంకట్, రమణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనతో ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు


**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**ప్రజాపక్షం/కోదాడ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పును తీసుకొస్తున్నాయని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.13,600 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు కోట్ల 17 లక్షల మందికి ప్రతినెల ఒక్కొక్కరికి ఆరు కిలోల ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ ల్యాండ్ మార్క్ గేమ్‌చెంజర్ పథకమని, స్వతంత్ర్య భారత దేశ చరిత్రలో తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో సన్నబియ్యం పంపిణీ జరుగుతొందని చెప్పారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని, కుటుంబ సభ్యులను చేర్చే అవకాశం కూడా కల్పించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అభిప్రాయం పూర్తిగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కోదాడలో 35 వార్డులకు 35 వార్డులు, హుజూర్‌నగర్‌లో 28 వార్డులకు, 28 వార్డులు, నేరేడుచర్లలో 15 వార్డులకు 15 వార్డులు కాంగ్రెస్ గెలుస్తుందని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రి గా అభివృద్ధి చేస్తున్నామని, రూ.26 కోట్లతో కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణంతో పాటు సిటి స్కాన్ వంటి ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. రూ.200 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణం, ఆధునిక బస్టాండ్, బస్ డిపో, కోదాడ హైద్రాబాద్‌కు ఎసి బస్ షటిల్ సేవలు, బాలాజీనగర్‌లో 50 కోట్లతో జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పారదర్శకమైన ప్రజాస్వామ్య పరిపాలన అందిస్తోందని అన్నారు. ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి వార్డు కౌన్సిలర్లను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మృతి చెందిన కర్ల రాజేష్ కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపి, వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని స్పష్టంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కందుల కోటేశ్వరరావు, రామినేని శ్రీనివాస్, ఈదుల కృష్ణయ్య, బాల్‌రెడ్డి, చింతలపాటి శ్రీనివాస్, పంది తిరపయ్య పాల్గొన్నారు.

## పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు

● తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల ● హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఊరటనిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేసింది. రెండు సంవత్సరాలుగా నిధుల కోసం ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీలకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా మారింది. ఎన్నికల జాప్యంతో గత రెండేళ్లుగా 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. బిసి రిజర్వేషన్‌ల పెంపు అంశంపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయ్యే వరకు నిధుల విడుదల సాధ్యం కాదని స్పష్టం చేసింది. దీనివల్ల గ్రామ పంచాయతీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**మంత్రి సీతక్క చొరవ..**

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి తెచ్చారు. ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు ఇతర కేంద్ర పెద్దలను పలు దఫాలు కలిసి రాష్ట్ర పరిస్థితిని వివరించారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులు నిలిచిపోవడం, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఎన్నికలు పూర్తికాకపోవడంతో నిధుల విడుదలకు కేంద్రం ముందుకు రాలేదు. ఎన్నికల అనంతరం మార్చి 31 లోపు నిధులు విడుదల కాకపోతే అవి శాశ్వతంగా రద్దయ్యే ప్రమాదం ఉండటంతో మంత్రి సీతక్క ప్రత్యేకంగా ప్రక్రియను వేగవంతం చేశారు. సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి కేంద్రంతో నిరంతర సంప్రదింపులు కొనసాగించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్‌తో పాటు ఇతర అధికారులు కూడా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి నిధుల విడుదలకు కృషి చేశారు. ఈ సమిష్టి ప్రయత్నాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రక్రియను ప్రారంభించింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ.3000 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. అందులో తొలి విడతగా రూ.259.36 కోట్ల విడుదలతో గ్రామ పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. మిగిలిన నిధులు కూడా దశలవారీగా విడుదల చేయాల్సి ఉంది. నిధుల విడుదలపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. మిగిలిన పెండింగ్ నిధులను కూడా ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే గ్రామ పంచాయతీలకు సమయానికి నిధులు అందడం అత్యంత అవసరమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



## మేధావుల మౌనం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరం

**బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వికృత భాషతో తెలంగాణ ప్రతిష్ట దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి వైఖరి పట్ల తెలంగాణ మేధావులు ఆలోచించాల్సిన, స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు కోరారు. మేధావుల మౌనం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరమని,అందుకే వారు ఆలోచించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ఎల్‌పి విప్ కె.పి.వివేకానంద,ఎంఎల్ఎ ముఠాగోపాల్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం అందరూ కలిసి కొట్లాడామని, పోరాటం చేశామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను చిన్నబుచ్చే ప్రయత్నం, ఔన్నత్యాన్ని రేవంత్ రెడ్డి తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.జాబ్ క్యాలెండర్ ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్.. నెలకోక స్కామ్‌తో స్కాం క్యాలెండర్‌ను అమలు చేస్తున్నారని, పాలనను గాలికి వదిలి, జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. అమెరికా పర్యటన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే చాలా ఆవేదన కలుగుతుందన్నారు.

## 120 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ కళాశాల

**నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ విద్య విస్తరణలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో కొత్త వ్యవసాయ కళాశాల కు సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కళాశాల ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ విద్యను మరింత విస్తరించి, రైతు సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ జిల్లాలో కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదించారని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని సుద్దపల్లి, నడపల్లి గ్రామాల పరిధిలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సర్వే నంబర్లు 265/1, 277, 334లో మొత్తం 120 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక వ్యవసాయ కళాశాల నిర్మించనున్నారని, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత, పరిశోధన, శిక్షణ,రైతు సేవలను ఒకేచోట అందించేందుకు ఈ కళాశాల రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పడనున్న ఈ కళాశాల రాష్ట్ర వ్యవసాయ రంగానికి ఒక ముఖ్య మైలురాయిగా నిలవనుందన్నారు. విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ విద్య అందించడంతో పాటు రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని ఆధునీకరించి, యువతను వ్యవసాయ రంగంలో ఆకర్షించేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణాన్ని చేపట్టిందని మంత్రి వివరించారు. వ్యవసాయ కళాశాల శంకుస్థాపన కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తుమ్మల కోరారు.

**కళాశాల ప్రత్యేకత ...**

- 5 ఎకరాలలో ఆధునిక అకడమిక్ బ్లాక్, పరిపాలన భవనాలు
- 2 ఎకరాలలో అత్యాధునిక 10 ప్రయోగశాలలు
- 2 ఎకరాలలో 1000 మంది విద్యార్థులకు వసతి గృహాలు .
- 1 ఎకరంలో లైబ్రరీ.
- 50 ఎకరాలలో విస్తృత పరిశోధన ఫార్మ్‌లు,సీడ్ ఫార్మ్‌లు.
- 20 ఎకరాలలో విద్యార్థుల ప్రాక్టికల్ శిక్షణ కోసం ప్రత్యేక ఫార్మ్‌లు.
- 10 ఎకరాలలో మోడల్ ఫార్, రైతు శిక్షణ బ్లాక్.
- 10 ఎకరాలలో సైన్స్ మ్యూజియం, బొటానికల్ గార్డెన్.
- 8 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్,ఇండోర్ స్టేడియం
- 3 ఎకరాలలో ఆడిటోరియం, గ్యాలరీ సెమినార్ హాళ్లు
- 3 ఎకరాలలో అధ్యాపకులు,సిబ్బందికి నివాస వసతులు
- 1 ఎకరంలో ఆరోగ్య కేంద్రం1,ఇతర మౌలిక సదుపాయాలు

## ఏ ఒక్క హామీ కాంగ్రెస్ అమలు చేయలే

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని బి వై నగర్ చౌరస్తా, వెంకంపేట, గాంధీ నగర్, కొత్త బస్టాండ్,శాంతినగర్‌లలో పట్టణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయడం ఖాయం అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల పోటీ, గత 10 సంవత్సరాల పాటు ప్రజలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేసిన పార్టీకి రెండు ఏళ్ళలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య జరిగే ఎన్నికలు అన్నారు. మరోసారి కెసిఆర్ ను ముఖ్యమంత్రి చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తానని చెబుతున్నారని ఇప్పటికీ ఎన్ని పంట కాలాలు గడిచాయో? ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో చెప్పాలని ప్రశ్నించారు. కెసిఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలో చిన్న జిల్లాలు ఏర్పాటు చేసి పాలనను సులభతరం చేసిన పార్టీకి ఓటేయాలో నిర్ణయించుకోవాలని విజపి చేశారు. మరోసారి సిరిసిల్ల మున్సిపల్ పైన బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో తుల ఉమ, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కొండూరి రవీందర్ రావు, జిందం కళ చక్రపాణి, చీటీ నర్సింగరావు, చిక్కాల రామారావు, వార్డ్ అభ్యర్థులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతికి 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట



- రెండేండ్లలోనే రూ. 17,472 కోట్ల కేటాయింపు
- 130 మున్సిపాలిటీల్లో 3,994 అభివృద్ధి పనులు
- మున్సిపల్ శాఖలో కీలక సంస్కరణలు
- మున్సిపల్ మంత్రిగా ముఖ్యమంత్రి 'స్పెషల్ ఫోకస్'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు కేటాయిస్తూ రికార్డు సృష్టించింది. వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలకు మొత్తం రూ.17,472.22 కోట్లను విడుదల చేసి, దాదాపు 3,994 అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, వరద నియంత్రణ చర్యలు, చెరువుల కాలుష్య నియంత్రణ, కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పన, పబ్లిక్ పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణ వంటి పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ, పట్టణాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ శాఖలో కీలక సంస్కరణలను అమలు చేస్తూ, పరిపాలనా సౌలభ్యం, మెరుగైన పౌర సేవలు, సమర్థవంతమైన పర్యవేక్షణకు మార్గం సుగమం చేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఒకే శాఖగా ఉన్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ (ఎంఎయుడి) విభాగాన్ని రెండు భాగాలుగా విభజించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని జిహెచ్ఎంసి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఒక అర్బన్ విభాగంగా ఏర్పాటు చేసి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించారు. కోర్ అర్బన్ ఏరియా వెలుపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కోసం మరో విభాగాన్ని ఏర్పాటు చేసి, సీనియర్ ఐఎఎస్ అధికారిని బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేయాలనే భవిష్యత్తు దృక్పథంతో ముఖ్యమంత్రి స్వయంగా ప్రణాళికలు రూపొందించేందుకు చొరవతీసుకున్నారు. 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ నిధులు రూ.996.27 కోట్లను పట్టణాభివృద్ధికి విడుదల చేయడం విశేషం. గతంలో రాష్ట్ర వాటా నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వాటాను వెంటవెంటనే విడుదల చేయడంతో, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యాయి. ఇక రాష్ట్రాల ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (ఎస్ఎఎస్‌సిఐ) పథకం కింద అవసరమైన సంస్కరణలను ప్రభుత్వం పూర్తి చేయడంతో, సంస్కరణల అనుసంధాన సహాయంగా రూ.1,698 కోట్ల నిధులను పొందేందుకు తెలంగాణ అర్హత సాధించడం విశేషంగా నిలిచింది.

**రెండేళ్లలో కేటాయించిన నిధుల వివరాలు..**

- నగరాభివృద్ధి, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యుడిఐఎఫ్). 130 మున్సిపాలిటీల్లో 2,374 పనులకు రూ.9,387.11 కోట్లు.
- తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ. 85 మున్సిపాలిటీల్లో 1,166 పనులకు రూ.1,896.96 కోట్లు.
- ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా 110 మున్సిపాలిటీలకు రూ.462.19 కోట్లు.
- స్వచ్ఛ భారత్ పథకంలో 236 మున్సిపాలిటీల్లో 347 పనులకు రూ.462.19 కోట్లు. (ఇందులో రాష్ట్ర వాటా రూ.286.20 కోట్లు, కేంద్ర వాటా రూ.175.99 కోట్లు).
- అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మేషన్(ఏఎంఆర్‌యుటి) పథకం, 109 మున్సిపాలిటీల్లో 107 పనులకు రూ.4,729.69 కోట్లు.
- రెండేళ్లలోనే పట్టణాభివృద్ధికి ఇంత పెద్ద స్థాయిలో నిధులు, సంస్కరణలు అమలు చేయడం ప్రజా ప్రభుత్వ ప్రత్యేకతగా నిలుస్తోంది.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

NIT No.64, పని పేరు: 2 పనుల కొరకు జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ & అత్తాపూర్ సర్కిల్‌లో కంకర సరఫరా మరియు విస్తరణ, అలాగే రహదారి నిర్వహణ. అంచనా విలువ / ఇసివి: రూ.2.90లక్షలు, డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం: 05.02.2026న సా.4.30గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 09.02.2026న సా.4.40గం.ల వరకు, ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం.9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14995-PP/CL/ADVT/1/2025-26, Date: 05-02-2026

తెలంగాణ ప్రభుత్వం
కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆర్&బి) కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

NIT షార్ట్ టెండర్ నోటీస్ నెం. EE/R&B/MDCL/07/2025-26/ తేదీ. 05.02.2026

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కీసర మండలం, కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో 2026 సంవత్సరపు మహాశివరాత్రి జాతర సందర్భంగా క్యూ లైన్లు మరియు పార్కింగ్ కోసం బారికేడింగ్ ఏర్పాటు చేయడం, సైనేజీలు (ఫ్లెక్సీలు) ఏర్పాటు చేయడం మరియు ఇన్స్‌పెక్షన్ బంగ్లాకు కొన్ని మరమ్మతులు చేయడం వంటి మూడు (03) పనుల కోసం, మొత్తం రూ. 8.35 లక్షల అంచనా వ్యయంతో, ఈ క్రింద సంతకం చేసిన వారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా అత్యవసర ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. బిడ్ అప్‌లోడ్ ప్రారంభ తేదీ: 05.02.2026 మధ్యాహ్నం 03.30 గంటల నుండి, ముగింపు తేదీ: 09.02.2026 ఉదయం 10.30 గంటల వరకు. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆర్&బి) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా

DIPR R.O. No. : 15009-PP/CL/ADVT/1/2025-26, Date: 05-02-2026



## కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ కమిషన్ సభ్యులు భూమి సునీల్ తండ్రి మేక సంజీవ రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం గిరిజన కౌలు రైతు కుటుంబానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండ రెడ్డి గురువారం రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ఒక రైతు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న గిరిజన కౌలు రైతు కుటుంబానికి హైదరాబాద్, తార్నాకలోని లీఫ్స్ కార్యాలయంలో కోదండ రెడ్డి రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. కాగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నకమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డి, రాములు నాయక్, గోపాల్ రెడ్డి కూడా ఆ కుటుంబానికి అప్పటి కప్పుడు మరో రూ,15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, గిరిజన రైతు కుటుంబ సభ్యులు లావణ్య, ఆమె కుమార్తెలు తేజశ్రీ , అంజలి, కుమారుడు జస్వంత ఆర్య పాల్గొన్నారు.

## గ్రూప్-1 నియామకాలపై సిఎం ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రూప్1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. ఎందరు, ఎన్ని కుట్రలు పన్ని ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని సిఎం పేర్కొన్నారు. ఈ మేరకు హైకోర్టు తీర్పుపై సిఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో 563 మంది గ్రూప్1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి గ్రూప్1 అధికారులుగా అభ్యర్థులు నియమితులయ్యారని, ఇక రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునరంకితం కావాలని సిఎం వారికి పిలుపునిచ్చారు.

## రేవంత్ పిటిషన్‌లో పోలీసులకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై ఉన్న రెండు క్రిమినల్ కేసులను రద్దు చేయాలని కోరుతూ సిఎం రేవంత్‌రెడ్డి వేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు ప్రతివాదులైన పోలీసులు, ఫిర్యాదుదారుడికి నోటీసులిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు, ఫిర్యాదుదారుడైన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డికు నోటీసులు ఇచ్చింది. మొగుళ్లపల్లి, భూపాలపల్లి పోలీసు స్టేషన్లలో 2023లో నమోదైన రెండు క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ రేవంత్ వేసిన పిటిషన్లను జస్టిస్ సుజన విచారించారు. గండ్ర వెంకట రమణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా పెట్టిన కేసుల్ని సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 21కి వాయిదా వేశారు.

## ఒమన్ రాయబారితో జితేందర్ రెడ్డి భేటీ

### తెలంగాణలో పెట్టుబడులు, ఉపాధి, క్రీడా సహకారంపై కీలక చర్చలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ, ఒమన్ మధ్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కించే దిశగా ఒమన్ రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీతో చర్చలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి.జితేందర్ రెడ్డి చెప్పారు. న్యూఢిల్లీలోని ఒమన్ రాయబార కార్యాలయంలో ఒమన్ రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీతో ఆయన గురువారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణలోని పెట్టుబడి అనుకూలమైన విధానాలను జితేందర్ రెడ్డి వివరించారు. ముఖ్యంగా ఐటి, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఒమన్ పెట్టుబడులకు ఉన్న అవకాశాలను రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ నుంచి గ్రానైట్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులను ఒమన్‌కు ఎగుమతి చేయడంపై సానుకూల చర్చలు జరిగాయి. తెలంగాణ, ఒమన్ మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంచేందుకు తెలంగాణ, ఒమన్ జట్ల మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించాలని జితేందర్ రెడ్డి ప్రతిపాదించగా, ఇందుకు రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీ సానుకూలంగా స్పందించారు. ఒమన్‌లో నివసిస్తున్న తెలంగాణ వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేకంగా చర్చించారు. తెలంగాణ పారిశ్రామిక వృద్ధిని ఇస్సా సలేహ్ అల్ షిబానీ అభినందించారు. త్వరలోనే ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలతో తదుపరి చర్చలు జరుపుతామని చెప్పారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, ఒమన్ వంటి దేశాలతో దీర్ఘకాలిక భాగస్వామ్యం ఏర్పడటం వల్ల ఇరుపక్షాలకు ఆర్థికంగా, సాంస్కృతికగా గొప్ప ప్రయోజనం చేకూరుతుందన్నారు.

## మహిళ న్యాయవాది హత్య దారుణం

### ఐఎఎల్ ఖండన

**ప్రజాపక్షం / హైదరాబాద్:** చేవెళ్ళలో మహిళా న్యాయవాది స్వప్న కిరాతక హత్యను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. నిందితునికి అత్యంత కఠిన శిక్ష పడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తనపై హత్యాయత్నం జరిగిందన గతంలో న్యాయవాది స్వప్న చేసిన ఫిర్యాదుపై సరైన స్పందన లేకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. న్యాయవాదులు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## గత 12 ఏళ్లుగా పట్టణాలు విస్మరణ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత 12 ఏళ్లుగా తెలంగాణను పాలించిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ ముషీరాబాద్‌లోని కాశిష్ ఫంక్షన్ హాల్లో ' పట్టణ తెలంగాణలో 12 ఏళ్ల క్షీణ(బిఆర్ఎస్ కాంగ్రెస్ వారసత్వం అనే అంశంపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు సుమారు రూ.3,600 కోట్ల అప్పుల్లో ఉన్నాయని, ఒక్క జిహెచ్ఎంసి అప్పులే రూ.5,000 కోట్లకు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కేవలం అవినీతి, కమీషన్ల కోసమే ప్రాజెక్టులు చేపట్టారని, దీనివల్ల స్థానిక సంస్థలు ఆర్థికంగా పతనమయ్యాయని విమర్శించారు. ఎన్నికల ముందు 6 గ్యారంటీలు, 420కి పైగా హామీలిచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ప్రజలను వంచించిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి గత 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని రాంచందర్ రావు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపిలు, ఎమ్మెల్సీలు, మహారాష్ట్ర మంత్రి, బిజెపి మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆశిష్ షెలార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందద్ గౌడ్, సీనియర్ నాయకులు బీబీ పాటిల్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్రీ భరత్ గౌడ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# జిహెచ్ఎంసి ఆదాయానికి గండి

### బహుళ భవనాల అనుమతుల మంజూరు ఇక హెచ్ఎండిఎకు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బల్దియా పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు(10 అంతస్తులు)పైబడిన నిర్మాణ అనుమతుల మంజూరు బాధ్యతలను ఇక నుంచి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) హెచ్ఎండిఏకు అప్పగించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై ఇప్పటికే ఉన్నత స్థాయిలో నిర్ణయం జరిగినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఒక ఉన్నతాధికారి చెప్పారు. జిహెచ్ఎంసిని త్వరలోనే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మూడు కార్పొరేషన్లుగా విభజించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మూడు కార్పొరేషన్‌లకు సంబంధించిన కసరత్తు ప్రభుత్వం పూర్తి చేసింది. మూడు కార్పొరేషన్‌ల వారిగా ఉన్నతాధికారులు, సిబ్బంది విభజన ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తయింది. ఈనెల 10వ తేదీతో ప్రస్తుత పాలకమండలి పదవికాలం ముగియనుంది. పదవికాలం ముగిసిన వెంటనే మూడు కార్పొరేషన్‌లకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులు హెచ్‌ఎండిఏకు అప్పగించడం ద్వారా భారీ ప్రాజెక్టులపై కేంద్రీకృత నియంత్రణను ఉంచుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న బహుళ అంతస్తుల అనుమతుల జారీ కార్పొరేషన్‌లకు దూరమయితే అప్పుల ఊబిలో ఉన్న కార్పొరేషన్ పరిస్థితి అగమ్యగోచరంగా మారే పరిస్థితులు నెలకొంటాయి.

### హెచ్ఎండిఏ కమిషనర్ ప్రతిపాదనకు సర్కార్ గ్రీన్ సిగ్నల్..

దీంతో జిహెచ్ఎంసి పరిధి విస్తరించినప్పటికీ, ఆదాయం విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరేలా కనిపించడం లేదు. ప్రధానంగా నగరంలోని రియల్ ఎస్టేట్ హాట్ స్పాట్‌ల నుండి వచ్చే భారీ ఆదాయాన్ని హెచ్‌ఎండిఏతో పంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, విస్తరించిన జిహెచ్ఎంసి పరిధిలోని టౌన్ ప్లానింగ్ సేవల్లో కొంత భాగాన్ని హెచ్ఎండిఏ వద్దే ఉంచేలా ప్రభుత్వం ఒక ప్రతిపాదనను ఆమోదించింది. హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ రూపొందించిన ఈ ప్రతిపాదన ప్రకారం, 10 అంతస్తుల కంటే ఎక్కువ ఉన్న భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అధికారం కేవలం హెచ్ఎండిఏకు మాత్రమే ఉంటుంది. ఈ నిబంధన కేవలం కొత్తగా విలీనమైన 27 మున్సిపాలిటీలకే కాకుండా, పాత జిహెచ్ఎంసి పరిధిలోని ప్రాంతాలకు కూడా వర్తించనుంది. ఈ నిర్ణయంతో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత డిమాండ్ ఉన్న ఈ క్రింది ప్రాంతాల నుండి వచ్చే టౌన్ ప్లానింగ్ ఆదాయం జిహెచ్ఎంసికి దూరమయ్యే అవకాశం ఉంది. కోకాపేట్, నార్సింగి, బుద్వేల్, తెల్లాపూర్ (ఇక్కడ 4060 అంతస్తుల ఆకాశహర్మ్యాలు సర్వసాధారణం). ఘటకేసర్ వంటి ప్రాంతాల్లోనూ ప్రస్తుతం 72 అంతస్తుల వరకు భారీ నివాస సముదాయాలు వెలుస్తున్నాయి. మునుపటి నిబంధనల ప్రకారం, 15 మీటర్ల ఎత్తు (5 అంతస్తులు) వరకు మాత్రమే స్థానిక సంస్థలకు అధికారాలు ఉండేవి. ఆ పైన ఉన్న వాటికి హెచ్ఎండిఏ అనుమతి తప్పనిసరి. అయితే తాజా విస్తరణ తర్వాత మొత్తం ఆదాయం జిహెచ్ఎంసికే వెళ్తుందని భావించిన తరుణంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

### జిహెచ్ఎంసి అప్పులు చెల్లించేదేంట్లా?

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం(ఎస్ఆర్‌డిపి) కోసం జిహెచ్ఎంసి టర్మ్‌లోన్స్, బాండ్స్ ద్వారా రుణాలు సేకరించింది. సుమారు రూ.5 వేల కోట్ల వరకు జిహెచ్ఎంసి అప్పులు ఉన్నాయి. జిహెచ్ఎంసికి ప్రధానంగా ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల ద్వారా మాత్రమే ఆదాయం సమకురుతుంది. ఆస్తిపన్ను ద్వారా రూ.2 వేల కోట్లు, భవన నిర్మాణా అనుమతుల ద్వారా రూ.12 వందల కోట్ల వరకు ఆదాయం సమకురేది. సిబ్బంది వేతనాలు, నిర్వహణ పనులకు, చేసిన అప్పులు చెల్లిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం భవన నిర్మాణ అనుమతులను ఇక హెచ్ఎండిఏకు అప్పగిస్తే జిహెచ్ఎంసికి ప్రతినెల బాండ్స్, టర్మ్‌లోన్స్‌లకు ఏవిధంగా చెల్లింపులు జరుపుతారనే విషయంపై అధికారుల వద్ద సమాధానం లభించడం లేదు.

### హెచ్ఎండిఏ ఆదాయ వనరుల కోసమేనా?

హెచ్ఎండిఏ చేపట్టిన రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీగా నిధులు అవసరం. జిహెచ్ఎంసి విస్తరణ తర్వాత కొత్తగా అభివృద్ధి చెందే ప్రాం తాల నుండి ఆదాయం రావడానికి సమయం పడుతుం ది. ప్రస్తుత ఆదాయ వనరులను కాపాడుకోవడానికే ఈ 'రెవెన్యూ షేరింగ్' ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. 'హెచ్ఎండిఏ ప్రాజెక్టులు కొనసాగాలంటే ని ధుల లభ్యత ముఖ్యం. అందుకే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి తెలిపారు. మరోవైపు, జిహెచ్ఎంసిని త్వరలోనే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు కార్పొరేషన్లుగా విభజించే యోచనలో ప్రభుత్వం ఉం ది. ఈ నేపథ్యంలో భారీ ప్రాజెక్టులపై కేంద్రీకృత నియంత్రణను ఉంచుకోవడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20% నిధులివ్వాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు మౌలిక వసతులు కల్పించాలని, పూర్వ ప్రాథమిక విద్యను అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎంపి ఫౌండేషన్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ''విద్యకు బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలి'' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనికి టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ఎంఎల్‌సి డా. దాసోజ్ శ్రవణ్, మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి, బిఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహం శేఖర్, టిపిజెఎసి నేత కన్నెగంటి రవి, ప్రొఫెసర్ కె.లక్ష్మీ నారాయణ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ సామాజిక మార్పు ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా చేయడమే సరైన మార్గమన్నారు. అందుకే ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన సరళీకరణ విధానం ముందుకెళ్లలేదన్నారు. 1980 తర్వాత అట్టడుగు వర్గాల పిల్లలు చదువుకొనేందుకు ఆసక్తి చూపడంతో విపరీతంగా ప్రవేశాల డిమాండ్ పెరిగిందని, ఈ క్రమంలో తమ దగ్గర నిధుల్లేవని ప్రభుత్వ పెద్దలు చేతులెత్తేయడంతో మెల్లమెల్లగా విద్యావ్యవస్థ మెల్లమెల్లగా పతనం అయిపోయిందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా విద్యకు నిధుల కేటాయింపు తగ్గిపోవడంతో విద్యావ్యవస్థ సంక్షోభం తీవ్రతరమైందన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రజలను మేల్కొలిపి లక్ష్యం, కార్యాచరణతో ముందుకెళ్లి సంఘటిత ప్రయత్నం చేయాలని, ఈ ఉద్యమంలో తాను భాగస్వామ్యమవుతానని తెలిపారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం వెచ్చించే ఖర్చులను వ్యయంగా చూడకూడదని, అవి రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడులుగా భావించాలని సూచించారు. ప్రభుత్వ బడులకు నిధులు లేమి, ప్రైవేట్ స్కూళ్లపై నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు విద్యాశాఖ మంత్రిగా నియమిస్తే వచ్చే నష్టం ఏమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ బడుల్లో 25శాతం సీట్లు కేటాయించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య నేతలు మానస, మైత్రి, సిఆర్‌పిఎఫ్ తెలంగాణ అధ్యక్షులు జి.వేణుగోపాల్, తల్లుల సంఘం అధ్యక్షురాలు జి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో 160 హోలీ స్పెషల్ రైళ్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే హోలీ పం డుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మార్చి నెలలో రికార్డు స్థాయిలో 160 హోలీ స్పెష ల్ రైళ్లను నడపనున్నట్లు ఎస్‌సిఆర్ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ. శ్రీధర్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా హోలీ పండుగ నేపథ్యంలో ప్రయాణ అవసరాలు పెరిగిన నేపథ్యంలో, భారతీయ రైల్వేలు మొత్తం 1,410 ప్రత్యేక రైళ్లను ప్రణాళికలో పెట్టగా, అవసరాన్ని బట్టి ఈ సంఖ్యను 1,500 వరకు పెంచే అవకాశముందని అధికారులు వెల్లడించారు. గతేడాది హోలీ సందర్భంగా దేశవ్యాప్తంగా 1,144 ప్రత్యేక రైళ్ల ప్రయాణాలు మాత్రమే నిర్వహించారని తెలిపారు.ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే తన పరిధి నుంచి ప్రత్యేకంగా 160 స్పెషల్ రైళ్లను నడపడం విశేషంగా నిలుస్తోందని శ్రీధర్ పేర్కొన్నారు. ఇవి దేశంలోని కీలక ప్రాంతాలకు నేరుగా కనెక్టివిటీ కల్పించనున్నాయన్నారు. ఎస్‌సిఆర్ నుంచి నడిచే ఈ హోలీ స్పెషల్ రైళ్లు వి శాఖపట్నం, పట్నా, రాజ్‌కోట్, సోలాపూర్, బిలాస్‌పూర్, దానాపూర్, రాక్సౌల్, నహర్లాగున్, హ్రజ త్ నిజాముద్దీన్, షాలిమార్, హిసార్, లక్నో, సంత్రాగాచి, మాల్డా టౌన్, ఛాప్రా వంటి ముఖ్య గమ్యస్థానాలను కలుపుతూ ప్రయాణిస్తాయి. అలాగే ఈ అన్ని ప్రాంతాల నుంచి తిరుగు ప్రయాణాలకూ ప్రత్యేక రైళ్లను ప్రణాళికలో చేర్చడం ద్వారా రెండు దిశల ప్రయాణికులకు సౌకర్యం కల్పించారని ఆయన తెలిపారు.ఈ అదనపు రైళ్లు పండుగ రద్దీని గణనీయంగా తగ్గించడంతో పాటు, నేరుగా అనేక ప్రాంతాలకు కనెక్టివిటీ అందించి ప్రయాణ సమయాన్ని తగ్గించనున్నాయి. గుంపుల నియంత్రణ, భద్రతతో కూడిన ప్రయాణం, మెరుగైన ప్రయాణ అనుభవం అందించడమే లక్ష్యంగా రైల్వేలు ఈ చర్యలు చేపట్టినట్లు శ్రీధర్ తెలిపారు.పండుగల సమయంలో ప్రయాణికుల సౌకర్యం, భద్రత, సమర్థవంతమైన నిర్వహణకు దక్షిణ మధ్య రైల్వే ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్‌సిఆర్ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో బయోఏషియా–2026

- 17,18న హెచ్ఐసిసి వేదికగా అంతర్జాతీయ లైఫ్ సైన్సెస్ సదస్సు
- 50 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధుల హాజరు
- సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచంలోనే అతి పెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ సదస్సుగా ప్రత్యేక గుర్తింపు పొందిన బయోఏషియా–2026 సదస్సు ఈ నెల 17, 18 తేదీల్లో మాదాపూర్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి)లో జరగనుంది. 23వ ఎడిషన్‌గా నిర్వహించనున్న ఈ ప్రతిష్టాత్మక సదస్సును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించనున్నారు. టెక్‌బయో అన్‌లీష్డ్ ఎఐ, ఆటోమేషన్–బయాలజీ రివల్యూషన్ అనే థీమ్‌తో జరగనున్న ఈ సదస్సులో గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ రంగాల్లో వస్తున్న సరికొత్త ఆవిష్కరణలు, శాస్త్రీయ పురోగతి, ఎఐ ప్రభావంపై విస్తృత చర్చలు జరగనున్నాయి. 50 దేశాల నుంచి 3 వేల మంది ప్రతినిధులు ఈ సదస్సుకు 50 దేశాలకు చెందిన సుమారు 3 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రపంచ ప్రఖ్యాత బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్ సంస్థల సిఈఓలు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు ఈ వేదికపై పాల్గొని తమ అనుభవాలు, ఆలోచనలు పంచుకోనున్నారు.

### ఎఐ, జీన్ థెరపీపై ప్రత్యేక ఫోకస్

హెల్త్‌కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, సెల్, జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ, డిజిటల్ హెల్త్, బయో ఫార్మాస్యూటికల్స్, మెడికల్ డివైసెస్, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ వంటి అంశాలు ప్రధాన అజెండాగా చర్చకు రానున్నాయి.

### సిఇఒ కాన్‌క్లేవ్ ప్రత్యేక ఆకర్షణ

ఫార్మా – బయోటెక్ భవిష్యత్తు అంశంపై ప్రత్యేకంగా నిర్వహించే సీఈఓ కాన్‌క్లేవ్‌లో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ సంస్థల సీఈఓలు పాల్గొననుండగా, నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్ట్రానిక్, మెర్క్, అస్ట్రాజెనెకా సంస్థల ప్రతినిధులతో ప్యానల్ చర్చలు జరగనున్నాయి.

### తెలంగాణకు మరో మైలురాయి

గత రెండు దశాబ్దాలుగా బయోఏషియా సదస్సు ఆసియాలో అగ్రగామి లైఫ్ సైన్సెస్ వేదికగా ఎదిగింది. బయోఏషియా–2026 ద్వారా హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ హబ్గా మరింత గుర్తింపు పొందనుంది. గ్లోబల్ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తెలంగాణను నిలబెట్టడంలో ఈ సదస్సు మరో మైలురాయిగా నిలవనుంది.

## బసవతారకంలో ఆంకాలజీస్టులకు పూర్తయిన ప్రత్యేక శిక్షణ


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో తమిళనాడులోని ప్రభుత్వ వైద్యశాలలలో పనిచేస్తున్న సర్జికల్ ఆంకాలజిస్టుల కోసం గైనకాలజికల్ ఆంకాలజీలో నిర్వహించిన ప్రత్యేక సర్జికల్ శిక్షణా కార్యక్రమం బుధవారం విజయవంతంగా పూర్తైంది. తమిళనాడులో అంటువ్యాధి కాని వ్యాధుల నివారణ, నియంత్రణ ప్రాజెక్ట్ (టిఎన్ఎన్‌సిడి (ఆంకాలజీ) ప్రాజెక్ట్) కింద నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన ఎంపిక చేయబడ్డ సర్జికల్ ఆంకాలజిస్టులు, అనస్థీషియాలజిస్టులు మరియు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమం తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) మధ్య ఒక సాంకేతిక సహకార ప్రాజెక్ట్. క్యాన్సర్ నియంత్రణలో తమిళనాడు ప్రభుత్వం నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఉచిత హామీలపై 'పిల్ 'విచారణకు 'సుప్రీం' ఓకే

**న్యూఢిల్లీ :** ఎన్నికలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు అసంబద్ధమైన ఉచిత హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల గుర్తులు, ఆ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్)ను విచారించేందుకు గురువారం సుప్రీంకోర్టు అంగీకరించింది.

# తెలంగాణలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

### అమలు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, రానున్న ఏప్రిల్ లేదా మే నెలలో 'ఎస్ఐఆర్'కు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. రానున్న ప్రత్యేక సుదీర్ఘ సవరణను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌కు కనీసం ఒక బూత్ లెవల్ ఏజెంట్‌ను (బిఎల్ఎ) నియమించాలని రాజకీయ పార్టీలను సుదర్శన్ రెడ్డి కోరారు. బూత్ స్థాయిలో బల మైన సమన్వయానికి ఈ ప్రక్రియ కీలకమన్నారు. హైదరాబాద్‌లోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాల యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సుదర్శన్ రెడ్డి గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బిఎల్‌ఏలను సాధ్యమైనంతవరకు ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని స్థానికుల నుంచే ఎంపిక చేయాలని, వారు బూత్ లెవల్ అధికారులతో (బిఎల్‌ఒలు) సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమస్యల సకాల పరిష్కారానికి ప్రతి పోలింగ్ బూత్‌నకు కనీసం ఒక బిఎల్ఏ తప్పనిసరిగా ఉండాలన్నారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సమయం పరిమితంగా ఉండటంతో రాష్ట్రంలో ముందస్తు సన్నాహక పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ సన్నాహక చర్యలల్లో భాగంగా 2025 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను 2002 ఎస్ఐఆర్‌లో నమోదైన ఓటర్లతో అనుసంధానించే విధంగా టేబుల్ టాప్ మ్యాపింగ్ చేపట్టామని తెలిపారు. అనంతరం ఫీల్డ్ స్థాయి మ్యాపింగ్ కొనసాగుతుండగా, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నివాసాలను గుర్తించి ధృవీకరించేందుకు బిఎల్‌ఒలు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు.

### మూడు సార్లు సందర్శిస్తారు.

ఎస్ఐఆర్ సమయంలో ప్రతి పోలింగ్ ప్రాంతాన్ని బిఎల్‌ఒలు మూడు నుంచి నాలుగు సార్లు సందర్శిస్తారని సుదర్శన్ రెడ్డి తెలిపారు. మొదటి సందర్శనలో ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని, తదుపరి సందర్శనల్లో ముందుగా అందుబాటులో లేని కుటుంబాలను కవర్ చేస్తారని, సన్నాహక దశలో మ్యాపింగ్ కాకపోయిన ఓటర్లు కూడా ఎస్ఐఆర్ సమయంలో తమ వివరాలు సమర్పించుకునే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అందుకే అన్ని పోలింగ్ స్టేషన్లకు బిఎల్‌ఏల నియామకాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. బూత్ స్థాయిలో సమర్థవంతంగా పాల్గొని, ఫిర్యాదులను తగ్గించి, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా చేయడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సిఆర్ఒ హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అవే నిరసనలు...

- రాహుల్‌గాంధీని సభలో మాట్లడనీయకపోవడం సహా పలు అంశాలపై లోక్‌సభలో విపక్ష ఎంపిల ఆందోళనలు
- ప్రధాని జవాబు లేకుండానే మూజువాణి ఓటు మీద రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదం



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వకపోవడం సహా పలు అంశాలపై విపక్ష ఎంపిలు పార్లమెంట్ ఉభయసభల్లో నిరసనలకు దిగారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. లోక్‌సభలో గురువారం కూడా పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, బుధవారం సభలో ప్రతిపక్ష ఎంపిల ప్రవర్తనపై స్పీకర్ ఆవేదన వ్యక్తం చేస్తూ సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ బుధవారం సాయంత్రం ప్రతిపక్ష సభ్యులు అధికార పక్షం వైపు దూసుకెళ్లిన తీరు సభ గౌరవానికి విరుద్ధమని బిర్లా అన్నారు. ఇటువంటి ప్రవర్తన సభ మర్యాద, గౌరవాన్ని దిగజారుస్తుందని, ఈ పరిస్థితులలో ఏ సభాధ్యక్షునికైనా సభను నడపడం కష్టమవుతుందని బిర్లా అన్నారు. ఆ తర్వాత ఆయన సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ ప్రారంభం కాగానే గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంప్రదాయ ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన సవరణలను ఓటింగ్‌కు పెట్టినప్పుడు ప్రధానమంత్రి సభలో లేరు, అయతే ఆ సవరణలు తిరస్కరించారు. అనంతరం స్పీకర్ జనవరి 28న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని చదివి వినిపించారు, దీనిని ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదించారు. నిరసనలు కొనసాగడంతో, స్పీకర్ సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. కాంగ్రెస్ సభ్యులు ప్రధాని మోడీ చిత్రంతో 'నరేంద్ర–సరెండర్' అనే నినాదం రాసి ఉన్న పోస్టర్లను పట్టుకుని సభ మధ్యలోకి దూసుకెళ్లారు. సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు కూడా వారణాసిలోని గంగా నదిపై ఉన్న మణికర్ణిక ఘాట్‌లోని కూల్చివేతల సమస్యను లేవనెత్తుతూ మూడు బ్యానర్లు, కరపత్రాలను పట్టుకుని సభ మధ్యలో నిలబడ్డారు. ఎస్‌పి బ్యానర్లపై దాదాపు 300 సంవత్సరాల క్రితం ఘాట్‌లను అభివృద్ధి చేసిన రాణి అహల్యాబాయి హోల్కర్ చిత్రాలు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు కూడా నిరసనలో పాల్గొంటూ సభ మధ్యలో నిలబడగా, డిఎంకె, వామపక్షాలతో సహా ఇండియా కూటమిలోని ఇతర సభ్యులు సంఘీభావంగా తమ సీట్లలో నుంచి లేచి నిలబడ్డారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, పలువురు ప్రతిపక్ష ఎంపిలు సభ మధ్యలోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభాపతి స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభ్యులను తమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. కానీ నిరసనలు కొనసాగించడంతో ఆమె సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

## రాజ్యసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య

# తీవ్ర వాగ్వాదం

- లోక్‌సభలో రాహుల్‌గాంధీని మాట్లాడనీయని అంశాన్ని లేవనెత్తిన మల్లికార్జున ఖర్గే
- అనుమతించని చైర్మన్ రాధాకృష్ణన్
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రతిపక్షాల వాకౌట్





**న్యూఢిల్లీ:** రాజ్యసభలో గురువారం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. లోక్‌సభలో రాహుల్ గాంధీని మాట్లాడటానికి అనుమతించకపోవడంపై ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాత ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఖర్గే రాహుల్‌గాంధీ అంశాన్ని లేవనెత్తారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం ఎం నరవణే రాసిన ప్రచురించని పుస్తకంలోని కొన్ని అంశాలను చదవడం ప్రారంభించంగానే, అందుకు ఆయనను అనుమతించలేదు, దీంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. సభలో ఒక మాజీ ఎంపి మృతికి సంతాపం తెలిపి జీరో అవరంలో చేపట్టాల్సిన కార్యకలాపాల పత్రాలను సభ ముందు ఉంచిన వెంటనే, ఖర్గే లోక్‌సభలో తన సహచరుడైన గాంధీని మాట్లాడటానికి అనుమతించకపోవడం అంశాన్ని లేవనెత్తారు. రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల గురించి మాట్లాడాలనుకున్నారని ఖర్గే అన్నారు. ఆయన తన మాట పూర్తి చేయకముందే, చైర్మన్ సిపి రాధాకృష్ణన్, సభాధ్యక్షుడి నిబంధనల ప్రకారం లోక్‌సభ కార్యకలాపాల గురించి ఎగువ సభలో చర్చించకూడదని చెబుతూ సభా నాయకుడు, కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి ఉంటే, వారి నాయకులు తమ లోక్‌సభ ఎంపిలను దిగువ సభలో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగే చర్చలో పాల్గొనమని సలహా ఇవ్వాలని, రాజ్యసభ కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేలా అనుమతించాలని ఆయన అన్నారు. ఆ తర్వాత జాబితాలో ఉన్న జీరో అవర్ ప్రస్తావనలను చేపట్టాలని చైర్మన్ కోరారు. దీంతో కాంగ్రెస్ ఎంపిలు ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని నినాదాలు చేయడం ప్రారంభించారు. ఆ సమయంలో చైర్మన్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. రాష్ట్రపతికి ధన్యవాద తీర్మానంపై మూడు రోజుల పాటు సజావుగా చర్చ జరిగిన తర్వాత రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తడం తనను ఆశ్చర్యపరిచిందని ఆయన అన్నారు. రాజ్యసభకు స్వంత విధానం, కార్యకలాపాల నిర్వహణకు నియమావళి ఉన్నందున, లోక్‌సభ కార్యకలాపాలను రాజ్యసభలో ప్రస్తావించకూడదనే నడ్డా వాదనను ఆయన పునరుద్ఘాటించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించాలని కోరుకోవడం లేదని ఖర్గే అన్నారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించకపోవడం వల్లే గత నాలుగు రోజులుగా లోక్‌సభ పనిచేయడం లేదని ఆయన అన్నారు. పార్లమెంటు రెండు సభలతో కూడి ఉంటుంది. అది ఒక సభతో ఏర్పడదు, అని ఆయన అన్నారు.

'ఈ రెండు (సభలు) (పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి) స్తంభాలు, కానీ మీ వైఫల్యాలను దాచడానికి ఒక స్తంభాన్ని పక్షవాతానికి గురిచేశారు... గాంధీ (వైఫల్యాల గురించి) మాట్లాడాలనుకున్నప్పుడు, మీరు చికాకు పడుతున్నారు'అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. లోక్‌సభలో జరిగిన దాని గురించి రాజ్యసభలో చర్చించకూడదని చైర్మన్ రాధాకృష్ణన్ అన్నారు. అయితే, ఖర్గే పట్టువదలక లోక్‌సభలో ఆమోదించిన బిల్లులు చర్చ కోసం రాజ్యసభకు వస్తాయని చెప్పి తన వాదనను బలపరిచారు. గాంధీని మాట్లాడటానికి అనుమతించక పోవడం ప్రజాస్వామ్యానికి, దేశానికి మంచిది కాదని ఆయన మళ్ళీ ప్రస్తావించగా, చైర్మన్ నడ్డాను మాట్లాడటానికి అనుమతించారు. ప్రభుత్వం అన్ని రూపాల్లో, అన్ని సమయాల్లో చర్చకు సిద్ధంగా ఉందని నడ్డా అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడైన ఖర్గేకు, పార్టీని స్వతంత్రంగా నడపాలని, దానిని 'అజ్ఞాని అయిన బాలుడికి'బందీగా మారకుండా చూడాలని ఆయన సలహా ఇచ్చారు. గాంధీని ఉద్దేశించి 'అజ్ఞాని అయిన బాలుడు' అనే పదాన్ని ఉపయోగించడాన్ని ఖర్గే ఖండించారు. బిజెపి ఎంపిలు తమ మనసులో మాట కూడా చెప్పలేరని ఆరోపించారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్నందున, మంత్రులు తన పార్టీకి నీతులు చెప్పలేరని ఆయన అన్నారు.

## ఏనుగుల గుంపు తొక్కి, ఒకే కుటుంబ చెందిన సభ్యులు మృతి

**బొకారో:** జార్ఖండ్‌లోని బొకారోలో గురువారం ఐదు ఏనుగుల గుంపు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని తొక్కి చంపిందని అటవీ శాఖ అధికారి తెలిపారు. ఈ ఘటన మహువాదండర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్కిపున్న గ్రామంలో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగింది.'ఏనుగుల గుంపు వరి ధాన్యం కోసం వారి ఇంటిపై దాడి చేసి, దానిలో కొంత భాగాన్ని ధ్వంసం చేసింది. ఆ ముగ్గురూ తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పుడు, ఇంటి బయట ఏనుగులు వారిని తొక్కిచంపాయి, ' అని బొకారో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సందీప్ షిండే తెలిపారు. ఆ ఏనుగుల గుంపు చాలా రోజులుగా బర్కిపున్న ప్రాంతంలో తిరుగుతోందని ఆయన చెప్పారు. మృతుల కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. జనవరి 18న, అదే మహువాదండర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కూరగాయల వ్యాపారి ఇంటికి వెళ్తుండగా ఏనుగు దాడిలో మరణించాడని షిండే చెప్పారు. జనవరి నెలలో రాష్ట్రంలో ఏనుగుల దాడిలో 25 మందికి పైగా మరణించారని అటవీ శాఖ అధికారి తెలిపారు. గతంలో పశ్చిమ సింగ్భూమ్ జిల్లాలో ఒకే మదపుటేనుగు 20 మంది ప్రాణాలను బలిగొందని ఆయన చెప్పారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం, 2019–20 ఆర్థిక సంవత్సరం నుండి జార్ఖండ్‌లోని మానవఏనుగుల సంఘర్షణల కారణంగా ఏకంగా 474 మంది మరణించారు.

# వచ్చే నెల భారత్—అమెరికా వాణిజ్య ఒప్పందం

### కేంద్రమంత్రి గోయల్



**న్యూఢిల్లీ:** భారత్—అమెరికా మధ్య వచ్చేనెల రెండోవారం నాటికి వాణిజ్య ఒప్పందం జరుగుతుందని భావిస్తున్నట్లు వాణిజ్యం—పరిశ్రమలశాఖ కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ చెప్పారు. ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత అమెరికా నుండి దిగమతయ్యే కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాలను భారత్ తగ్గించడం ప్రారంభిస్తుందని మంత్రి గురువారం పాత్రికేయులకు చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలిదశను ఖరారు చేసి, ఉమ్మడి ప్రకటనపై రాబోయే నాలుగైదు రోజుల్లో రెండు దేశాలు సంతకాలు చేస్తాయని అంచనావేస్తున్నట్లు కూడా చెప్పారు. ఈ ఒప్పందంలో పెట్టుబడులకు సంబంధించిన కట్టుబాట్లు ఏవీ లేవని చెప్పారు. భారత్‌పై విధించిన 50 శాతం సుంకాలను 18 శాతానికి అమెరికా తగ్గించిన తర్వాత ఈ పరిణామాలు సంభవించాయి. ఈ వారారంభంలోనే రెండు దేశాలు ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఖరారు చేశాయి. ప్రస్తుతం ఎగుమతి చేస్తున్న సరుకులపై భారత్ 50 శాతం సుంకాలను అమెరికాకు చెల్లిస్తోంది. ఇందులో సాధారణ టారిఫ్ 25 శాతం ఉండగా, రష్యా నుండి భారత్ చమురు దిగుమతి చేసుకుంటోందన్న వంకతో అమెరికా అదనంగా మరో 25 శాతం సుంకాలను జరిమానాగా విధించింది. ఈ ద్వైపాక్షిక ఒప్పందం (బిటిఎ)లో మొదటిదశ పత్రాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, రాబోయే ఐదు రోజుల్లో సంతకాలు జరుగుతుయని భావిస్తున్నామన్నారు. ఈ ఒప్పందంపై ఆధారపడి మొదటిదశ భాగస్వామ్యం ప్రారంభమవుతుందన్నారు. లాంఛనపూర్వకమైన ఒప్పంద పత్రాలు సిద్ధమవుతున్నాయని, మార్చి రెండో వారంనాటికి వీటిపై సంతకాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ, చట్టబద్ధంగా సంతకాలు జరిగిన పత్రాలు చేతికి వచ్చిన తర్వాత అమెరికా నుండి దిగుమతయ్యే వస్తువులపై సుంకాలను తగ్గించడానికి వీలు కలుగుతుందన్నారు. "చట్టబద్ధమైన ఒప్పందం తర్వాతే దేశంలో అమెరికా వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అవకాశం ఉంది, ఈ లోపు పాత సుంకాలే అమలులో ఉంటాయి, అత్యంత సన్నిహితదేశాల(ఎంఎఫ్ఎన్)జాబితా కింద భారతదేశం అమెరికా దిగుమతులపై ఫీజు వసూలు చేస్తుంది, భారత్ దిగుమతి వస్తువులపై అమెరికా సుంకం వసూలు చేస్తుంది'' అని చెప్పారు. 500 బిలియన్ డాలర్ల కొనుగోళ్ళ గురించి ప్రశ్నించగా, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మనదేశానికి చాలా భారీ పరిమాణంలో ఇంధనం,డేటా సెంటర్ల పరికరాలు, ఐసిటి ఉత్పత్తులు అవసరం అవుతాయని అందుకే ఈ కొనుగోళ్ళు చేయాల్సి ఉందన్నారు. మన ఉక్కు సామర్థ్యం రాబోయే కొద్ది సంవత్సరాలలో ప్రస్తుతం ఉన్న 140 మిలియన్ టన్నుల నుండి 300 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అందువల్ల మన అంచనాల ప్రకారం అమెరికా నుండి ఉక్కు అవసరం అవుతుందన్నారు. ఈ మొత్తం చివరకు 500 బిలియన్ డాలర్లుగా తేలుతుందని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాలలో మనదేశం సేకరించే ఉత్పత్తులను చూసినప్పుడు మన దేశ సామర్థ్యం ఏమిటో మనకళ్ళముందే సాక్షాత్కారమవుతుందని చెప్పారు. మన గగనయాన రంగంలో బోయింగ్‌లకు ఇప్పటికే ఆర్డర్లు ఉన్నాయని, రాబోయే రోజుల్లో పెట్టే ఆర్డర్లకు కూడా సరిపడే సామాగ్రి సిద్ధంగా ఉందని దాదాపు 70,80 బిలియన్ డాలర్ల మేరకు ఈ ఆర్డర్లు ఉంటాయన్నారు. ఇంజన్లు, ఇతర విడిభాగాలను కూడా మనకు కలిపి చూసినప్పుడు దాదాపుగా ఈ మొత్తం 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని వివరించారు. డేటా సెంటర్లకుగాను బడ్జెట్‌లో భారీ రాయితీలను ప్రకటించామని గుర్తుచేశారు. "ఇప్పుడు మీరు ఊహించండి, డేటా సెంటర్లపై మనం 100–150 బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులు సంపాదించుకోగలుగుతాం, మనకు ఈ మేరకు చూసినప్పుడు ఎలా కాదనుకున్నాగానీ ఆ డేటా సెంటర్లకు పరికరాలు అవసరం అవుతాయి'' అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భారతదేశం 300 బిలియన్ డాలర్ల మేరకు కొనుగోళ్ళు చేస్తోందన్నారు. రాబోయే ఐదేళ్ళలో ఈ కొనుగోళ్ళు మరో రెండు బిలియన్ డాలర్లు పెరుగుతాయన్నారు.

# సమాఖ్యవాదం... రాజ్యాంగ ఆదేశం...

### నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకురావడం సంస్కరణ కాదు...

### ధన్యవాద తీర్మాణంపై చర్చలో సిపిఐ రాజ్య సభ సభ్యుడు పి.పి.సునీర్



**న్యూఢిల్లీ :** కార్మిక సంస్కరణల పేరుతో కార్మికులతో అర్థవంతమైన సంప్రదింపులు లేకుండానే కేంద్ర ప్రభుత్వం 29 కి పైగా కేంద్ర కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చిందని, ఇది సంస్కరణ కాదు, చట్టాల ఉపసంహారణ అని సిపిఐ రాజ్య సభ సభ్యుడు పి.పి.సునీర్ విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలో జరిగిన ధన్యవాద తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడారు. కార్మిక కోడ్‌లు ఉద్యోగ భద్రతను బలహీనపరుస్తాయని, సామాజిక రక్షణను పలుచన చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల జీవన వాస్తవాలను ప్రతిబింబించడంలో విఫలమైందని అన్నారు.సమాఖ్యవాదం మన రాజ్యాంగం ప్రాథమిక లక్షణం అని సర్కారియా కమిషన్ చెబుతోందని,కానీ కేరళ వంటి రాష్ట్రాలు విపత్తు సహాయం కోసం సైతం కోర్టులను ఆశ్రయించవలసి వస్తోందన్నారు. రుణాల పరిమితి, ఆలస్యంగా బకాయిల చెల్లింపు, ఏకపక్ష ఆర్థిక నియమాలు ఆర్థిక దిగ్బంధనంతో సమానమన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల కేంద్రం బెదిరింపు ధోరణనిని అవలంబిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. సమాఖ్యవాదం అనేది కేంద్రం చేసే మేలు కాదని, అది రాజ్యాంగ ఆదేశమని పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సర్వేలో యుపిఎ–1 ప్రభుత్వం మహాత్మాగాంధీ నరేగాతో పాటు అమలు చేసిన సమాచార హక్కు చట్టాన్ని పునఃపరిశీలించాలని సూచించిందన్నారు.గత దశాబ్దంలో కేంద్ర ప్రభుత్వం ఆర్‌టిఐ చట్టాన్ని క్రమంగా బలహీనపరిచిందని, 2019లో సవరణ చేసి సమాచార కమిషనర్ల పదవీకాలం, సర్వీసు కండిషన్‌లను కేంద్ర ప్రభుత్వ అభీష్టానుసారం మార్చడంతో సమాచార కమిషన్ల స్వాతంత్ర్యాన్ని దెబ్బతీశారని సునీర్ మండిపడ్డారు. ఆర్‌టిఐ నియమాలలో విధానపరమైన మార్పులు సమాచారాన్ని పొందడం కష్టతరం చేశారని, ఈ చట్టాన్ని మరింతగా కుదించడం ప్రజాస్వామ్య జవాబుదారీతనం, ప్రజల విశ్వాసానికి ప్రమాదకరమని హెచ్చరించారు. విదేశాంగ విధానం విషయంలో, ఉక్రెయిన్, గాజా, వెనిజులా, ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి వరకు ప్రధాన మానవతా సంక్షోభాలపై భారతదేశం మౌనంగా ఉండడాన్ని సునీర్ తప్పుబట్టారు. అమెరికా చర్యలను భారత ప్రభుత్వం ఖండించాలని, 'బోర్డ్ ఆఫ్ పీస్'లో చేరాలన్న అమెరికా ఆహ్వానాన్ని తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

## సరిహద్దు కంచె కోసం భూమి ఇచ్చేందుకు అభ్యంతరం లేదు

### బిఎస్ఎఫ్ అధికార పరిధి పెంపు ఏకపక్ష నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా:** సరిహద్దు కంచె కోసం భూమిని అందించడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అయితే రాష్ట్రంలో బిఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్లకు విస్తరించాలనే ఏకపక్ష నిర్ణయాన్ని కేంద్రం ముందుగా వెనక్కి తీసుకోవాలని పట్టుబట్టారు. గురువారం గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా, సరిహద్దు కంచె నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆటంకం కలిగిస్తోందన్న కేంద్రం, బిజెపి ఆరోపణలను బెనర్జీ తోసిపుచ్చారు. బిఎస్ఎఫ్‌తో సహా అన్ని కేంద్ర సంస్థలకు, ఏజెన్సీలకు ఇప్పటికే భూమిని అందించామని ఆమె స్పష్టం చేశారు. 'భూమి సమస్య కాదు. మీకు భూమి లభిస్తుంది. కానీ ముందుగా, బిఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్లకు పెంచే ఏకపక్ష నిబంధనను మార్చండి' అని జాతీయ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ ఆమె అన్నారు. కంచె నిర్మాణంలో జాప్యం, అక్రమ వలసలు, బంగ్లాదేశ్‌తో పశ్చిమ బెంగాల్ సుదీర్ఘమైన, సులభంగా చొరబడటానికి వీలున్న సరిహద్దుల నిర్వహణపై కేంద్రం, తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం మధ్య కొత్తగా మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మమత బెనర్జీ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కంచె నిర్మాణంలో రాష్ట్రం సహకరించడం లేదని ఆరోపించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బెనర్జీ నేరుగా లక్ష్యంగా చేసుకున్నారు. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని ఇచ్చిందనే పూర్తి వివరాలను ఆయన చెప్పడం లేదన్నారు. రైల్వేల నుండి రక్షణ సంస్థల వరకు కేంద్ర ఏజెన్సీలకు భూమి కేటాయించబడిందని ఆమె తెలిపారు. చొరబాట్లపై బిజెపి పదేపదే దృష్టి సారించడాన్ని ప్రస్తావిస్తూ, కేవలం భద్రతపైనే దృష్టి పెట్టే సంకుచిత వైఖరిని ప్రశ్నించారు. 'వారికి చొరబాటు అనే ఒక్క మాటే తెలుసు. యువత, కొత్త ఓటర్లు ఓటర్ల జాబితాలో నమోదు కారా?' అని ఆమె ప్రశ్నించారు. సరిహద్దు ప్రాంతాలలో అధిక భద్రతా చర్యలు ప్రజాస్వామ్య ప్రక్రియలకు, సాధారణ ప్రజల జీవితాలకు అంతరాయం కలిగించే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. మమతా బెనర్జీ ప్రసంగిస్తుండగా ఆమెకు ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మధ్య తీవ్రమైన రాజకీయ వాగ్వాదంగా మారింది. చొరబాట్ల కారణంగా జనాభా మార్పులు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కంచె కోసం భూమి కోరుతూ కేంద్రం చాలాసార్లు లేఖలు రాసినా, రాష్ట్రం భూమిని ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణను బెనర్జీ తోసిపుచ్చారు. తాను చాలా మంది హోం మంత్రులను చూశానని, తనకు పాలనపై పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. 'మేము సెయిల్, రైల్వేలు, అన్ని కేంద్ర ఏజెన్సీలకు భూమి ఇచ్చాము. ఇప్పటికే ఇచ్చిన భూమిలో పని పూర్తి చేయండి, అప్పుడు మేము మరికొంత ఇస్తాము' అని ఆమె అన్నారు. తాము ఇప్పటికే ఎంత భూమిని అప్పగించామో బహిరంగంగా లెక్క చెప్పాల్సిన బాధ్యత రాష్ట్రానికి లేదని ఆమె స్పష్టం చేశారు. చొరబాటు, రోహింగ్యాలకు సంబంధించిన ఆరోపణల విషయంలో, బెనర్జీ సాక్ష్యాలను చూపించమని బిజెపికి సవాలు విసిరారు. 'మీరు ఒక్క రోహింగ్యానైనా కనుగొన్నారా? ఈ ఓటర్ల జాబితాపైనే 2024లో ఎన్నికలు జరిగాయి. ఏదైనా సమస్య ఉంటే, ప్రధానమంత్రిని రాజీనామా చేయమని అడగండి' అని చర్చ సందర్భంగా ఆమె పదునైనా వ్యాఖ్యలు చేశారు.

# 'విబి—జి రామ్ జి'ని ఉపసంహరించుకోవాలి

### ఎంజినరేగాను పునరుద్ధరించాలి కేరళ అసెంబ్లీ తీర్మానం



**తిరువనతంపురం:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'విబి–జి రామ్ జి' చట్టాన్ని ఉపసంహరించుకుని, ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ గురువారం తీర్మానాన్ని ఆమోదించింది. దీంతో యుపిఎ హయాంలోని గ్రామీణ ఉపాధి పథకానికి మద్దతుగా నిలిచిన ఇతర మూడు బిజెపియేతర పాలిత దక్షిణ రాష్ట్రాల సరసన కేరళ కూడా చేరింది. రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఎం.బి. రాజేష్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, శబరిమల బంగారం నష్టం అంశంపై ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ నిరసనల మధ్య సభ దీనిని ఆమోదించింది. కాంగ్రెస్ పాలిత కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు, డిఎంకె అధికారంలో ఉన్న తమిళనాడు కూడా అంతకు ముందు వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)ను ఉపసంహరించుకుని, ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానాలను ఆమోదించాయి. పూర్తిగా కేంద్ర ప్రాయోజిత పథకమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) వలె కాకుండా, 'విబి–జి రామ్ జి' పథకంలో రాష్ట్రం 40 శాతం వ్యయాన్ని భరించాల్సి ఉంటుందని రాజేష్ అన్నారు. ఈ కొత్త చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇతర దక్షిణ రాష్ట్రాలు కూడా ఇదే ఆందోళనను పంచుకుంటున్నాయని ఆయన గుర్తుచేశారు. ఈ కొత్త పథకం రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతుందని, మునుపటి చట్టానికి మూలమైన హక్కుల ఆధారిత నిబంధనలు ఇందులో లేవని ఆయన అన్నారు. కొత్త పథకం కింద గ్రామ పంచాయతీలను 'ఎ, బి,సి' కేటగిరీలుగా వర్గీకరించాల్సి ఉంటుందని, కేంద్రం నోటిఫై చేసిన ప్రాంతాల్లో మాత్రమే ఈ ఉపాధి పథకం అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు. దీని ఫలితంగా కేరళలోని చాలా గ్రామ పంచాయతీలు ఇతర రాష్ట్రాలలోని వాటితో పోలిస్తే మరింత అభివృద్ధి చెందినందున, ఉన్నత కేటగిరీలో చేర్చబడతాయని, తద్వారా ఈ పథకం నుండి మినహాయించబడవచ్చని ఆయన అన్నారు. గ్రామీణ ఉపాధి పథకం కింద పనిచేసే కార్మికులు ఈ కొత్త పథకాన్ని వ్యతిరేకిస్తున్నారని, ఇది 'ప్రజా వ్యతిరేకమైనది' వారి పని హక్కును హరిస్తుంది అని రాజేష్ పేర్కొన్నారు.'అందువల్ల, పేదరిక నిర్మూలనకు హాని కలిగించే ఉపాధి కల్పన భారాన్ని రాష్ట్రాలపై మోపే ఈ కొత్త పథకాన్ని ఉపసంహరించుకుని, పాత ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలని ఈ సభ డిమాండ్ చేస్తోంది' అని ఆయన అన్నారు. కాకతాళీయంగా, కర్ణాటక అసెంబ్లీ బుధవారం ఇలాంటి తీర్మానాన్నే ఆమోదించగా, మిగిలిన రెండు రాష్ట్రాలు గత నెలలో ఈ పని చేశాయి.

## 2024-25లో 22 లక్షలకు పైగా ప్రజల ఫిర్యాదులు

### రాజ్యసభలో కేంద్రం

**న్యూఢిల్లీ :** ప్రత్యేక సిపిజిఆర్ఎఎంఎస్ పోర్టల్ ద్వారా 2024–25 సంవత్సరంలో 22 లక్షలకు పైగా ప్రజల ఫిర్యాదులు అందినట్లు గురువారం రాజ్యసభకు తెలియజేశారు. కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార, పర్యవేక్షణ వ్యవస్థ (సిపిగ్రామ్స్) ప్రభుత్వ విభాగాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయడానికి అనుమతిస్తుంది. 2024–25లో కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలపై మొత్తం 22,23,186 ఫిర్యాదులు నమోదయ్యాయని సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. వీటిలో 23,02,236 (ముందు సంవత్సరాల నుండి బకాయి ఉన్న వాటితో సహా) పరిష్కరించబడ్డాయని ఆయన చెప్పారు. 2023–24 సంవత్సరంలో నమోదైన మొత్తం 23,16,710 ఫిర్యాదులలో, 25,28,603 (మునుపటి సంవత్సరం నుండి బకాయి ఉన్న వాటితో సహా) పరిష్కరించబడ్డాయని మంత్రి తెలిపారు.'2023–24, 2024–25 సంవత్సరాలలో, సిపిగ్రామ్స్‌లో ప్రజా ఫిర్యాదుల సగటు పరిష్కార సమయం కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలకు 16 రోజులు, 15 రోజులు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రభుత్వాలకు వరుసగా 119 రోజులు, 64 రోజులుగా ఉంది' అని సింగ్ అన్నారు.అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలకు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రభుత్వాలకు వారి సంబంధిత విషయాలకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులను ప్రాసెస్ చేయడానికి సిపిగ్రామ్స్‌కు పాత్ర ఆధారిత యాక్సెస్ ఉందని మంత్రి తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార అంచనా, సూచిక (జిఆర్ఎఐ)లో కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల ఫిర్యాదుల పరిష్కార పనితీరును అంచనా వేయడానికి 11 సూచికలు ఉపయోగించబడతాయని ఆయన చెప్పారు.

## 5 తేజస్ మార్క్1–ఎ

# యుద్ధ విమానాలు రెడీ



### హెచ్ఎఎల్ కంపెనీ కీలక ప్రకటన..

**న్యూఢిల్లీ:** మిలిటరీ విమానాల ఉత్పత్తి సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ గురువారం కీలక ప్రకటన చేసింది. 5 తేజస్ మార్క్1–ఎ ఫైటర్ విమానాలు సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నది. భారతీయ వైమానిక దళం కోసం ఈ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేశారు. అయితే ఫ్యాక్టరీలో మరో 9 విమానాలు రెడీగా ఉన్నాయని, అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ సరఫరా చేసే ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు హెచ్ఎఎల్ తన ప్రకటనలో చెప్పింది. లివరీ కోసం అయిదు విమానాలు రెడీ అయ్యాయని, ఒప్పందం ప్రకారం ఆ విమానాలను రూపొందించామని, అదనంగా 9 విమానాలను నిర్మించామని, అమెరికా ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్న బెంగుళూరుకు చెందిన హిందుస్తాన్ ఏరోనాటిక్స్ కంపెనీ వెల్లడించింది. జీఈ సంస్థ నుంచి అనుకున్న తేదీ ప్రకారం అయిదు ఇంజిన్లు అందినట్లు హెచ్ఏఎల్ చెప్పింది. ఎఫ్404 ఇంజిన్ల సరఫరాలో ఆలస్యం వల్ల తేజస్ మార్క్ 1ఏ జెట్ల డెలివరీ ఆలస్యమైనట్లు పేర్కొన్నది. భారతీయ వైమానిక దళం కోసం హెచ్ఎఎల్ సంస్థ 180 యుద్ధ విమానాలను ఉత్పత్తి చేస్తున్నది. వాస్తవానికి మార్చి 2024 నాటికి ఆ విమానాల డెలివరీ ప్రక్రియ స్టార్ట్ కావాల్సి ఉంది. కానీ ఇంజిన్ల సరఫరాలో ఆలస్యం వల్ల .. విమానాల ఉత్పత్తిలో జాప్యం జరిగినట్లు కంపెనీ పేర్కొన్నది.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS08UD 4824 | Yashashwini Yedla | EICHER PRO 3009 SKYLINE FBV-P | 2016 |
| 2 | TS03UC 3492 | Laxmi Uppu | APE PICK UP XTRA LD | 2018 |
| 3 | TS03UC 7530 | Naresh Bonagiri | APE XTRA LDX | 2020 |
| 4 | AP07TM 4428 | Ranjith Rendla | AL U TRUCK 2518 FBT-T | 2018 |
| 5 | TS05UB 2666 | Siripuram Vijaynath | TATA LPT 3118 CUMMINS FBT | 2016 |

AUCTION DATE : 07-02-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900 & 9573787776

# ప్రజాస్వామ్యానికి పరీక్ష!

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ విషమ పరీక్షలు ఎదుర్కొంటున్నది. రాజ్యాంగం అందించిన హక్కులు, స్వేచ్ఛ, సంస్థాగత వ్యవస్థలతోపాటు, చర్చలు... విమర్శలు, సమీక్షల సంస్కృతి కూడా ప్రజాస్వామ్యానికి కీలకమే. పార్లమెంటు ప్రధానంగా చట్టాలు చేసే వేదిక. అదే సమయంలో ప్రజల గొంతుక. వారి ఆశలు, ఆందోళనలు, అభిప్రాయాలకు ప్రతిబింబం. అలాంటి పార్లమెంటులో చర్చకు, అభిప్రాయాలకు చోటు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తే, అది కేవలం రాజకీయ ఘర్షణగా మాత్రమేగాక, ప్రజాస్వామ్య తీరుతెన్నులపై ప్రభావం చూపే అంశంగా చూడాల్సి ఉంటుంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో, గురువారం చోటు చేసుకున్న రెండు ఘటనలు బిజెపి హయాంలో ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతిని స్పష్టం చేస్తున్నాయన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీలు ప్రస్తావించిన అంశాలను యావత్ దేశం ఒకసారి ఆలకించి, ఆలోచించి, భవిష్యత్తుపై స్పష్టమైన నిర్ణయానికి రావాలి. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం, రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానం విషయంలో కనీస మర్యాద పాటించకపోవడం అత్యంత దారుణం. దేశం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలపై, ప్రజల తరఫున ప్రతిపక్ష పార్టీలు గొంతు విప్పుతాయి. ప్రశ్నిస్తాయి. నిలదీస్తాయి. లోపాలు సవరించుకోవాల్సిందిగా సూచిస్తాయి. కానీ, ప్రతిపక్షాల వాదన ప్రకారం, చర్చకు సరైన అవకాశం లేదు. సభలో గొంతుకలు వినిపించకుండా చేయడం, చివరకు ధన్యవాద తీర్మాన చర్చలు, ప్రధానమంత్రి సమాధానం ఇవ్వకుండానే తీర్మానం ఆమోదం పొందడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకే స్వరంతో స్పందించడం హర్షణీయం. సాధారణంగా రాజకీయంగా భిన్నమైన అభిప్రాయాలు కలిగిన పార్టీల మధ్య ఐక్యత అరుదుగా కనిపిస్తుంది. కానీ, ఈ సందర్భంలో మాత్రం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రధాన అజెండాగా మారింది. పార్లమెంటు సమావేశాలు అంటేనే చర్చలు. సమీక్షలు. మంచీచెడు బేరీజులు. కానీ, కొంతకాలంగా ఇలాంటి ప్రాథమిక అంశాలు కూడా అటకెక్కాయి. అత్యంత కీలక అంశాలపై ప్రతిపక్షాలు మాట్లాడే హక్కును నిరాకరిస్తున్న సమావేశాలను కేవలం నామమాత్రపు తతంగంగా చూడాలి. చర్చ లేకుండా, విమర్శలకు సమాధానం ఇవ్వకుండా, కేవలం సంఖ్యాబలం ఆధారంగా బిల్లులకు, తీర్మానాలకు ఆమోద ముద్ర వేయించుకోవడం పార్లమెంటరీ వ్యవస్థకు ప్రమాదకరం. ఎప్పుడైనా... ఎక్కడైనా... పార్లమెంటు సభ్యులు తమతమ వ్యక్తిగత అంశాలను ప్రస్తావించరు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం మాట్లాడరు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల తరఫున వారు మాట్లాడుతారు. అలాంటి సభ్యుల గొంతు వినిపించకుండా చేయడమంటే, కోట్లాది ప్రజల స్వరాన్ని నొక్కేయడమే. ప్రజాస్వామ్యంలో మెజారిటీకి అధికారం ఉన్నా, మైనారిటీ అభిప్రాయాలకు కూడా గౌరవం ఉండాలి. కానీ, ఇప్పుడు కనిపిస్తున్నది అందుకు భిన్నమైన దృశ్యం. సభలో మైకులు ఆపివేయడం, చర్చ ప్రారంభం కాకముందే అంతరాయం కలిగించడం, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నిరోధించడం వంటివి అప్రజాస్వామిక విధానాలు కోకొల్లలు. పార్లమెంటు అనేది కేవలం అధికార పక్షం మాట్లాడే వేదిక కాదని, అది విభిన్న స్వరాల సంగమమని ప్రతిపక్ష పార్టీల సభ్యులు చేస్తున్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. భారత ప్రజాస్వామ్యంలో లోక్‌సభ, రాజ్యసభ పరస్పర పూరకాలు. ఒక సభలో జరిగే పరిణామాలు మరొక సభపై ప్రభావం చూపుతాయి. ఒక సభలో ప్రజాస్వామ్య ప్రమాణాలు దెబ్బతింటే, మొత్తం పార్లమెంటు బలహీనపడుతుందని ప్రతిపక్షాల ఆందోళన. ఈ నేపథ్యంలో, లోక్‌సభలో జరిగిన పరిణామాలపై రాజ్యసభలో నిరసన వ్యక్తమవడం సహజ పరిణామం. ఇది ఒక సభ వ్యవహారంపై మరో సభ జోక్యం చేసుకోవడం కాదు... పార్లమెంటరీ వ్యవస్థ మొత్తాన్ని కాపాడుకునే ప్రయత్నం. ఇదే విషయాన్ని ప్రతిపక్ష సభ్యులు స్పష్టం చేసినప్పటికీ, వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. వాగ్వాదాలు.. అడ్డుకోవడాలు... ఘర్షణలు ప్రజాస్వామ్య చరిత్రలో కొత్త కాదు. గతంలో కూడా వివిధ సందర్భాల్లో సభలు సజావుగా నడవని సందర్భాలు ఉన్నాయి. కానీ, దశాబ్దకాలంగా చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయన్నది ప్రతిపక్ష నేతల ఆరోపణ. గతంలో జరిగిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని వారి సూచన. ప్రజాస్వామ్యం అనేది కేవలం అధికారంలో ఉన్నవారి సౌలభ్యానికి అనుగుణంగా నడిచే వ్యవస్థ కాదు. అది నిరంతర చర్చలు, పరస్పర గౌరవం మీద ఆధారపడి నడిచే యంత్రం. కానీ, ప్రతిపక్ష నేతలను మాట్లాడనివ్వకపోవడం, రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞత తీర్మానాన్ని ప్రధానమంత్రి ప్రసంగం లేకుండానే ఆమోదించడం దుష్ట సంప్రదాయానికి ప్రతీకలు. ప్రతిపక్షాలు సూచించిన సవరణలు తిరస్కరించి, తీర్మానం ఆమోదం పొందిన దృశ్యం ప్రజాస్వామ్య పరిపక్వతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నది. ప్రజాస్వామ్యం అంటేనే చర్చ... సమీక్ష.. విశ్లేషణ... లాభనష్టాల బేరీజు. చర్చకు అవకాశం లేకుండా, ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా సభను నడిపించడం అధికారవాద ధోరణులకు నిదర్శనం. ప్రజల తరఫున ప్రశ్నించిన వారిని బహిష్కరించడం పలాయనవాదానికి పరాకాష్ఠ. సస్పెన్షన్లు సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. నిరసనల వెనుక ఉన్న కారణాలను వినకుండా, కేవలం శిక్షాత్మక చర్యలకు పాల్పడితే సమస్య మరింత తీవ్రమవుతుంది. గెలవడం, ఎక్కువ సీట్లు సంపాదించుకోవడం, అధికారంలోకి రావడం మాత్రమే ప్రజాస్వామ్యం అనిపించుకోదు. పాలనలో వినయం, ప్రతిపక్ష సభ్యుల సూచనలను వినడం, విమర్శలను స్వీకరించే తత్వం, మార్పులను ఆహ్వానించే సామర్థ్యం కూడా ఉండాలి. అధికార పక్షం బలంగా ఉన్నప్పుడు, ప్రతిపక్ష గొంతు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అదే ప్రజల ఆందోళనలకు ప్రతిధ్వని. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఎవరో చేసే ఉపకారం కాదు.. రాజ్యాంగబద్ధమైన హక్కు. ఆ హక్కును పరిమితం చేయడమంటే ప్రజాస్వామ్య మూలస్తంభాలనే కదిలించడం. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణను కేవలం పార్టీలపై నెట్టివేయకుండా, ప్రజలు కూడా కీలక భూమిక పోషించాలి. తమవంతు బాధ్యతను నిర్వర్తించాలి. అధికార అహంకారానికి తెరదించాలి.



## స్పీకర్ వెనుక దాక్కున్న ప్రధాని!

**అధికార పక్షం బెంచ్ వద్ద మహిళా ఎంపిలు నిలబడితే ఏమిటి? ప్రధానిపై ఎవరైనా చేయత్తడమో, ఆయనను గాయపరచడమో అనే ప్రశ్నే లేదు. అలా చేసే ప్లాన్ ఉందని ఎవరైనా అంటే అది పూర్తిగా అబద్ధం. అలాంటి ప్లాన్ ఏదీ లేదు. కానీ, మీ వైపు (బిజెపి) సభ్యులను పుస్తకాలు ఉటంకిస్తూ, అర్థం పర్థం లేకుండా మాట్లాడేందుకు మీరు అనుమతిస్తే, ప్రతిపక్షానికి నిరసన తెలిపే హక్కు ఉంది. నేను ఇలా అంటున్నందుకు సారీ.. ప్రధానమంత్రి స్పీకర్ వెనుక దాక్కుంటున్నారు. వారు స్పీకర్‌తో ఇదంతా చెప్పిస్తున్నారు. నిన్న ఆయనకు సభలోకి వచ్చేందుకు ధైర్యం లేదు. ఎందుకు ముగ్గురు మహిళా ఎంపిలు ఆయన బెంచ్ ముందు నిలబడినందుకా? ఇది అర్థంలేని వాదన. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రధాని మోదీని, ప్రభుత్వాన్ని మీడియా ఎందుకు అడగడం లేదు? ప్రభుత్వానికి చర్చ జరగాలని లేదు కాబట్టి చర్చ జరగలేదు.**

– కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ



# స్త్రీలలో గుండె జబ్బుల ప్రమాదం అధికమా!

గుండె జబ్బులు అనగా గుండె, రక్తనాళాల వ్యవస్థలను ప్రతికూల ప్రభావితం చేసే ఏ వ్యాధిగా గుర్తించాలి. గుండెపోటు, స్ట్రోక్, కరోనరీ హార్ట్ డిసీజ్, అధిక రక్తపోటు లాంటి సమస్యలు మహిళల వయస్సు పెరిగిన కొద్దీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మోనోపాజ్ తర్వాత ఈ సమస్యలు పెరుగుతున్నాయి. పురుషుల కంటే మహిళల్లో హృదయ నాళ సంబంధ సమస్యలు, మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో గుండె జబ్బుల సమస్యలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రతి ముగ్గురు మహిళల మరణాల్లో ఒక్కరు గుండె జబ్బుతో మరణిస్తున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కేన్సర్ కన్న గుండె జబ్బులతో మహిళలు అధికంగా ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. ఇలాంటి అత్యంత ప్రమాదకర వ్యాధుల పట్ల మహిళల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏటా ఫిబ్రవరి తొలి శుక్రవారం, అనగా 06 ఫిబ్రవరి 2026 రోజున జాతీయ మహిళా గుండె దినోత్సవం లేదా నేషనల్ వుమెన్ హార్ట్ డే లేదా నేషనల్ వియర్ రెడ్ డే పాటించడం జరుగుతున్నది.

**ప్రధాన లక్షణాలు:** రుతు విరతి లేదా మోనోపాజ్ తర్వాత మహిళల్లో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. మహిళల్లో గుండె జబ్బుల లక్షణాలుగా శ్వాస ఆడకపోవడం, క్రమరహిత హృదయ స్పందన, చెమట పట్టడం, తల తిరగడం, ఛాతి/మెడ/వెన్ను/భుజాల/దవడ/తల నొప్పులు, వికారం, మైకం, అజీర్ణం, అలసట, వాంతులు లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. చిన్న గుండె ధమనుల్లో ఉత్పన్నమయ్యే సమస్య ల వల్ల కరోనరీ మైక్రోవాస్కులార్ డిసీజెస్ బయట పడుతున్నాయి. తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడివల్ల గుండె బలహీనపడడంతో మహిళల్లో అధికంగా బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్ సమస్యలు వస్తున్నాయి. మహిళల్లో మానసిక ఒత్తిడి, చిన్నచిన్న సమస్యలకు కుంగిపోవడం వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది.

**మహిళల్లో గుండె జబ్బుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు:**
మన కుటుంబాల్లో మహిళలు అందరికీ ఆహారం వడ్డించినా తర్వాత మిగిలిన ఆహార పదార్థాలను మాత్రమే తినడంతో వారిలో పోషకాహారలోపాలు కనిపిస్తున్నాయి. అందువల్ల మహిళలు కూడా మంచి పోషకాహారం తీసుకునే విధంగా పురుషాధిక్య సమాజం జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు విధిగా పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వులు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ప్రతిరోజు తప్పకుండా కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి. ధూమపాన దురలవాటుకు దూరంగా ఉండాలి. మహిళలు తమ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

గుండె జబ్బులు మహిళలకు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతున్న వేళ రోగ లక్షణాలను గమనిస్తూ, పోషకాహారం తీసుకుంటూ, తగు ముందు జాగ్రత్తలు పాటిస్తూ, తరుచుగా వైద్య పరీక్షలు చేయించికుంటూ ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందంగా జీవితాలను కొనసాగించాలి. జాతీయ మహిళా హృదయ దినోత్సవం రోజున ఎరుపు రంగు రిబ్బన్లు, డ్రస్సులు ధరించి మహిళాలోకానికి సంఘీభావాన్ని ప్రదర్శిస్తూ, వారు గుండె జబ్బుల బారిన పడకుండా అడ్డుకుందాం.

**(06 ఫిబ్రవరి జాతీయ మహిళా గుండె [జబ్బుల వ్యతిరేక] దినోత్సవం సందర్భంగా)**

# బంగారం, ఐటి షేర్లపై పెట్టుబడి సురక్షితం కాదా!

**టి.ఎన్.అశోక్**

ఆసియా, భారత ఉపఖండంలోని పెట్టుబడిదారులు తరతరాలుగా సంపద విషయంలో పాటిస్తున్న 'ఉత్తమ నియమం' అత్యంత సులువైనది. 'ప్రపంచం వణికిపోతునప్పుడు బంగారాన్ని కొనండి. కానీ ఈ వారం, ఆ పురాతన జ్ఞానం ఘోరంగా అంచనా తప్పింది. చారిత్రాత్మక 'ద్విముఖ' మార్కెట్ షాక్‌లో భాగంగా, ఆధునిక పోర్ట్‌ఫోలియోలోని జంట స్థంభాల వంటి అధిక వృద్ధి సాఫ్ట్‌వేర్ స్టాక్‌లు, 'సురక్షిత స్వర్గధామం'గా చెప్పుకునే విలువైన లోహాలు ఒకేసారి కుప్పకూలిపోయాయి. వందల బిలియన్ల విలువను తుడిచిపెట్టాయి.

సిలికాన్ వ్యాలీలో ఆకస్మిక పరిణామం, వాషింగ్టన్‌లో రాజకీయ నియామకం నుంచి మొదలైన ఈ ఊచకోత వేగంగా సాగే నిర్మాణాత్మక మార్పుల యుగంలో 'సురక్షితమైన' పెట్టుబడి అంటే ఏమిటో ప్రపంచవ్యాప్తంగా పునరాలోచించవలసి వచ్చింది.

ఒక దశాబ్దానికి పైగా భారతీయ ఐటి దిగ్గజాల, ప్రపంచ సాఫ్ట్‌వేర్ సంస్థల పెట్టుబడి సిద్ధాంతం 'పెనవేసుకొని' ఉండడంపై నిర్మితమైంది. పునరావృతమయ్యే సబ్‌స్క్రిప్షన్ ద్వారా లీగల్ రీసెర్చ్ లేదా టాక్స్ ఫైలింగ్ లేదా ఎంటర్‌ప్రైస్ కోడింగ్ వంటి తప్పనిసరి సేవలను ఈ కంపెనీలు అందిస్తుంటాయి.






ఆ సిద్ధాంతం మంగళవారం బద్దలైంది. **దీనికి ఉత్ప్రేరకం డారియో అమోడీ నేతృత్వంలోని ఎఐ సంస్థ ఆంత్రోపిక్ నుండి అధునాతన లీగల్ ఆటోమేషన్ సాధనం 'క్లాడ్ కోవర్క్ అసిస్టెంట్'ను ప్రవేశపెడుతున్నట్లు వచ్చిన ప్రకటన. ఈ ఎఐ సాధనం ఒక ప్రాడక్ట్‌ను అప్‌డేట్ చేయాడానికి మించి చేసింది. ఎఐ 'సహాయకుడు' పాత్ర నుండి 'స్థానాలను భర్తీ' చేసే పాత్రగా మారుతోందని ఇది నిరూపించింది.**

ఈ వార్తలు పసిఫిక్ సముద్రం దాటగానే, దలాల్ స్ట్రీట్‌పై ప్రభావం తక్షణమే కనిపించింది. బుధవారం ఉదయం నిఫ్టీ ఐటి ఇండెక్స్ 6 శాతం కంటే ఎక్కువ పతనమైంది. గత కొద్ది మాసాలలో ఇదే అత్యంత ఘోరమైన సెషన్. పెట్టుబడిదారులు ఇకపై మందగమనం గురించి ఆందోళన చెందడం లేదు. వారు కనిపించకుండా పోవడం గురించి ఆందోళన చెందుతున్నారు.

**ఇన్ఫోసిస్:** దాని ప్రధాన వ్యాపార సేవలను ఎఐ ఏజెంట్లు ద్వారా ఆటోమేట్ చేయవచ్చనే భయాలు పెరగడంతో ఇన్ఫోసిస్ షేర్లు 7.2 శాతం పడిపోయి, పతనానికి నేతృత్వం వహించింది.

**టిసిఎస్, విప్రో :** దాదాపు 6 శాతం పడిపోయింది. ఇది యాక్సెంచర్, కాగ్నిజెంట్ వంటి అమెరికా సహచరులలో భారీ అమ్మకాలను ప్రతిబింబిస్తుంది.

**ది సాసాసోక్యాలిప్స్ (ఎఐ ఎజెంట్‌ల కారణంగా ఐటి షేర్ల పతనాన్ని సూచించే పదం):** పెర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎల్‌టి, మైండ్ ట్రీ వంటి మిడ్ క్యాప్ సంస్థలు కూడా 6.5 శాతం కంటే ఎక్కువ తరుగుదలను చవిచూశా యి.

మార్కెట్ల నుండి వచ్చే సందేశం స్పష్టంగా ఉంది. పాశ్చాత్య సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించడానికి ప్రతిభావంతమైన మానవనరులను అందించే భారతీయ సంస్థల 'కార్మిక మధ్యవర్తిత్వం' నమూనా ఉనికికి ముప్పు పొంచి ఉంది. **జూనియర్ డెవలపర్లు లేదా లీగల్ క్లర్కుల బృందం చేసే పనిని నెలకు 20 డాలర్‌లతో ఎఐ చేసిపెట్టగలిగితే, సాంప్రదాయ 250 బిలియన్ డాలర్ల ఔట్‌సోర్సింగ్ నమూనా మరింత అభివృద్ధి చెందాలి లేదా నశించాలి.**

ఈక్విటీ పెట్టుబడిదారులు తడబడుతుండగా, సంప్రదాయవాద పొదుపుదారులపై రెండవ దెబ్బ పడింది. ద్రవ్యోల్బణానికి ఎదుర్కొనేందుకు బంగారం ఒక సాంస్కృతిక రక్షణగా, పొదుపు ప్రాథమిక రూపంగా భావించే భారతీయ కుటుంబాలకు, వాషింగ్టన్ నుండి వచ్చిన వార్త ఒక ద్రోహంలా అనిపించింది.

జెరోమ్ పావెల్ స్థానంలో ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌గా కెవిన్ వార్ష్‌ను తన నామినీగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మోర్గాన్ స్టాన్లీ మాజీ బ్యాంకర్ అయిన వార్ష్‌ను 'మానిటరీ హాక్' (ద్రవ్య డేగ)గా భావిస్తారు. వడ్డీ రేట్లను తక్కువగా ఉంచడం ద్వారా వృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే 'పావురం'లా కాకుండా, వార్ష్ వంటి డేగ అధిక రేట్లు, 'బలమైన డాలర్' విధానం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అణిచివేయడానికి ప్రాధాన్యత ఇస్తాడు.

దీనిపై కమోడిటీ మార్కెట్‌లో ప్రతిస్పందన దశాబ్దాలలో అత్యంత దారుణంగా ఉంది:

**బంగారం:** 2013 తరువాత అత్యంత దారుణమైన ఒకరోజు అమ్మకాలను చవిచూసింది. స్పాట్ ధరలు ఒకే వారంలో 10 శాతం వరకు పడిపోయాయి.

**వెండి:**1980 తరువాత తీవ్రమైన పతనాన్ని నమోదు చేసింది. రాత్రికి రాత్రే దాదాపు 28 శాతం పడిపోయింది.

'తర్కం కనికరం లేనిది. బంగారం వంటి రాబడి లేని ఆస్తుల ఆకర్షణను అధిక రేట్లు, బలమైన డాలర్ ధ్వంసం చేస్తాయి.' నెలల తరబడి బంగారం రికార్డు స్థాయిలో ర్యాలీని చవిచూసింది. దీనికి తూర్పున భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంకు కొనుగోళ్లు కారణమయ్యాయి. కానీ వార్ష్ నియామకం 'ఫ్రైడ్‌మ్యాన్ శైలి' ద్రవ్యోల్బణ నియంత్రణ పునరాగమనాన్నిసూచిస్తుంది. మార్కెట్లు తక్షణమే భవిష్యత్తును దర్శించి, ధరలను సవరించుకొని, వార్ష్ పాలనలో అమెరికా డాలర్ తిరుగులేని రాజుగా ఉంటుందని పందెం కాస్తున్నాయి.

ప్రస్తుత ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌కు వ్యతిరేకంగా ట్రంప్ పాలనా యంత్రాంగం చేసిన దుష్ప్రచారం మధ్య వార్ష్ నియామకం జరిగింది. అధ్యక్షుడు కోరినంత త్వరగా రేట్లను తగ్గించడానికి పావెల్ నిరాకరించడంతో సంబంధం దెబ్బతిన్నది.

ఈ వివాదం ప్రపంచ స్థిరత్వంపై గణనీయమైన ప్రభావాలను కలిగి ఉంది. రాజకీయ నాయకులు సెంట్రల్ బ్యాంకులలో జోక్యం చేసుకున్న సందర్భాలలో అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం (స్టాగ్‌ఫ్లేషన్) లేదా కరెన్సీ పతనం తప్పదని చరిత్ర చెబుతోంది. విచిత్రంగా బంగారం మార్కెట్ పతనం... వాస్తవానికి పెట్టుబడిదారులు వార్ష్ స్వాతంత్ర్యాన్ని విశ్వసిస్తారని సూచిస్తుంది. బంగారాన్ని విక్రయించటం, డాలర్‌ను కొనుగోలు చేయడం ద్వారా, అధిక డబ్బు ముద్రణ ద్వారా కరెన్సీని 'తగ్గించడానికి' వార్ష్ రాజకీయ ఒత్తిడిని నిరోధించే అవకాశం ఉందని మార్కెట్ ఓటు వేస్తోంది.

**ఈ వారం ఆసియా, భారతీయ పెట్టుబడిదారులకు మూడు కీల-కమైన పాఠాలను అందిస్తుంది:**

**ఐటి స్టాక్‌లు ఇకపై 'భద్రమైనవి' కావు:** డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఐటి స్టాక్‌లు సురక్షితమైన మార్గం అనే భావన పరీక్షించబడుతోంది. జెఫరీస్‌తో సహా ప్రధాన బ్రోకరేజీలు ఇప్పటికే భారతీయ ఐటి కోసం ఇచ్చే ప్రాధాన్యతను తగ్గించుకున్నాయి. ఇది ఆర్థిక, పారిశ్రామిక రంగాల వంటి 'సాంప్రదాయ' రంగాల వైపు మళ్లడాన్ని సూచిస్తుంది.

**బంగారం దుర్బలత్వం నుంచి పాలసీ :** బంగారం ఒక ముఖ్యమైన హెడ్జ్ (ప్రతికూల మార్కెట్‌లో నష్టాలు తగ్గించుకునే వ్యూహం)గా ఉన్నప్పటికీ, దానిపై అమెరికా ద్రవ్య విధానం తేలికగా ప్రభావం చూపుతుంది. ఒక దుష్ట ఫెడ్ బ్యాంకు ఒక్క మధ్యాహ్నంలోనే లాభాలను తుడిచిపెట్టగలదు.

**'క్వైట్ కార్నర్స్(ప్రశాంత స్థలి)'కు ముగింపు:** క్లాడ్ సాఫ్ట్‌వేర్ నుండి బంగారు కడ్డీల వరకు 'కథనంలో సంభవించే మార్పు' నుండి రక్షణ ఇచ్చే ఆస్తులు ఇకపై ఉండవు. అధిక అస్థిరత అనేది కొత్త ఆధారం.

వాల్ స్ట్రీట్, దలాల్ స్ట్రీట్ మార్కెట్ ఎదురుగాలికి సర్దుబాటు చేసుకుంటున్న సమయంలో, ఇది తాత్కాలిక దిద్దుబాటా? లేదా నిర్మాణాత్మక మలుపా? అనే విస్తృతమైన ప్రశ్న మిగిలే ఉంది

'కోడ్ నుండి బంగారం వరకు' తగిలిన షాక్... ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు గతంలో కంటే మరింత పరస్పరం అనుసంధానించబడి ఉందని, మరింత సున్నితంగా ఉందని రుజువు చేస్తుంది. మీరు బెంగళూరులో టెక్ ప్రొఫెషనల్ అయినా లేదా ముంబైలో బంగారం పొదుపు చేసినా, సందేశం స్పష్టంగా ఉంది.

| అస్తి రకం | పాత కథనం | నూతన వాస్తవికత (2026 షాక్) |
|---|---|---|
| భారతీయ ఐటి (టిసిఎస్/ఇన్ఫీ) | అధిక మార్జిన్లు, సురక్షితమైన 'రక్షణాత్మక' పెట్టుబడి | ఎఐ ఏజెంట్ల నుండి అధిక అంతరాయ ప్రమాదం. |
| బంగారం/వెండి | అమెరికా ద్రవ్యోల్బణానికి దీటుగా నిలిచే ఉత్తమ హెడ్జ్ | 'బలమైన డాలర్' ఫెడ్ ప్రభావానికి లోనయ్యే అవకాశం. |
| ప్రైవేట్ ఈక్విటీ | ఊహించదగిన, దీర్ఘకాలిక నగదు ప్రవాహాలు | సాఫ్ట్‌వేర్‌లో 'అంతరాయం కలిగించే ప్రమాదానికి' లోనయ్యే అవకాశం. |

# ప్రజాస్వామ్య మూలస్తంభం 'ఫోర్త్ ఎస్టేట్'పై కేంద్రం జులుం

*ధర్మ ఏవ హతో హన్తి / ధర్మో రక్షతి రక్షితః*
*తస్మాద్ధర్మో హన్తవ్యో / మనోధర్మా హతోవదీత్*

ఈ శ్లోకం వాల్మీకి రామాయణంలోనిది. జన బాహుళ్యంలో అత్యంత ప్రాముఖ్యం పొంది జనవాక్యంగా మారింది. ఈ శ్లోకార్థం జనానికి తెలియంది కాదు. ఈ ఆర్టికల్ వ్రాయడానికి నేను ఎంచుకున్న సబ్జెక్ట్ డిమాండ్ చేస్తోంది కనుక చెప్పాల్సిన అవసరం ఉంది. ధర్మాన్ని మీరు అనుసరించి దాన్ని గౌరవిస్తే ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. ధర్మాన్ని నాశనం చేస్తే అది మిమ్మల్ని నాశనం చేస్తుంది. ఈ సూక్తి వ్యక్తిగత జీవితంలో నైతికతను, సామాజిక వ్యవస్థలను కాపాడాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. భారతీయ ఆర్థికవేత్త, జర్నలిజాన్ని కొత్తపుంతలు తొక్కించిన పాత్రికేయుడు, నీతి నిజాయితీకి నిలువెత్తు రూపమైన ప్రణయ్ రాయ్ ఈ శ్లోకాన్ని టీకా తాత్పర్యాలతో సహా జీర్ణం చేసుకున్న మేధావి. ప్రజలకు వేగంగా నిఖ్కాన వార్తలను అందించడం కోసం స్వతంత్ర వార్తా సంస్థ ఎన్‌డిటివి ని స్థాపించారు. 1977లో జనతాపార్టీ గెలుస్తుందని prediction చెప్పడంతో పాటు ఇండియా టుడే మ్యాగజైన్‌లో ఎలక్షన్ ఎనలిస్ట్ గా పని చేశారు. 1984లో కాంగ్రెస్ పార్టీ 400 స్థానాలు దక్కించుకుంటుందని చెప్పిన సెఫాలజిస్ట్. శాస్త్రీయ పద్ధతిలో ఎన్నికల అంచనాలను వెల్లడించడంలో ఆయన సిద్ధహస్తుడు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులెన్నో అందుకుని, అక్షరాన్ని ఆయుధంగా చేసి ప్రభుత్వపు అవినీతిని ఎండగట్టిన ఘటికుడు. ముక్కుసూటి మనిషి కావడంతో సహజంగానే ప్రభుత్వం చూపు ఆయనపై పడింది.

2002లో నరేంద్ర మోదీ గుజరాత్ సి.ఎం గా ఉన్నప్పుడు జరిగిన గోద్రా అల్లర్లపై ఆయన చేసిన పదునైన విశ్లేషణ, ప్రభుత్వంపై సంధించిన ప్రశ్నల పరంపరతో బిజెపి ఉక్కిరిబిక్కిరైంది. ఎన్‌డిటివిని అదుపు చేయలేనపుడు దాన్ని నాశనం చేయడం ఉత్తమం అని వ్యూహరచన చేసి నిశ్శబ్ద యుద్ధం మొదలెట్టింది ప్రభుత్వం. మీడియా అంటే ప్రశ్నించే గొంతు. కొన్ని సందర్భాల్లో అదే ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. ఎన్‌డిటివి అంటే పాలకులకు భయం. ఎక్కడ తమ అవినీతి, అక్రమాల పుట్టలు తవ్వుతారో అనే దిగులు. గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ నిజాలు చెప్పినందుకు గ్రీకులు ఆయనకు విషం ఇచ్చి చంపారు. యూదుల సంప్రదాయాలను ప్రశ్నించినందుకు రోమన్ గవర్నర్ ఏసుక్రీస్తుకు మరణశిక్ష విధించాడు. పురాణాలు కల్పిత కథలు అనే సవాలు చేసినందుకు ప్రాచీన భారతంలో చార్వాకుని సజీవ దహనం చేశారు. భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుందనే నిజం చెప్పినందుకు ఖగోళ శాస్త్రవేత్త జోసఫ్ బ్రూనేను సజీవ దహనం చేశారు. ప్రత్యర్థులను నిర్వీర్యం చేయనంతకాలం వారినుండి ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది అనేది రాజనీతి. ఈ రాజనీతిని బాగా ఆకళింపు చేసుకున్న ప్రధాన మంత్రి కౌటిల్యుడిని మించిపోయేలా పావులు కదిపినపుడు ప్రణయ్ రాయ్ దంపతుల కాళ్ళక్రింద భూమి కరిగిపోయిం ది. తాము కష్టపడి ఆర్జించిన ఎన్‌డిటివిని తమ కళ్ళముందే రాబందులు తన్నుకుపోయాయి. ఇదేనా వికసిత్ భారత్? ఒక కాకి పడిపోతే వంద కాకులు గుమిగూడి కావ్ కావ్ అంటూ అరుస్తాయి. అది ప్రకృతి ధర్మం. ఈ పక్షి ధర్మం జర్నలిజంలో లేదా? జనవరి 2025 లో చత్తీస్‌ఘడ్ బీజాపూర్‌లో ఎన్‌డిటివి రిపోర్టర్ హత్య చేయబడ్డారు. ఎవరు చేశారు? ఎందుకు చేశారు అని ప్రశ్నించినవారు లేరు.

ఎన్‌డిటివి ఛానల్ అవసరాల మేరకు 2009 లో ప్రణయ్ రాయ్ దంపతులు విసిపిఎల్ అనే సంస్థ వద్ద 403 కోట్లు అప్పు తీసుకున్నారు. ఆ రెండు సంస్థల మధ్య జరిగిన ఒప్పందంలో అప్పు తీర్చలేని పక్షంలో, అప్పు ఇచ్చినవారు ఆ మొత్తాన్ని ఎన్‌డిటివి షేర్స్ గా మార్చుకోవచ్చు. ఈ నిబంధనే ఎన్‌డిటివి కొంప ముంచింది. ఒక ప్రక్క కేంద్రప్రభుత్వం ఐటి, సెబి, సిబిఐ వ్యవస్థలను ప్రణయ్ రాయ్ పై ఉసిగొల్పింది. ఈ దాడులను తట్టుకుంటూ, తీసుకున్న అప్పు కట్టలేని పరిస్థితి. ప్రణయ్ రాయ్ నుండి డైరెక్ట్ గా ఎన్‌డిటివి స్వాధీనం చేసుకోవడం కుదరదని గ్రహించి కుయుక్తులు పన్నే వారు ఆర్థిక ఉచ్చును సిద్ధంచేసి గోతికాడ నక్కలా కాచుకు కూర్చున్నారు. ఊహించని విధంగా విసిపిఎల్ ను కార్పొరేట్ డ్రాగన్, క్రోనీ కాపిటల్స్ అయిన అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. ఆ విధంగా 65 శాతం ఎన్‌డిటివి షేర్స్ మొత్తం అదానీ వశం అయ్యాయి. ఈ ఎపిసోడ్‌లో సంస్థ అధిపతి అయిన ప్రణయ్ రాయ్ కు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా 4 దశాబ్దాలుగా కాపాడుకుంటూ వచ్చిన ఎన్‌డిటివి ని అదానీ గ్రూప్ అనే అనకొండ కబ్జా చేసింది. మరోవైపు నుండి ఆదాయపన్ను శాఖ ఎన్‌డిటివి లో అక్రమాలు జరిగాయంటూ ప్రణయ్ దంపతులకు నోటీసులిచ్చి వేధించడం మొదలెట్టారు. ఢిల్లీ హైకోర్టు దీనిపై జోక్యం చేసుకుని ఒకే వ్యక్తిపై అనేక నిందలు వేయడం వేధింపు క్రిందికి వస్తుందని, అక్రమాలు జరిగిన రుజువులు లేనందున కేసు కొట్టివేస్తూ ఐటి శాఖకు 2లక్షల రూపాయలు జరిమానా వేసింది.

ఇంకోవైపు నుండి ప్రణయ్ రాయ్ ఐసిఐసిఐ బ్యాంకు నుండి తీసుకున్న 370కోట్ల రూపాయల లోన్ కేసులో నేరపూరిత అక్రమాలు జరిగాయని సిబిఐ కేసు వేసింది. ఈ కేసులో నేరపూరిత కుట్రలు జరగలేదని, అది ఒక సాధారణ వ్యాపార లావాదేవి అని ఢిల్లీ హైకోర్టు ఈ కేసుని కూడా క్లోజ్ చేసింది. మరి సిబిఐ కేసు ఎందుకు పెట్టింది? దీని వెనుక సూత్రధారులెవరు?

ఎన్‌డిటివిలో అంతర్గత వ్యాపారం జరిగిందని సెబి వేసిన కేసును, స్టేట్ అపిల్లేట్ ట్రిబ్యునల్ (State appellate tribunal (State appellate tribunal–SAT) అటువంటివి జరిగిన ఆధారాలు లేవంటూ ఎన్‌డిటివి పై ఉన్న కేసును కొట్టివేసింది. అంటే ఇది కూడా ఫేక్ కేసే. ప్రణయ్ రాయ్ చేసిన ధర్మపోరాటానికి సుమారు 10 ఏళ్ళు పట్టింది. చివరికి ఆయనకు 80 ఏళ్ళ వయసులో జనవరి 2026న కోర్టులు క్లీన్ చిట్ ఇచ్చా యి. కాని అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. ఆయన నిర్మించుకున్న జర్నలిజం సామ్రాజ్యం కార్పొరేట్ శక్తుల చేతిలోకెళ్ళింది. న్యాయపోరాటంలో ప్రణయ్ రాయ్ గెలిచినా, వృత్తిపరంగా ఆయన్ని దెబ్బ తీయాలన్న బిజెపి లక్ష్యం నెరవేరింది.

రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు వారికున్న ఈజీ మనీతో ప్రింట్ & ఎలక్ట్రిక్ మీడియాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యం ఉన్న వ్యక్తులకు నిఖ్కాన జర్నలిజంతో పనిలేదు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు వారి అవసరాల కోసం మీడియాను పిలిచి గోద్ మే బైఠో అంటున్నాయి. ఇలాంటి మీడియా Lapdog జర్నలిజానికి అలవాటుపడి కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ పెద్దల ఒడిలో కూర్చుని మూడు పూవులు ఆరు కాయలుగా తమ టి.ఆర్.పి రేట్లను పెంచుకుంటోంది. ప్రవాహంలో కొట్టుకుపోకుండా, ప్రవాహానికి ఎదురీదే ఎన్‌డిటివి యాజమాన్యాన్ని ఒంటరిని చేశామని తాత్కాలికంగా పైశాచికానందాన్ని పొందవచ్చు. నైతిక విలువలున్న ప్రణయ్ రాయ్ లాంటి వారిని ఏ ప్రభుత్వమూ ఆపలేదు. డిజిటల్ ఇండియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి టివి జర్నలిజంలో నూతన అధ్యాయాన్ని సృష్టిస్తారని ఆశిద్దాం.

**ఎస్.బాబు**
సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు,
9951801191

## భూ సేకరణ నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలి



ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం మొండిగౌరేల్లి గ్రామంలో భూ సేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని అఖిల పక్షనాయకులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అఖిల పక్షనాయకుల సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భూసేకరణ కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బడే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో బాటు క్రీడలు ముఖ్యం




ప్రజాపక్షం/యాచారం : విద్యార్థులకు చదువుతోబాటు క్రీడలు ఎంతో ముఖ్యమైనవని యాచారం ఎంపిడిఒ రాధరాణి అన్నారు. గురువారం యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎం కప్ నియోజకవర్గ స్థాయి ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నాయకులు భూడిద రాంరెడ్డి తో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కబర్చిన క్రీడాకారులను అమే అభినందిచారు. కార్యక్రమంలో నాయకులు భూడిద రాంరెడ్డి, ఎంఈఒలు రియ్యానాయక్, పాండురంగారెడ్డి, రాంధాసు, గ్రామ సర్పంచ్ అనిత, ఎస్ఐ పావని వివిధ పాఠశాలల పిఈటిలు తదితరులు పాల్గోన్నారు.

## కలుషిత నీటిని చెరువుతోకి వదిలితే పరిశ్రమలను సీజ్ చేస్తాం : ఎఇ



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: పరిశ్రమల నుండి వచ్చే కలుషిత నీటిని చెరువుల్లోకి వదిలితే ఆ పరిశ్రమలను సీజ్ చేస్తామని పర్యావరణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సజీనా అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో ని చెరువు నీటిని శాంపిల్‌గా స్వీకరించారు. పరిశ్రమల చుట్టు పరిశీలించి కలుషిత నీటిని చెరువులోకి, భూమిలోకి వదులుతున్న దృశ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలికట్ట గ్రామ శివారులో పరిశ్రమలు ఇష్టారాజ్యంగా స్థాపించి కాలుష్యపు నీటిని చెరులోకి వదులుతున్నారని, మరికొన్ని పరిశ్రమల నిర్వాహకులు భూగర్భంలోకి వదులుతున్నారని వివరించారు. వీటన్నింటిపై నివేధిక తయారు చేసి ప్రభుత్వానికి అంధించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎలికట్ట సర్పంచ్ వాకిటి నవకిరణి బుడ్డ నర్సింహులు తోపాటు గ్రామస్తులు, అధికారులు ఉన్నారు

## అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత జిహెచ్ఎంసిలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో మూడు కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు కాలనీ సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జిలేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గురువారెడ్డి, శాస్త్రి, రాజశేఖర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జ్యోతి, వనిత, శిల్ప, గాయత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని ఎంపి ఈటల రాజేందర్‌కు వినతి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీ రోడ్డుకు ప్రభుత్వ పాఠశాల కోసం ప్రభుత్వ భూమి ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రథమిక వైద్య కేంద్ర నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను గురువారం వారి కార్యాలయంలో హస్తినాపురం డివిజన్ బిజెపి నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన భూమిని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గజ్జల రాజు గౌడ్, గౌని వెంకటేశ్ గౌడ్, మునీల్ నాయక్, శేఖర్ గౌడ్, లక్ష్మి కాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## న్యాయవాదుల నిరసన

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం: యువ మహిళా న్యాయ వాదిని హత్య చేసిన నిందుతున్ని కఠినంగా శిక్షించాలని పట్నం బార్ అసోసియేషన్ న్యాయ వాదులు డిమాండ్ చేస్తు గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిప్ కోర్టులో న్యావాదులందరు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను బహిష్కరించి మృతి చెందిన స్వప్న న్యాయవాది చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు.ఈ సందర్భంగా న్యాయ వాదులు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన యువ న్యాయ వాదిని ఆస్తి వివాదంలో స్వంత అన్న హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండించారు.న్యాయ వాదుల రక్షణ చట్టం తెవటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని విమర్శించారు.అనంతరం న్యాయ వాదుల రక్షణ చట్టంపై అసెంబ్లీలో చర్చించాలని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కలిసి వినతి పత్రం అందచేశారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు,కార్యదర్శి ఎం వెంకటేష్,పి శ్రీనివాస్ కుమార్ న్యాయవాదులు పాల్గోన్నారు.

## ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

### డిజిపి బి.శివధర్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమివ్వనున్న '74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహణపై రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి తన కార్యాలయంలో గురువారం సంబంధిత పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో పోటీల నిర్వహణపై జరుగుతున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా పోలీసు అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిజిపి మాట్లాడుతూ వచ్చే నెల మార్చి 23 నుంచి ఏప్రిల్ 5 వరకు హైదరాబాద్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుందని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర భద్రతా బలగాల నుంచి 53 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సుమారు 2100మంది క్రీడాకారులు, అధికారులు భాగస్వాములు కాబోతున్నారని తెలిపారు. మార్చి 23న జట్లు అన్ని నగరానికి చేరుకుంటాయని, మార్చి 25న గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో ప్రారంభ వేడుకలు నిర్వహిస్తామని డిజిపి అన్నారు. ఈ పోటీల నిర్వహణ కోసం నగరం చుట్టుపక్క మైదానాలను తనిఖీ చేశామని, మైదానాలను కొన్ని మ్యాచ్‌ల కోసం, మిగిలిన మైదానాలను ప్రాక్టీస్ కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియం, తెలంగాణ పోలీస్ అకాడమీల లోని వంటి మైదానాలలో ఈ పోటీ లు జరగనున్నాయని తెలిపారు. పోటీల నిర్వహణ కోసం వివిధ కమిటీలు పనిచేస్తున్నాయని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వసతి, రవాణా సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాటు చేశామని డిజిపి పేర్కొన్నారు. ఏప్రిల్ 5న ఫైనల్ మ్యాచ్ అనంతరం ముగింపు వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఎగ్జిబిషన్ మ్యాచ్ ను నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. గత సంవత్సరం 73వ బిఎన్.మల్లిక్ ఆల్ ఇండియా పోటీలను నిర్వహించిన త్రిపుర రాష్ట్రానికి వెళ్లి వచ్చిన పోలీస్ అధికారులతో సంబంధిత వివరాలను డిజిపి అడిగి తెలుసుకున్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే జట్లు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10 వరకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటాయని, దేశవ్యాప్త పోలీస్ బలగాల మధ్య క్రీడా స్ఫూర్తిని, ఐక్యత ను పెంపొందించేలా ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని డిజిపి శివధర్‌రెడ్డి సంబంధిత పోలీస్ అధికారులకు స్పష్టంచేశారు. ఆర్‌బివిఆర్ ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సిపి ఎం.రమేష్, హైదరాబాద్ అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, ఐజిపి, స్పోర్ట్స్ గజరావు భూపాల్ పాల్గొన్నారు.

## బిసి రచయితల సమాఖ్య ఆవిర్భావం

### పోస్టర్ ఆవిష్కరించిన జూలూరు గౌరీశంకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయంతో పాటు హక్కుల సాధన కోసం భావజాలవ్యాప్తి చేస్తూ గళమెత్తేందుకు, కలమెత్తేందుకు ఆవిర్భవించిందే 'బిసి రచయితల సమాఖ్య' అని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర తొలి బిసి కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. బిసిలు తమ వాటా తాము సాధించకునేందుకు, 'మా వాటా మాకేనంటూ' నినదింపచేస్తూ 'ఓట్లు మావే సీట్లు మావే' అని చాటింపు వేసేందుకే 'బిసి రచయితల సమాఖ్య' మొదలయ్యిందని పేర్కొన్నారు. తెలుగు నేలపై ఎగిసిన అన్ని రకాల విముక్తి పోరాటాలు అస్తిత్వ ఉద్యమాలలో పాలుపంచుకుని అగ్ర భాగాన నిలిచి కీలక పాత్ర పోషించిన బిసి రచయితలు, ఇప్పుడు తమ జాతుల, కులాల హక్కుల సాధన కోసం కోట్ల గొంతుకల బడుగుల మహాస్వరంగా 'బిసి రచయితల సమాఖ్య'గా అవతరించిందని వివరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం, అరసం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ తదితర కవులు, రచయితలతో కలిసి బిసి రచయితల సమాఖ్య పోస్టర్‌ను జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ రాజ్యాంగమే ప్రమాణంగా స్థానిక సంస్థల నుంచి చట్ట సభల వరకు బిసిలకు తమ వాటా ప్రకారం లభించాల్సిన సీట్లను సాధించుకునేందుకు బిసిలను ఏకం చేయటమే ఏకైక లక్ష్యంగా బిసి రచయితల సమాఖ్య ముందుకు సాగుతుందన్నారు.



## టిఎంసి నమోదు తప్పనిసరి

### రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి



ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రు లు, నర్సింగ్‌హోంలలో పనిచేస్తున్న ప్రతి వైద్యుడు తప్పనిసరిగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టిఎంసి)లో నమోదయి ఉండాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో కొన్ని ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు తెలంగాణ మెడికల్ కౌన్సిల్లో నమోదు కాకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు, కొంతమంది వైద్యులు ఎంబిబిఎస్ మాత్రమే నమోదు చేసి తమ పిజి అర్హతలను నమోదు చేయకుండా విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించబడిందని ఆమె తెలిపారు. ఇది వైద్య నిబంధనలకు విరుద్ధమని, ప్రజల ఆరోగ్య భద్రతకు భంగం కలిగించే అంశం అని డిఎంహెచ్ఒ లలితాదేవి పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు వైద్య సంస్థల్లో సంపూర్ణ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తనిఖీల సమయంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్లో నమోదు కాని వైద్యులు లేదా, అర్హతలు పూర్తి నమోదు లేకుండా సేవలు అందిస్తున్నట్లయితే సంబంధిత వైద్యులు,ఆస్పత్రులపై నియమాలు ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అందువల్ల ప్రైవేట్ ఆస్పత్రిలో యజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న వైద్యులు టిఎంసి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, అర్హతల నమోదు పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకుని లోపాలు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని ఆమె సూచించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల గొంతుపై కత్తిలాంటివని, కార్మికుల బతుకులను ఆగం చేసేలా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులు పోరాడాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. గురువారం శేరిలింగంపల్లిలోని మాదాపూర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి పానుగంటి పర్వతాలు, సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు రామకృష్ణ, సిపిఐ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి చందుయాదవ్‌లతో కలసి ఆవిష్కరించారు. అనంతరం పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక, మనవ హక్కులను తుంగలో తొక్కి పెట్టుబడిదారులకు మేలు చేస్తున్నాడని, కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ చట్టాలను కోడ్‌లోకి మార్చి కార్మిక వర్గం హక్కులను నాశనం చేశాడని అవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చి వారికి తొత్తులుగా బిజెపి ప్రభుత్వం మారిపోయిందన్నారు. కార్మికుల కోరకు భద్రత భీమా చట్టన్ని తీసుకురావలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాల జీవోలను సవరణ చేసి కోత్త జీవోలను తీసుకురావలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయాడాన్ని అపి వేయాలన్నారు. కార్మికులకు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు రామకృష్ణ, మండల కార్యదర్శి చందు యాదవ్, శ్రీనివాస్ జెట్టి, వెంకటేష్,నారయణ తదితరులు పాల్గొన్నారు.

## పొరపాట్లు జరగకుండా బాధ్యతగా విధులు

### రంగారెడ్డి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్

ప్రజాపక్షం/రంగారెడ్డి: ఫిబ్రవరి 11న నిర్వహించే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతగా పని చేయాలని సంబంధిత అధికారులకు రంగారెడ్డి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ సూచించారు. గురువారం జిల్లాలోని శంకర్‌పల్లి మున్సిపాలిటీకి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్, పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీకి సంబంధించిన ఏర్పాట్లను, ఎన్నికల సామగ్రిని పరిశీలించి, ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించిన స్టేషనరీ తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ యోగేష్‌ను అడిగి తెలుసుకొని వాటిని పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని, స్ట్రాంగ్ రూంను, కౌంటింగ్ హాల్‌ను, పోలింగ్ నిర్వహించే పాఠశాలను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కౌంటింగ్ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి తహశీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





### ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

రాజేందర్ నగర్‌లో గల ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్‌తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఇవిఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ తహసీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ రాములు, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

## ఓటు మన హక్కు..నిర్భయంగా వేయండి

### షాద్‌నగర్ డిసిపి సిహెచ్.శిరీష

ప్రజాపక్షం/షాద్‌నగర్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ డిసిపి సిహెచ్ శిరీష సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో డిసిపి శిరీష, ఎసిపి లక్ష్మీ నారాయణల ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డిసిపి సిహెచ్ శిరీష మాట్లాడుతూ ఎవరికి భయ పడాల్సిన పని లేదని..పోలింగ్ కేంద్రానికి ఓటర్లు వెళ్ళి తమ అమూల్యమైన ఓటు వేయాలని పేర్కొన్నారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం కలిగించేందుకే వార్డులో కవాతు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏమైన ఇబ్బందులు ఉంటే తమదృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐలు విజయ్‌కుమార్, నర్సయ్య, శ్రీనివాస్, నరహరి, వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్‌లతోపాటు ఎస్ఐలు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు ఆపాలి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టలను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి ఖండించారు. గురువారం ఇబ్రహీంపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు సాధించుకోవాలి కాని బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయించటం ఎంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విధనాలు నచ్చకనే కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరితే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, ఆకుల సురేష్, నిట్టు జగదిష్, ముత్యాల నరేష్, సోయల్ పాల్గొన్నారు.


## ప్రజాసమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం



ప్రజాపక్షం/కేశంపేట: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి వివరించారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 28వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి భాగ్యలక్ష్మీ గౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అలీం సఖిబ్, కబీర్ అహ్మద్, జాఫర్‌ఖాన్, దేవయ్య, కత్తి చంద్రశేఖర్ అప్ప, అనసూయమ్మ, రజిత, రవి, చంద్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## గిరిజనులకు అండగా ప్రభుత్వం

### మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



ప్రజాపక్షం/కొత్తూరు: గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండల పరిధిలోని చాకలిదానిగుట్ట తండాలో సర్పంచ్ మూడవత్ గబ్రు చౌహాన్ ఆధ్వర్యంలో చౌకధరల దుకాణం2వ సెల్ పాయింట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రేషర్ దుకాణంతో 200గిరిజన కుటుంబాలకు లబ్ది జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, మంజుల తులసి రాంనాయక్, రాజునాయక్, తోట మహేందర్, కుమారస్వామిగౌడ్, కిషన్ నాయక్, జింకల జంగయ్య పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి రూ.1350 కోట్ల నిధులు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: మున్సిపల్ అభివృద్ధికి రెండేళ్ళ కాలంలో రూ.1350కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 6,5,4, 3,7వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో వేసిన సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత పదేళ్ళ కాలంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. దాంతో వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయన్నారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దూరం చేసేందుకు అధికారంలోకి వచ్చాకా సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి నిధులు తీసుకువచ్చి చేపట్టినట్లు తెలిపారు. ముమ్మందు మరెన్నో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష బిఆర్ఎస్ మాయమాటలకు తలోగొద్దని.. అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మామిడి శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## న్యాయవాది స్వప్న హత్య ఘటనపై బార్ అసోసియేషన్ ర్యాలీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యురాలు, యువ మహిళా న్యాయవాది స్వప్నను దారుణంగా హత్య చేసిన ఘటనపై నిరసన తెలుపుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి బార్ అసోయేషన్ ఆధ్వర్యంలో కుషాయిగూడ కోర్టు నుండి ఇసిఐఎల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. స్వప్నను హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పోలీసులు తక్షణమే స్పందించి విచారణను వేగవంతం చేస్తేనే న్యాయ వ్యవస్థపై న్యాయవాదులకు, ప్రజలకు నమ్మకం ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి బాపిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ధనలక్ష్మి, లైబ్రరీ సెక్రెటరీ వెంకటేష్, ట్రెజరర్ మురళి, రేణుక, దినేష్, తదితరులు పాల్గొన్నారు.



## సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి దుండగల్‌లో భవనాల పరిశీలన

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవగాంధీ హన్మంతు జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్‌తో గురువారం పర్యటించారు. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సూరారం అద్దె భవనం నుండి దుండిగల్‌కు తరలించే నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యతోపాటు ఇరుకైన ప్రదేశం కారణంగా కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సూరారం నుండి తరలించాలంటూ ప్రతిపాదనలు అందాయన్నారు. దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో అనువైన ప్రదేశాన్ని పరిశీలించామని త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమీషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, కోల రవీందర్ ముదిరాజ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధి చూసి ఓటు వేయండి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్ పరిధిలోని 23వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తన కుమారుడు రాఘవేందర్ గెలుపుకు 23వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో నిలిచిన అభ్యర్థి గెలుపుకోసం కృషిచేయడం జరుగుతుందన్నారు. ప్రజలు నేను చేసిన అభివృద్ధి చూసి భారీ మెజార్టీతో గెలిపించడం జరుగుతుందన్నారు. 23వ వార్డులో ప్రతిపక్ష బిఆర్‌ఎస్ అభ్యర్థి విత్‌డ్రా చేసుకోవడంతో గెలుపు సులభం అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హాజీఫాషా , హాజీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ప్రతి ఒక్కరూ ఉచిత హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్ అన్నారు. గురువారం కాకతీయ హాస్పిటల్ ఆధ్వర్యంలో చెంగిచెర్ల ఇందిరా నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను కొత్త రవి గౌడ్, కొత్త సాయితేజ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగి ప్రాథమిక స్థాయిలో వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం తీసుకోవడం వలన అనేక రోగాల బారినుండి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా మహిళలు తమ కుటుంబానికి అవసరమైన అన్నిరకాల సేవలు అందించి, వారి ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. ఇలాంటి హెల్త్ క్యాంపులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హాస్పిటల్ సిఇఒ డా॥ టి.హరప్రకాష్, డాక్టర్ నావిద్ హుసేన్ కడిలాజిస్ట్, డాక్టర్ కృష్ణ మోహన్, హాస్పిటల్ సిబ్బంది బ్రాహ్మానందు రెడ్డి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే ఇల్లు గుల్ల

**ప్రజాపక్షం/ఉప్పల్ :** పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామంతపూర్ వాసవినగర్ రోడ్ నంబర్5 లో గురువారం దొంగతనం జరిగింది. వాసవినగర్‌లో నివసించే గుంటి మల్లయ్య, మల్లమ్మ (60) దంపతులు పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి బీరువా పగులగొట్టి అందులో ఉన్న



8.5 తులాల బంగారు ఆభరణాలు, 65 తులాల వెండి, రూ.25 వేల నగదును దొంగిలించినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితులు ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాల్లోని సిసి కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు. నిందితుడి గుర్తింపునకు స్పెషల్ టీమ్‌ను నియమించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామలింగా రెడ్డి తెలిపారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** యాజమాన్యాలకు, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికులకు తీరని నష్టం కలిగించేవని తెలంగాణా మున్సిపల్ సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం అన్నారు. గురువారం గుండ్ల పోచంపల్లిలో తెలంగాణా మున్సిపల్ కాంట్రాక్టు





ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)కి చెందిన మున్సిపల్ జవాన్ డి.కిరణ్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌ల రద్దు డిమాండ్‌తో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల రక్తం పీల్చేందుకే లేబర్ కోడ్‌లు వచ్చాయని, చిరకాలంగా కార్మికులం తా పోరాడి సాధించి తెచ్చుకొన్న కార్మిక హక్కులకు తూట్లు పొడవడమే అని విమర్శించారు. కార్మికులను నిర్బంధిత బానిసలుగా మార్చే కుట్ర జరుగుతోందని మండి పడ్డారు. లేబర్ కోడ్‌ల వల్ల ఉద్యోగ భద్రత పూర్తిగా ఉండదని, జీతాల పెంపు, పని గంటల పరిమితి, హక్కుల కోసం యాజమాన్యాలను ప్రశ్నించే అవకాశం ఇక ఉండదన్నారు. లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు తమ పోరాటం ఆగదని, ఫిబ్రవరి 12న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా కార్మిక గళం వినిపించి కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌కు చెందిన గణేష్, కృష్ణ భాను, సాయిలు, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

**కార్మికుల సమ్మెతో బిజెపి సర్కార్ కళ్ళు తెరవాలి : హరినాథరావు**

**కుత్బుల్లాపూర్‌లో:** ఈ నెల 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వి.హరినాథరావు పిలుపు నిచ్చారు. గురువారం మున్సిపల్ రాష్ట్ర ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏసురత్నంతో కలిసి ఆయన కుత్బుల్లాపూర్ డిసిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ సర్కార్ 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కర్షకులు, యువతీయువకులు కన్నెర చేస్తే బంగాళాఖాతంలో మీ సర్కారు కలవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మున్సిపల్ అధ్యక్షులు చల్లపల్లి రాములు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో:** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రశాంత్ నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఫిబ్రవరి 12వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కూకట్‌పల్లి ఎఐటియుసి మండల కార్యదర్శి జి.కృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కె.మనచారి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్‌లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కన్యాలల్‌బాద్, ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, గరీబ్‌నగర్, రామయ్యగూడ, యంఐజి, గృహకల్ప, అనంతగిరిపల్లి, గెలిగేట్‌పల్లిలోని 18,19,21,29,30, 20,10,23 పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటువేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోఉంది, మున్సిపల్ చైర్మన్‌గా తన కూతురు ఉండటంతో వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస ముదిరాజ్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సంతోష్ కుమార్, రమేష్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, వార్డుల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల కోసం 'ఓటర్ సౌకర్య కేంద్రాలు'

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ జిల్లాలో జరుగుతున్న మూడు మున్సిపాలిటీల పరిధిలో ఓటర్లు తమ ఓటు, పోలింగ్ బూత్ తదితర విషయాలను తెల్సుకొనేందుకు గాను ప్రత్యేకంగా ఓటర్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేసామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆలియాబాద్, ఎల్లంపేట, మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాల్లో ఈ నెల 7, 8 తేదీల్లో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 వరకు ఓటర్లు వెళ్ళి తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయా లేదా అని ధృవీకరించటంతో పాటు తమ పోలింగ్ బూత్ ఎక్కడ ఉందన్న విషయాలపై తెల్సుకోవచ్చన్నారు. దీంతో పాటు తమ ఓటును ఏ విధంగా వేయాలన్న విషయంపై పూర్తి సమాచారం ఇస్తారన్నారు. ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు సౌకర్య కేంద్రాలను వినియోగించేలా సహకరించాలన్నారు.



## ఘనంగా ప్రారంభమైన స్పోర్ట్స్ మీట్

**ప్రజాపక్షం/ఉప్పల్ :** సత్య సాయి స్కూల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించి న 7వ ఆగమ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండారు శ్రీవాణి వెంకట్ రావు హాజరై విద్యార్థుల పరేడ్‌ను స్వీకరించి, క్రీడల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన పరేడ్, క్రీడా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ స్పోర్ట్స్ మీట్ ద్వారా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరింత పెంపొందుతాయని అతిథులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీతలక్ష్మి, డాక్టర్ చారి, సత్య సాయి స్కూల్ డైరెక్టర్ గడ్డం భవాని, పారుపల్లి హనుమంతరావు, నాగుల కనకయ్య, పీసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో ఉండే వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పురపాలక సంఘాల ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు ఈ నెల 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఏర్పాట్లు చేసామని జిల్లా నోడల్ అధికారి ఝాన్సీ రాణి తెలిపారు. జిల్లాలో జరిగే మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీల ఎన్నికల విధుల్లో ఎంపిక చేసిన ఉద్యోగులందరూ నిర్దేశించిన తేదీల్లో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ కార్యాలయాల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల విధుల్లో ఉండే వారందరికి స్పెషల్ క్యాజువల్ సెలవుగా పరిగణిస్తారన్నారు.




## రేపు జెఎన్‌టియుహెచ్ స్నాతకోత్సవం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** జెఎన్‌టియుహెచ్ స్నాతకోత్సవం సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 7న జెఎన్‌టియుహెచ్ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. యుజి, పిజి, పిహెచ్‌డి విభాగాలకు చెందిన 82,547మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. ఇందులో 87 డాక్టోరల్ డిగ్రీలు ఉన్నాయి.

ప్రతిభావంతులైన విద్యార్థులను గౌరవించేందుకు ఈ సంవత్సరం 71బంగారు పతకాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ పరిపాలనను బలోపేతం చేసే దిశగా పలు సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. విద్యా వ్యవహారాల డైరెక్టరేట్‌ను విద్యా, ప్రణాళిక డైరెక్టరేట్‌గా పేరుమార్చి, మౌలిక సదుపాయాలు, యుజిసి వ్యవహారాలకు సంబంధించిన విభాగాలను ఇందులో విలీనం చేశారు. అలాగే విద్యా ఆడిట్ డైరెక్టరేట్ ద్వారా అనుబంధ కళాశాలలు, స్వయంప్రతిపత్తి కళాశాలలు పర్యవేక్షణను క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. విద్యా సంస్కరణల్లో భాగంగా అన్ని యుజి, పిజి విభాగాల్లో పరిశ్రమ నిపుణులు, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో కొత్త అధ్యయన బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్25 నిబంధనల అమలు, నైపుణ్యాభివృద్ధి కోర్సుల చేర్పు, అన్ని రాజ్యాంగ కళాశాలలకు సమానమైన పాఠ్యాంశాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో అధ్యాపకులు గత విద్యా సంవత్సరంలో సుమారు రూ.11కోట్ల పరిశోధన గ్రాంట్లు సాధించినట్లు తెలిపారు.

అంతర్ విభాగ పరిశోధనలను ప్రోత్సహించేందుకు సిరి ప్రారంభించామని, 211మంది బాహ్య పరిశోధనా స్కాలర్లతో పిహెచ్‌డి ప్రవేశాలు విజయవంతంగా పూర్తిచేసినట్లు వివరించారు. అంతర్జాతీయంగా స్వీడన్‌లోని బ్లెకింగే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో 20 సంవత్సరాల విద్యా సహకారం కొనసాగుతుండటం విశ్వవిద్యాలయ ప్రగతికి నిదర్శనమని అధికారులు తెలిపారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు ఆదేశాలు

### అదనపు ఎస్‌పి రాములు నాయక్

**ప్రజాపక్షం /వికారాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులకు ఆన్లైన్ నందు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్‌పి బి. రాములు నాయక్ పోలీసు అధికారులకు ఆన్లైన్ ద్వారా ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు

ఈ శిక్షణలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద పాటించాల్సిన డూస్ అండ డోంట్స్, ఎన్నికల నియమావళి ప్రకారం 100 , 200 మీటర్ల పరిధిలో నిబంధనల కట్టుదిట్టమైన అమలు, అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడం, నిబంధనల ఉల్లంఘన జరిగితే తక్షణమే తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన అవగాహకల్పించారు. ఎన్నికల సమయంలో ఎన్ఫోర్స్మెంట్ చర్యలు, అక్రమంగా నగదు, మద్యం తదితర ప్రలోభకర వస్తువుల తరలింపును అరికట్టేందుకు వాహన తనిఖీలు, క్యాష్ సీజ్ ప్రక్రియలు కచ్చితంగా చేపట్టాలని సూచించారు. అలాగే ఎన్నికల నిర్వహణలో వర్తించే ముఖ్యమైన చట్ట విభాగాల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ ఆన్లైన్ ఓరియంటేషన్ శిక్షణ ద్వారా క్షేత్రస్థాయి పోలీసు అధికారులు మరియు సిబ్బందిలో ఎన్నికల నిర్వహణపై ఉన్న సందేహాలను నివృత్తి చేసి, వారిని పూర్తి స్థాయిలో ఎన్నికల విధులకు సిద్ధం చేయడం జరిగిందని జిల్లా అదనపు ఎస్‌పి బి. రాములు నాయక్ తెలిపారు. ఇట్టి కార్యక్రమం లో డిటిసి డిఎస్‌పి శ్రీనివాసులు, డిఎస్‌పి జానయ్య, వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, పరిగి డిఎస్‌పి శ్రీనివాస్, తాండూర్ డిఎస్‌పి యాదయ్య సిఐలు, ఎస్.ఐలు, తదితరులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/పరిగి :** రేపు ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా పరిగి మండల పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి సిఎం ఏర్పాట్లను పరిశీలించారు. పరిగి మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారు నందు ఉన్న ప్రాంతంలో ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లు పై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, హెలిప్యాడ్, వేదిక, భారీకేడ్స్, వెహికిల్ పార్కింగ్, మొబైల్ టాయిలెట్స్ తదితర వాటి ఏర్పాట్లను నిర్ణీత గడువుకంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైనస్థలం ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్‌డిఒ వాసుచంద్ర, డిఎస్‌పి శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనుల పర్యవేక్షణ

**ప్రజాపక్షం/ఉప్పల్:** రామంతపూర్ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్ మజీద్ లైన్‌లో రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు పరిశీలించారు. గతంలో ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన పాత సీవరేజ్ లైన్ కారణంగా ఇంద్రనగర్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించిన కార్పొరేటర్, సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఇంద్రనగర్ మెట్ల గల్లీ నుంచి మార్కండేయ స్వామి గుడి వరకు 300డయా పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. ఈ పనులలో భాగంగా ఇంద్రనగర్ ఈద్గా నుంచి మార్కండేయ స్వామి గుడివరకు రూ.30 లక్షలతో నూతన సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్డు పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకల సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంకురి కుమారస్వామి, మసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బొడ్డుపల్లి దానయ్య, దామోదర కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు వస్తేనే ప్రజలు గుర్తుకొస్తారా

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఎన్నికలు వస్తేనే మాజీ మంత్రి మల్లారెడ్డికి ప్రజలు గుర్తుకొస్తారని ఎన్నికలప్పుడు హంగామా చేసే నాయకులను ప్రజలు నమ్మరని కాంగ్రెస్ ప్రభుత్వం వైపు ప్రజలు ఆసక్తితో ఉన్నారని బోడుప్పల్ మాజి మేయర్, మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థులు పులి ప్రభాకర్, నాగేష్‌లను గెలిపించాలని కోరుతు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉందని చేతి గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి పథకాలు కొనసాగుతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండేళ్లలో ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, సన్నబియ్యం లాంటి పథకాలను ప్రవేశపెట్టి అమలుపరిచిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ఓట్లు వస్తేనే గ్రామాల్లో తిరుగుతాడని లేకుంటే తన సొంత వ్యాపారాలతో బిజీగా ఉంటారని అన్నారు. ఓటమి భయంతో మల్లారెడ్డి ఇంటింటికి తిరుగుతున్నాడని అద్రాస్‌పల్లిలో రెండు వార్డులు కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరి, ప్రభాకర్, నాగేష్, స్థానికులు పాల్గొన్నారు.



## బిటి రోడ్డు వేయాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిత్యం రద్దీగా ఉండే వాయుపురి కాలనీలో బిటి రోడ్డు వేయాలని నేరేడ్‌మెట్ కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి కోరారు. మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గాంగ్వార్‌ను గురువారం ఆమె కల్సి వినతిపత్రం సమర్పించారు. దీంతో పాటు డివిజన్‌లో గతంలో సమర్పించిన 5 కాలనీలకు సంబంధించి రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. యాప్రాల్ పరిధిలోని ప్రకృతి విహార్ నుండి స్వర్ణాంధ్ర వరకు, స్వర్ణాంధ్ర నుండి గోల్ఫ్ లింక్ వరకు ఉన్న రెండు ఎస్ఎన్‌డిసి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిశీలించాలని కోరారు. కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, బిజెపి శ్రేణులు ఆదిత్య, శ్యామ్, ఆకారం సాయి, రమేష్, ఉత్తమ్ తదితరులు కార్పొరేటర్ వెంట ఉన్నారు.

## కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 13 నుండి 18 వరకు జిల్లా స్థాయి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి వై.దామోదర్‌రెడ్డి , డిఈఓ విజయకుమారి, ఆలయ చైర్మన్ వెంకటేష్‌లు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పాఠశాల క్రీడోత్సవాలకు గాను కబడ్డి, కోకో, వాలీబాల్ ఆటల్లో పోటీలు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు 13 నుండి 14 వరకు, యువతీ యువకులకు 17 నుండి 18 వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 11 సాయంత్రం 5 గంటల వరకు కీసరలోని ఎంఆర్సీ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు.

# డబ్ల్యుపిఎల్ విజేత ఆర్‌సిబి






మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లో రికార్డు స్కోర్ కొట్టినా ఢిల్లీ క్యాపిటల్స్ కల సాకారమవ్వలేదు. తొలి కప్‌ను ఒడిసిపట్టాలని భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉఫ్‌మనిపించింది. జార్జియా వోల్ (79), కెప్టెన్ స్మృతి మంధాన(87)లు వీరవిహారం చేశారు. ఢిల్లీ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ బౌండరీల మోతతో చెలరేగారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 165పరుగుల జోడించి.. ఆర్‌సిబిని గెలుపు దిశగా నడిపారు. వోల్, మంధాన ఔటయ్యాక డీక్లెర్క్(6 నాటౌట్), రాధా యాదవ్(8 నాటౌట్) లాంఛనం పూర్తి చేచేశారు. అంతే.. నాలుగోసారైనా కప్పు ముద్దాడాలనుకున్న ఢిల్లీ ఫైనల్ ఫోబియాతో చేజార్చుకుంది. డబ్ల్యుపిఎల్ చరిత్రలో మరోసారి రన్నరప్ ట్యాగ్‌కే పరిమితమైంది ఢిల్లీ క్యాపిటల్స్. వడోదరలో గురువారం జరిగిన ఫైనల్లో రికార్డు స్కోర్ చేసినా ఆర్‌సిబి ముందు ఢిల్లీ నిలువలేకపోయింది. భారీ ఛేదనలో తొలి ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన గ్రేస్ హ్యారిస్(8)ను హెన్రీ ఔట్ చేసింది. ఆతర్వాత కెప్టెన్ స్మృతి మంధాన(87)జతగా జార్జియా వోల్(74) బౌండరీలతో చెలరేగింది. అర్ధ శతకం పూర్తి చేసుకుంది. కాసేపటికే మంధాన సైతం ఫిఫ్టీ అందుకుంది. వీరిద్దరు శతక భాగస్వామ్యంతో ఆర్‌సిబిని గెలుపు దిశగా నడిపారు. 165 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని ఎట్టకేలకు మిన్ను మని విడదీసింది. 21 బంతుల్లో 30 రన్స్ కావాలంతే. రీచా ఘోష్(6)ను నందిని శర్మ వెనక్కి పంపగా ఢిల్లీ జట్టులో ఆశలు చిగురించాయి. కానీ, నడినే డీక్లెర్క్ బౌండరీతో.. ఉంది. హెన్రీ ఓవర్లో స్వీప్ షాట్ ఆడబోయిన మంధాన బౌల్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. ఆ తర్వాత బంతికే రాధా యాదవ్ ఇచ్చిన క్యాచ్‌ను మిన్ను మని నేలపాలు చేసింది. ఆఖరి ఓవర్లో 10 పరుగులు అవసరమవ్వగా.. రాధా యాదవ్(8 నాటౌట్) రెండు బౌండరీలు బాదింది. 6 వికెట్ల తేడాతో గెలుపొందిన ఆర్‌సిబి రెండోసారి విజేతగా నిలిచింది.

**హెన్రీ, జెమీమా విధ్వంసం..** మొదట ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు శివమెత్తారు. వచ్చినవాళ్లు వచ్చినట్టు దంచేయగా డబ్ల్యుటిసి టైటిల్ పోరులో ఢిల్లీ రికార్డు స్కోర్‌తో చరిత్రకెక్కింది. ఓపెనర్లు శుభారంభమివ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(57) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. ఒత్తిడికి లోనైన ఆర్‌సిబి బౌలర్లను ఆఖర్లో లారా వొల్వార్డ్త్(44), చిన్నెల్లీ హెన్రీ(32 నాటౌట్) బెంబేలెత్తించారు. డీక్లెర్క్ వేసిన 18వ ఓవర్లో హెన్రీ 24 రన్స్ రాబట్టగా.. చివరి ఓవర్లో పది రన్స్ రావడంతో బెంగళూరుకు 204 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## బిసిసిఐ మాజీ అధ్యక్షుడికి లైన్ క్లియర్..

### తొమ్మిదేళ్ల నిషేధం ఎత్తివేసిన సుప్రీం కోర్టు!

భారత క్రికెట్ నియంత్రణ మండలి మాజీ అధ్యక్షుడు అనురాగ్



ఠాకూర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఆయన పై కొనసాగుతున్న నిషేధాన్ని గురువారం అత్యున్నత న్యాయ స్థానం ఎత్తివేసింది. దాంతో, బిసిసిఐ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ఠాకూర్‌కు మార్గం సుగమమైంది. నిషేధం కారణంగా 2017 నుంచి క్రికెట్ వ్యవహారాలకు దూరమైన ఠాకూర్ తనకు ఊరట కల్పించాలని సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. గురువారం ప్రధాన న్యాయమూర్తి ఇండియా సూర్యకాంత్, జస్టిస్ జయ్మాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఠాకూర్‌పై విధించిన నిషేధం జీవితకాలం కొనసాగదని, ఇప్పటికే ఆయన తొమ్మిదేళ్లు క్రికెట్ కార్యకలాపాలకు దూరమయ్యారని ధర్మాసనం పేర్కొంది.

## వరల్డ్‌కప్‌లో కోహ్లీ, రోహిత్ ఎందుకు ఆడొద్దు?






రాబోయే వన్డే వరల్డ్ కప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు అవకాశం దక్కేనా? అనే ప్రశ్న అభిమానులను వెంటాడుతూనే ఉంది. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న రోకో అనుభవం ప్రపంచకప్‌లో భారత జట్టుకు చాలా అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సైతం ఇదే మాట అంటున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఎందుకు ఆడొద్దు అని ఫామ్‌తో, ఫిట్‌గా ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వచ్చే వన్డే ప్రపంచకప్‌లో ఎందుకు ఆడకూడదు? అని ప్రశ్నించాడు. వయసు 30 దాటినంత మాత్రాన వారిద్దరూ వచ్చే ప్రపంచకప్ ఆడకూడదా? రోకో భవితవ్యాన్ని నిర్ణయించాల్సింది మనం కాదు. వారే నిర్ణయం తీసుకోవాలి. మహీ భాయ్ ప్రశ్నించాడు. టి–20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మలు వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. వచ్చే ఏడాది ప్రపంచకప్‌తో కెరీర్ ముగించాలనే ఆలోచనల్లో ఉన్న ఈ ద్వయం కల నెరవేరుతుందా?అనేది ప్రశ్నార్థంగా మారింది. ఈనేపథ్యంలో.. ధోనీ తన హయాంలో ఆడిన విరాట్, రోహిత్‌కు మద్దతు పలికాడు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహీ వయసు అనేది ఒక అంశం మాత్రమే. ఫామ్, ఫిట్నెస్.. ఈరెండే చాలా కీలకం.కాబట్టి ప్రస్తుతం ఫామ్‌తో, ఫిటెనెస్‌తో ఉండి జట్టును గెలిపిస్తున్నప్పుడు వారిని అడ్డుకోవడం దేనికి? అని తన అభిప్రాయం వెలిబుచ్చాడు ప్రస్తుతం రోహిత్ 38 ఏళ్లుండగా.. కోహ్లీకి 37 ఏళ్లున్నాయి. నిరుడు ఆస్ట్రేలియా పర్యటనతో వన్డే పగ్గాలు శుభమన్ గిల్‌కు అప్పగించడం.. యువకులను సానబెట్టాలనుకోవడం వంటివి కోహ్లీ, రోహిత్‌లకు సవాల్ విసురుతున్నాయి. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో విరాట్, హిట్‌మాన్ అంటీ ముట్టనట్టే ఉంటున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సైతం రోకోకు వరల్డ్‌కప్‌లో అవకాశం ఇస్తాడనే నమ్మకం లేదు. ఫామ్‌లో ఉండేందుకు దేశవాళీ క్రికెట్‌లోనూ ఆడుతున్న ఈ లెజెండ్స్‌కు వరల్డ్‌కప్‌లో అవకాశమిచ్చి గౌరవంగా వీడ్కోలు పలకాల ని విశ్లేషకులు అంటున్నారు.

## పోటీ కోసం జికె

## ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?

- భారతదేశం అంతరిక్షానికి వెళ్లిన తొలి వ్యక్తి ఎవరు?
  రాకేష్ శర్మ
- భారతదేశ రాజధాని ఏది?
  న్యూఢిల్లీ
- భారత రాజ్యాంగం ఎప్పుడు అమలులోకి వచ్చింది?
  26 జనవరి 1950
- భారత జాతీయ పక్షి ఏది?
  నెమలి
- భారత జాతీయ జంతువు ఏది?
  పులి
- భారత జాతీయ పుష్పం ఏది?
  కమలం
- భారత జాతీయ వృక్షం ఏది?
  మర్రిచెట్టు
- భారత జాతీయ గీతం రచించినవారు ఎవరు?
  రవీంద్రనాథ్ ఠాగూర్
- భారత జాతీయ గీతం పేరు ఏమిటి?
  జన గణ మన
- భారత జాతీయ గీతం ఆలపించడానికి ఎంత సమయం పడుతుంది?
  52 సెకన్లు
- ప్రపంచంలో అతి పెద్ద ఖండం ఏది?
  ఆసియా
- ప్రపంచంలో అతి పెద్ద మహాసముద్రం ఏది?
  పసిఫిక్ మహాసముద్రం
- ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?
  నైల్ నది
- ప్రపంచంలో అతిఎత్తైన పర్వత శిఖరం ఏది?
  మౌంట్ ఎవరెస్ట్
- ప్రపంచంలో అతి చిన్న దేశం ఏది?
  వాటికన్ సిటీ
- భారతదేశంలో అతి పొడవైన నది ఏది?
  గంగా
- భారతదేశంలో అతి పెద్ద రాష్ట్రం (విస్తీర్ణం ప్రకారం) ఏది?
  రాజస్థాన్
- భారతదేశంలో అతి చిన్న రాష్ట్రం ఏది?
  గోవా
- భారతదేశంలో అతి పొడవైన ఆనకట్ట ఏది?
  హిరాకుడ్ డ్యామ్
- భారతదేశంలో అతి ఎత్తైన జలపాతం ఏది?
  జోగ్ జలపాతం
- భారతదేశ తొలి రాష్ట్రపతి ఎవరు?
  డా. రాజేంద్ర ప్రసాద్
- భారతదేశ తొలి ప్రధాని ఎవరు?
  జవహర్‌లాల్ నెహ్రూ
- భారతదేశ తొలి మహిళా ప్రధాని ఎవరు?
  ఇందిరా గాంధీ
- భారతదేశ తొలి మహిళా రాష్ట్రపతి ఎవరు?
  ప్రతిభా పాటిల్
- భారతదేశ తొలి మహిళా ఐపిఎస్ అధికారి ఎవరు?
  కిరణ్ బేడీ
- సూర్యుడు ఏ గ్రహ కుటుంబానికి చెందాడు?
  సౌర కుటుంబం
- భూమికి సహజ ఉపగ్రహం ఏది?
  చంద్రుడు
- సౌర కుటుంబంలో అతి పెద్ద గ్రహం ఏది?
  బృహస్పతి
- ఎర్ర గ్రహం అని ఏ గ్రహాన్ని అంటారు?
  మంగళ గ్రహం



- భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరగడానికి పట్టే కాలం ఎంత?
  365 రోజులు
- భారతదేశ కరెన్సీ పేరు ఏమిటి?
  రూపాయి
- రూపాయి చిహ్నం (₹) రూపకర్త ఎవరు?
  ఉదయ్ కుమార్
- భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) స్థాపించబడిన సంవత్సరం?
  1935
- భారతదేశ జాతీయ క్రీడ ఏది?
  హాకీ
- ఒలింపిక్స్‌లో అత్యధిక బంగారు పతకాలు గెలిచిన క్రీడాకారుడు ఎవరు?
  మైకేల్ ఫెల్ప్స్
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  జెనీవా
- ఐక్యరాజ్యసమితి (UNO) స్థాపించబడిన సంవత్సరం?
  1945
- ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  న్యూయార్క్
- నోబెల్ బహుమతులు ఎవరి స్మారకంగా ఇవ్వబడతాయి?
  ఆల్ఫ్రెడ నోబెల్
- నోబెల్ శాంతి బహుమతి ఎక్కడ అందజేస్తారు?
  ఓస్లో (నార్వే)
- భారతదేశంలో అతి పెద్ద సరస్సు ఏది?
  చిలికా సరస్సు
- డెక్కన్ పీఠభూమి ఏ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది?
  దక్షిణ భారత రాష్ట్రాలు
- భారతదేశంలో ఎడారి ప్రాంతం ఏది?
  థార్ ఎడారి
- పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రవేశపెట్టిన రాష్ట్రం ఏది?
  రాజస్థాన్
- భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రం ఏది?
  ఉత్తరప్రదేశ్
- విద్యుత్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
  బెంజమిన్ ఫ్రాంక్లిన్
- కంప్యూటర్ పితామహుడు ఎవరు?
  చార్లెస్ బాబేజ్
- టెలిఫోన్‌ను కనుగొన్నవారు ఎవరు?
  అలెగ్జాండర్ గ్రాహమ్ బెల్
- రేడియోను కనుగొన్నవారు ఎవరు?
  గుగ్లియెల్మో మార్కోని
- ఇంటర్నెట్ పితామహుడు ఎవరు?
  వింట్ సర్ఫ్
- భారతదేశ తొలి ఉపగ్రహం పేరు ఏమిటి?
  ఆర్యభట్ట
- ఇస్రో ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  సమాధానం: బెంగళూరు
- చంద్రయాన్1 ఏ సంవత్సరంలో ప్రయోగించారు?
  2008


# కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోంది






సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పొరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోందని, 60 డివిజన్ల వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం దళిత సంఘాల ఐక్య సంఘటిత వేదికతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా శ్రేయస్సే తమకు ధ్యేయమని, తమకు పదవులు, అధికారం ముఖ్యం కాదన్నారు. కార్పొరేషన్ సాధించుకోవడం ద్వారా తన చిరకాల స్వప్నం సాకరమైందని, తద్వారా పాల్వంచ నుంచి సుజాతనగర్ వరకు అనూహ్యమైన అభివృద్ధి జరగనుందని, పరిశ్రమలు రానున్నాయని, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవనవిధానం మెరుగు పడుతుందన్నారు. ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు వచ్చాయని, వాటితో కార్పొరేషన్ వ్యాప్తంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుపాటు విషయంలో సమన్యాయం పాటించామని, జనరల్ స్థానాల్లో సైతం ఎస్‌సిలను నిలిపామని, బిసి, మైనార్టీలకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఇది అందరి ఎర్రజెండా అని, ఈ ఎర్రజెండాను గెలిపించుకోవడం ద్వారా ఆభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. సిపిఐ, టిడిపి, దళిత సంఘాల ఐక్య సంఘటిత వేదిక కలిసి కష్టపడి పనిచేసి తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్‌కు మనకు ఎలాంటి వైరం లేదని, సీట్ల సర్దుబాటు విషయంలో సంఖ్యాపరమైన సమస్య తలెత్తడంతో సిపిఐ కూటమి 60 సీట్లలో పోటీకి వెళ్లిందన్నారు. విధాన పరమైన విధానాల వల్లే విడివిడిగా పోటీ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కలిసే ఉన్నామని స్పష్టం చేశారు.



కమ్యూనిస్టులది ఏముందిలే అనటం అవివేకం అని, ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఎవరి పనులు వారివే అని గుర్తు చేశారు. 12వ వార్డు అభ్యర్థిని నాగలక్ష్మి ,13వ వార్డు అభ్యర్థిని పి.ఇందిరా ప్రియదర్శిని, 15వ వార్డు అభ్యర్థిని కె.సాహితి ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ప్రజలు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కూసపాటి శ్రీనివాస్, బొమ్మెర శ్రీనివాస్, రత్నకుమారి, మేదిని లక్ష్మి, బొంకూరి పరమేష్, ఇటికల మొగిలి, దాసరి సారథి, ఎర్ర కామేష్, మాతంగి సంతోష్, పీక కృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐలో 50 కుటుంబాలు చేరిక

భారత కమ్యూనిస్టు పార్టీలో ప్రకాష్‌నగర్‌కు చెందిన 50 కుటుంబాల వారు చేరారు. పల్లపు సాగర్, పల్లపు విజయ్ కుమార్, బోదాసు రామ్ ప్రసాద్, ఆధ్వర్యంలో చేరిన వారికి ఎమ్మెల్యే కూనంనేని ఎర్రకండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై సిపిఐలో చేరినట్లు తెలిపారు. కార్పొరేషన్ ఎన్నిక ల్లో సిపిఐ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పాల్గొన్నారు.

## ప్రచారంలో సిపిఐ అభ్యర్థుల ముందంజ

**ప్రజాపక్షం/పాల్వంచ :** 27 ఏండ్లుగా ఎన్నికలు ఎరుగని పాల్వంచ పట్టణ ప్రజలకు ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. దీంతో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి 27 డివిజన్‌లలో పోటీ చేస్తున్న సిపిఐ, తెలుగుదేశం పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళుతున్నారు. పాల్వంచ రెండవ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థిని పగిడిపల్లి ఆదిలక్ష్మి , మూడవ డివిజన్ నుండి గుగులోత్ కల్పనలకు ప్రశాంత్‌నగర్ కాలనీ, వెంగళరావు కాలనీలలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. నాలుగో డివిజన్‌లో రావుల స్వాతి ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. 6వ డివిజన్ నుండి బరిలో నిలుచున్న సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్‌కు మద్దతుగా ఎఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. 40వ, డివిజన్ నుండి మరోసారి పోటీ చేస్తున్న పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబ పట్ల ప్రజలు, వ్యాపార వర్గాలు సానుకూల ధృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన ఆయన పలు అభివృద్ధి పనులు చేపట్టారు. 35వ, డివిజన్ నుంచి నామా కీర్తి తెలుగుదేశం, సిపిఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం సాగిస్తున్నారు. 37 డివిజన్ నుండి డాక్టర్ కమల తణ ప్రచారంలో చాపకింద నీరులా దూకుపోతున్నారు. పాత పాల్వంచ ఏరియాలోని 46,47 డివిజన్‌లలో గుర్రం వెంటేశ్వర్లు, మహమ్మద్ జిలానీబేగంల ప్రచారం దూసుకుపోతున్నారు. 45వ, డివిజన్‌లో విద్యావేత్త గౌతమి క్రిష్ణ గొల్లగూడెం, ఒడ్డుగూడెం తదితర కాలనీలలో ప్రచారంలో ముందంజలో ఉన్నారు. 39వ, వార్డు నుంచి మహమ్మద్ అస్లాం ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతున్నారు. 38 డివిజన్ నుండి చెరుకూరి శేఖర్ బాబు ప్రజల్లో కలిసిపోయి కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. పట్టణ ప్రజలకు సుపరిచితులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు 44 డివిజన్‌లో గెలుపు దిశగా దూసుకుపోతున్నారు.









## సిపిఐ అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఎంలు బలపరిచిన సిపిఐ కూటమి అభ్యర్థుల్లు 5వ వార్డు అభ్యర్థి గంగసరం శ్రీనివాస్, 24వ వార్డు అభ్యర్థి వేముల జ్యోతి శ్రీకాంత్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ పార్టీకి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో 24వ వార్డు ఇంచార్జ్ రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కుప్పగల కిషోర్ రెడ్డి, వార్డు అధ్యక్షులు అశోక్, నాయకులు సాబీర్ ఖాన్, వేముల రాజమౌళి, కుడుదుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే : సుధాకర్

### 17వ డివిజన్ సిపిఐ అభ్యర్థి స్వప్నను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్‌లోని 17వ డివిజన్ గౌతంనగర్‌లో సిపిఐ తరపున పోటీ చేసిన అభ్యర్థి బి.స్వప్నను ఈనెల 11న జరిగే పోలింగ్‌లో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన ప్రచారంలో వారు పాల్గొన్నారు. అనునిత్యం పేదల సమస్యలపై పోరాడుతుంది కమ్యూనిస్టులేనన్నారు. డివిజన్‌లో తాగునీటి, మురికి కాలువలు, రోడ్లు, విద్యుత్ సరఫరా, ఇతర సంక్షేమ పథకాల అమలు కోసం సిపిఐ పని చేస్తుందని ఈసందర్భంగా ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అనిల్, ముత్యాలు, అలీ ఇమ్రాన్, తిరుపతి, సాయన్న పాల్గొన్నారు.

## మల్లన్న సాగర్ నిర్వాసితులకు మద్దతుగా సిపిఐ పోరాటం

### వార్డుల్లో సిపిఐ నేత మంద పవన్ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/గజ్వేల్ :** సర్వం కోల్పోయిన మల్లన్న సాగర్ నిర్వాసితులకు అండగా తమ పార్టీ పోరాటం చేస్తుందని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పరిధిలోని 7, 9, 10, 13 వార్డులలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరుతూ ఇంటింటి ప్రచారంలో కంకి కొడవలు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాలలో సమస్యలపైన పోరాడిన సిపిఐ 013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసినట్లు చెప్పారు. ఈ పోరాటంలో అనేకసార్లు పోలీసులతో లాఠీదెబ్బలు తిని జైలుకు వెళ్లామన్నారు. భూనిర్వాసితుల సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బట్టు దయానందరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రజలకు భూనిర్వాసులకు చేసింది ఏమీ లేదని, బిజెపికి ఓటు వేస్తే అభివృద్ధి శూన్యమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండల గణేష్, పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, ఇంచార్జి శివలింగ కృష్ణ, నాయకులు మొట్ట శీను కొండ కింది పోచయ్య, గూడూరు యాదమ్మ, పోతుల శంకరయ్య పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలు

### ప్రచారంలో సిపిఐ అభ్యర్థిని మేకల అశ్విని దాసు

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికల్లో నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ప్రాంతంలోని 6వ డివిజన్ నుంచి సిపిఐ అభ్యర్థిని మేకల దాసు సతీమణి అశ్విని గెలుపునకు అత్యంత చేరువలో ఉన్నారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన దాసు ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో అనేక పోరాటాలు చేసి ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు. జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారి పక్షాన నిలబడి పోరాడటంతో పాటు వారికి నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్లస్థలాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో ఆయనపై కేసులు నమోదైనా వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన నిలిచారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన ఇళ్ల పట్టాలను ఇప్పించడంలో మేకల దాసు సఫలీకృతుడయ్యారు. అంతేకాకుండా స్థానికంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిరంతరం ప్రజల్లో మమేకమయ్యారు.





## మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలుకుదాం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ఈనెల 12వ తేదీన ఐక్య కార్మిక సంఘాల అధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం ద్వారా నరేంద్ర మోడీకి బుద్ధి చెప్పాలని మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని ఆయన అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూనియన్ పెట్టుకునే హక్కును ప్రతి కార్మికుడికి ఇవ్వాలని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అప్పజెప్పే కార్యక్రమానికి స్వస్తి చెప్పాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, ఎండి పాషా, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు కొండలు, గోపి, ఎల్లయ్య, గౌరీ నాయుడు పాల్గొన్నారు.

## సాయి శ్రీని గెలిపిస్తే డివిజన్ అభివృద్ధి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** కార్పొరేటర్‌గా పబ్బు సాయి శ్రీ సందీప్‌ని గెలిపిస్తే 42వ డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి అన్నారు. నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్,సిపిఐ పొత్తులో భాగంగా గురువారం పట్టణంలోని 42వ డివిజన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి పబ్బు సాయి శ్రీ సందీప్ గెలుపు కోరుతు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి సంపూర్ణ మద్దతు ఇచ్చి ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్‌కి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.ఈడివిజన్ ప్రజలు సాయి శ్రీ కి ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల తులసిదాసు,సైదులు,టి.గిరి,నాయకులు నల్ల నరసింహ,కత్తుల మారయ్య, రాజు,విషాని,ఆదమ్మ పూలమ్మ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది చెడగొట్టే పని తప్ప బాగుచేసే పనికాదు

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాంగ్రెస్ పార్టీది చెడగొట్టే పని తప్ప బాగుచేసే పనికాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని రెండేళ్లలో కాంగ్రెస్ నాయకులు ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధితో పాటు పదేండ్లలో పెంచిన పచ్చదనాన్ని సైతం ఎండబెడుతున్నారని, కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు భావిస్తున్నారన్నారు. మోసపోతే గోసపడతామని కెసిఆర్ ఎన్నోసార్లు చెప్పిండని, కానీ ప్రజలు కాంగ్రెస్ మాయగాళ్లను నమ్మినందుకు నట్టేట ముంచారని దుయ్యబట్టారు. మరోసారి మోసపోకుండా జాగ్రత్త పడాలని మున్సిపల్ ఎన్నికల్లో ఆరాచక కాంగ్రెస్‌ను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. మిర్యాలగూడ సభలో సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. హార్వర్డ్ యూనివర్సిటికి వెళ్తే అందరికి జ్ఞానం పెరుగుతుంది కానీ రేవంత్‌కు ఉన్న ఆ కాస్త జ్ఞానం సైతం పోయిందని ఎద్దేవా చేశారు.

## ఎన్నికల ఏర్పాట్లపై తనిఖీలు

**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు మున్సిపల్ కమిషనర్ అశోకరెడ్డి తో కలిసి గురువారం మున్సిపాలిటీలోని డీఆర్సీ సెంటర్,స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, సదుపాయాలు,పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికలు ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు పేర్కొన్నారు. విరి వెంట సాగర్ సిఐ శ్రీను నాయక్ ఉన్నారు.

# అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్‌దే గెలుపు

### మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### అభివృద్ధిలో వామపక్ష అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్రంలోని మున్సిపాలిటిలలో అన్ని స్థానాలలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్విప్ చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 17వ వార్డులో సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థి గుండు తిరపతమ్మను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ మిత్ర పక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆర్గనైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటిలలో అధిక మొత్తంలో నిధులు వెచ్చించి ప్రజలకు మౌళిక సదుపాయలను అందుబాటులోకి తెచ్చి, అభివృద్ధి సంక్షేమాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. వార్డులలో ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వామపక్ష పార్టీల కౌన్సిలర్లకు అభివృద్ధి పథకాలలో తగిన భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు యరగాని నాగన్నగౌడ్, బెల్లంకొండ వెంకటనారాయణ, దొంగరి వెంకటేశ్వర్లు, ఈడుపుగంటి సుబ్బారావు, దాస నాగేశ్వర రావు, బచ్చు రామారావు పాల్గొన్నారు.

## నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయలేదు...చేయబోను

### నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా చేసి తీరుతా

### బిఆర్ఎస్,బిజెపి పార్టీలు ప్రజల్లో లేవు...వారికి ఓటు వేస్తే వృథా అవుతుంది : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ ప్రజలు నామీద ఉంచిన నమ్మకాన్ని ఏనాడు వమ్ము చేయలేదని ఇక మీదట కూడా చేయబోను అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి నల్లగొండ పట్టణంలోనీ పలు డివిజన్లలో రోడ్‌షో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకులనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా నిలిపిందన్నారు. ఈ ఎన్నికలు పేద ప్రజలకు మేలు చేసే ఎన్నికలని చెప్పారు.ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులు,సన్నబియ్యం,ఇందిరమ్మ ఇండ్లు, చీరలు అందిస్తున్నామని,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని,200యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున అర్హులైన ప్రతి పేదవారికి సొంతిల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఒక్కొక్కటిగా అన్ని హామీలు నెరవేరుస్తామని చెప్పారు. 48కి 48 డివిజన్లలో కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి నల్లగొండకు ఎక్కువ నిధులు తెస్తానని అన్నారు.నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా చేసి తీరుతానని,48మంది కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపించి తనకు మరింత బలాన్ని ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులు ఆలకుంట్ల నాగరాజు,గురిజాల నరేందర్, గాలి వినోద,గోగుల గణేష్, గడిగ హిమబిందు, బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్,అల్లి మల్లికార్జున్,బోయపల్లి వేదశ్రీ, నంద్యాల వీర బ్రహ్మానంద రెడ్డి, పుట్ట వెంకన్న గౌడ్,ఇటికాల మంగమ్మ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## చండూరును కూటమి కైవసం చేసుకోవాలి

### భారీ ఎన్నికల ర్యాలీ ,ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు** : ప్రజా ఆశీర్వాదం కాంగ్రెస్ ,కమ్యూనిస్టు (సిపిఐ) మిత్రపక్షాల కూటమి వైపే ఉందని చండూరు మున్సిపాలిటీలో 10కి 10 స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధీమా వ్యక్తం చేశారు. గురువారం చండూరు మున్సిపాలిటీలోని 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కోడి శ్రీనివాసులు , 4వ వార్డు సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మ శ్రీనివాస్ ,5 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కాట్రోతు సుగుణ చక్రవర్తి , మూడవ వార్డు అభ్యర్థి దోటి సుజాత వెంకటేశ్ యాదవ్ , సిపిఐ కాంగ్రెస్ నాయకులతో కలిసి బొడ్రాయి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, సిపిఐ నాయకులతో కలిసి మున్సిపాలిటీలో భారీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. అనంతరం 4,5,3,6 వార్డులలో అభ్యర్థులతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలువ వార్డులో కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మ శ్రీనివాసులు కంకి కొడవలి గుర్తుపై , 5, 6,3 వార్డులలో సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్దుల చెయ్యి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన ర్యాలీలో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్, కమ్యూనిస్టుల అభ్యర్థులను గెలించాలని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను గెలిపిస్తే జోడెద్దుల్లాగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి , ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యంను కలిసి చండూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే భాధ్యత మాది అని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , సిహెచ్ అంజాచారి, బొల్గూరి నర్సింహ్మా, తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , కాంగ్రెస్ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, కాంగ్రెస్ నాయకులు కోడి గిరిబాబు, డాక్టర్ కోడి శ్రీనివాసులు , దోటి వెంకటేశ్ యాదవ్, నల్లగంటి మల్లేశం, వెంకటేశం పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఆలేరు విస్తృత ప్రచారంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం రెండో రోజు కూడా జోరుగా సాగింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గడపగడపకు తిరుగుతూ ప్రజలను కలుసుకొని ఓటును అభ్యర్థించారు. ఆలేరు మున్సిపాలిటీలో మొత్తం 12 సీట్లకు 12 సీట్లు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈసారపు యాదగిరిగౌడ్, టౌన్ అధ్యక్షులు ఏజాజ్, నాయకులు మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్ రావు పాల్గొన్నారు.

## కెటిఆర్ ఒక 'ట్విట్టర్ టిల్లు'..

### బూతులకు బ్రాండ్ అంబాసిడర్ మీ నాన్నే: ఎంపి చామల ఫైర్

**ప్రజాపక్షం/యాదాద్రి** : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా భువనగిరి లోక్సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా చేస్తున్న విమర్శలను 'చిల్లర మాటలు'గా అభివర్ణించిన ఆయన, కేటీఆర్ను 'ట్విట్టర్ టిల్లు' అంటూ ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై, కేసీఆర్ కుటుంబ వైఖరిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇస్తూ.. 'బూతు అనే పదానికి మీరే రాజులు. దేశంలో బూతులకు నాయకుడు ఎవరని గూగుల్లో వెతికితే మీ నాన్న కేసీఆర్ పేరే వస్తుంది. గతంలో కేసీఆర్ వాడిన భాష ఎలాంటిదో కేటీఆర్ ఒకసారి యూట్యూబ్లో చూసుకోవాలి' అని చామల హితవు పలికారు. రేవంత్ రెడ్డి భాష కేవలం అవతలి వ్యక్తుల ప్రవర్తనను బట్టే ఉంటుందని, ప్రజలకు అర్థమయ్యే రీతిలోనే సీఎం సమాధానం ఇస్తున్నారని సమర్థించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. 'వచ్చే వారం రోజుల్లో గల్లీల్లో బిఆర్ఎస్ 'దొంగల ముఠా' చేసే చిల్లర మాటలను నమ్మవద్దు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి' అని పిలుపునిచ్చారు. రెండేళ్లలోనే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని, ఐదేళ్ల తర్వాత ప్రజలే న్యాయ నిర్ణేతలని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మెరుగ్గా సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల హాస్టల్, పాఠశాల, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో వసతి, సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట శివారులోని తెలంగాణ రాష్ట్రం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్, పాఠశాల, కళాశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, లైబ్రరీ, ఇ క్లాస్ రూమ్, తరగతి గదులను కలియ తిరిగారు. కిచెన్ రూమ్‌లో విద్యార్థులకు వడ్డించుటకు తయారు చేసిన భోజనం, పప్పు, కూరలు, సాంబారును పరిశీలించారు. కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, తదితర నిత్యావసరాలను తనిఖీ చేసి తాజా కూరగాయలు, నాణ్యమైన వంట పదార్థాలను వంటల్లో వినియోగించాలన్నారు. వంట సామాన్లు, కూరగాయలు వెలుతురు తగిలే విధంగా పైన ్ధన మీద ఉంచుకోవాలన్నారు. డైనింగ్, వాష్ ఏరియా ఎప్పుడు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తదుపరి తరగతి గదులను పరిశీలించి ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హాస్టల్ భవనంలో ఏమైనా మైనర్ రిపేర్లు ఉన్నట్లయితే ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, ఇంటర్‌మీడియెట్ ప్రిన్సిపాల్‌లు నీలా, అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోమాతల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : దేవస్థానం పరిధిలోని గోశాలను ఇఒ జె.భవాని శంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోశాలలోని నిర్వహణ తీరును, గోవులకు అందుతున్న వసతులను ఆయన స్వయంగా పరిశీలించారు. ముందు గా గోశాలలో గోమాతలకు అందిస్తున్న దాణా ఫీడ్ మరియు గడ్డి నాణ్యతను ఈఓ పరిశీలించారు. పశుగ్రాసం నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ను తనిఖీ చేసి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, గోసేవను భక్తిభావంతో చేయాలని సిబ్బందికి సూచించారు. గోమాతలు , దూడల ఆరోగ్య స్థితిగతులపై ఆయన ప్రత్యేకంగా చర్చించారు. వెటర్నరీ డాక్టర్ ద్వారా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలి.వారానికి రెండు పర్యాయాలు తప్పనిసరిగా ఆరోగ్య తనిఖీలు చేపట్టి, నివేదికలు సిద్ధం చేయాలని పర్యవేక్షకులను , సహాయ కార్యనిర్వాహణాధికారిని ఆదేశించారు.ముంచుకొస్తున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎండ తీవ్రత నుండి గోవులను రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఈఓ ,స్పష్టం చేశారు. గోశాల ఆవరణలో చల్లదనం నెలకొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. వేసవి తాపం తగలకుండా ఫ్యాన్లు లేదా ఫాగర్స్ వంటి ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలి. కార్యనిర్వాహణాధికారి ఈ తనిఖీ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్ రెడ్డి, సహాయ కార్యనిర్వాహణాధికారి మహేష్ పాల్గొన్నారు.

## 12న దేశవ్యాప్త సమ్మె సక్సెస్ చేద్దాం

### ఐక్యకార్మిక సంఘాల పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ** : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకటరెడ్డి,ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్‌లు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని ఎఐటియుసి జిల్లా కార్యాల యంలో జరిగిన ఐక్య కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల పై పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు మొత్తం కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వర్గాలు కు లాభం చేకూర్చాలని 50 కోట్ల కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నారనీ ఆరోపించారు.కార్మికుల కుటుంబాలను వీధిపాలు చేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం బరితెగించి నూతనంగా నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. తక్షణమే లేబర్ కోడ్ లను రద్దుచేసి పాత చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య,ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు బొంగరాల నరసింహ,బిఆర్ఎస్ కెవి రాష్ట్ర నాయకులు చిలువేరు ప్రభాకర్,ఆర్ ఆచారి,ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి, ఎన్ వెంకటేశ్వర్లు, పాణెం వెంకట్ రావు,టీ దయాకర్,వి లెనిన్, కే యాదగిరి పాల్గొన్నారు.

## 'కంపరం' లేపుతున్న సంకినేని ఆరోపణలు



**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలైన అధికార, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్, బిజెపిలు తమ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకునేలా సర్వశక్తులు ఒడ్డుతున్నారు. సహజంగా ఆయా రాజకీయ పార్టీలు పాలక, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సహజమైన విషయమేననది అందరికి విధితమే. కానీ తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలపై తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. 26 నెలల కాంగ్రెస్ పాలనలో సూర్యాపేట నియోజక వర్గంలో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించారు. దాదాపు రూ. 100 కోట్ల అక్రమ ఆదాయం సంపాదించారని దోచుకోవడం దాచుకోవడమే వీరి నైజమని విమర్శించారు. విజ్ఞులైన సూర్యాపేట ప్రజలకు ఇదంతా తెలుసన్నారు. ఆఖరికి చైర్మన్ పీఠాన్ని ఓ వ్యక్తికి అప్పగిస్తామని చెప్పి కాంగ్రెస్‌లో ఇద్దరు వ్యక్తులు రూ.10కోట్ల విలువైన భూములను తమ పేరు మీద రాయించుకున్నారని తీవ్రమైన ఆరోపణ చేశారు. ఎన్నికల బరిలో తన సతీమణిని నిలబెట్టినా ఆ బడా కాంట్రాక్టర్ గత బిఆర్ఎస్ హయాంలో కోట్లాది రూపాయల పనుల పేరుతో మూసీ ఇసుకను అక్రమంగా హైదరాబాద్‌కు రవాణా చేసి కోట్లు గడించారని అలాంటి వ్యక్తి తన సతీమణి చైర్మన్ పీఠంపై ఎక్కితే సూర్యాపేట పరిస్థితి ఏమిటన్నది ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ పైన కూడా తీవ్ర విమర్శలు చేశారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణ చేశారు. కేంద్ర ప్రభుత్వం సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.500కోట్లను విడుదల చేస్తే 20శాతం కమీషన్ పేరుతో ఓ స్థానిక నేత రూ.100 కోట్లు నొక్కాడన్నారు. గత ఎన్నికల్లో జనరల్ స్థానమైన చైర్మన్ పీఠంలో దళిత మహిళను కూర్చోబెట్టి అభినవ అంబేడ్కర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన ఆమెను పక్కకు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడి ఏసిబికి పట్టుబడ్డ ఓ అధికారిని కమిషనర్‌గా తెచ్చి అభివృద్ధి పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నాడని అలాంటి బిఆర్ఎస్ తిరిగి చైర్మన్ పీఠం మీద కూర్చుంటే ఎలా ఉంటుందో ఒక్కసారి ప్రజలు గమనంలో ఉంచుకోవాలన్నారు. ఆయన ప్రసంగం సాగేంత వరకు అక్కడికి వచ్చిన ప్రజలు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వినడంతోపాటు చప్పట్లు, కేరింతలు కొడుతూ ఆయన ఆరోపణలకు బలం చేకూర్చేలా స్పందించడం గమనార్హం.

## సిపిఐ అభ్యర్థి మొగుళ్ళ స్వాతిని ఆదరించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మోత్కూర్** : కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని గెలిపించాలని మోత్కూర్ మున్సిపాలిటీ 5వ వార్డు బుజాలాపురం గ్రామంలో గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మొగుళ్ల స్వాతి శేఖర్ రెడ్డి గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మోత్కూరు మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 11 వార్డులకు కాంగ్రెస్ ఒక వార్డు సిపిఐ పొత్తులో భాగంగా పోటీ చేస్తున్నామని సిపిఐ వార్డులో కాంగ్రెస్ శ్రేణులు కమ్యూనిస్టు శ్రేణులు మిగతా చోట్ల కూడా కలసి ప్రచారం చేసి అభ్యర్థులను గెలిపించుకొని మోత్కూర్ మున్సిపాలిటి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజాపాలన అందిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నది అందుకని ప్రజలు గతంలో అప్పులపాలు చేసిన బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి చంద్రయ్య, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు పుష్పాక నరసింహ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్కర మల్లేష్, అభ్యర్థి ముగుళ్ల స్వాతి శేఖర్ రెడ్డి, శాఖ కార్యదర్శి ఛేతరాశి సత్తయ్య, సిపిఐ మండల నాయకులు తొంట తిరుపతయ్య, కొమ్ము రాములు, బోడ సోమనస్య పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily





## అమరచింతలో సిపిఐ విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/అమరచింత :** మున్సిపల్ ఎన్నికలలో నేపథ్యంలో అమర చింత పురపాలక లోని ఐదు వార్డులలో సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఈ ఎన్నికలలో పోటీలో ఉన్నారు. 2వ, వార్డులో కే భారతి, 4వ, వార్డులో ఏ. బాలేశ్వరి, 5వ వార్డులో ఎస్. స్వప్న, 6వ వార్డులో ఎరుకలి భీమన్న, 8వ వార్డులో కుతూబులు ఎన్నికల రంగంలో ఉండి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత మూడు రోజులుగా వార్డులలో నిలబడిన అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేస్తూ కంకి కొడవలి గుర్తుకే ఓటు వేయమని అభ్యర్థిస్తూ ఓటర్లను ఆకట్టుకొనుచున్నారు. ఎన్నికలలో సిపిఐ పార్టీ నుంచి నిలబడిన అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. గురువారం పట్టణంలోని నాల్గవ వార్డులలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయ రాములు, సిపిఐ నాయకులు ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల ఇంటింటి ప్రచారం చేస్తూ సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డులలో నిలబడిన అభ్యర్థులు, సిపిఐ జిల్లా, మండల నాయకులు శ్రీహరి, అబ్రహం, భాస్కర్, సీఎన్ శెట్టి, రవీందర్, శ్యాంసుందర్, శంకర్, ఎర్రన్న, సౌలు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు నిజాయితీగా పనిచేసే కమ్యూనిస్టుపార్టీ సిపిఐ అభ్యర్థులనుగెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటి పరిధిలోని 20వవార్డులో పోటిచేస్తున్న సిపిఐ అభ్యర్థి కపిలవాయి మానసగోపిచారిని గెలిపించాలని కోరుతూ సిపిఐ 20వవార్డులో ప్రచారం నిర్వహించింది. సమాజంలో పేరుకుపోయిన అవినీతి లంచగొండితనం స్వార్థం ఇవేమిలేకుండా ప్రజలందరికి సమన్యాయం చేయాలని కోరుకునే కమ్యూనిస్టులను గెలిపించడం ద్వారా మున్సిపాలిటిలో ప్రజలవాణి వినిపించే అవకాశం దక్కుతుందని ప్రజలు ఆలోచించి ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఈప్రచార కార్యక్రమంలో సిపిఐజిల్లా సమితి సభ్యులు శివశంకర్, పేరుమాలగోపాల్, తప్పెట కిరణ్‌కుమార్, సిపిఐపట్టణ కార్యదర్శి కపిలవాయి గోపిచారి, నాయకులు రాధాకృష్ణ, బాలపీరు, రవి, చంద్రకళ, సింగోటి వెంకటయ్య పాల్గొన్నారు.



## ప్రజల ప్రాణాలతో చెలగాటమా !

**జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్**

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** విధి నిర్వహణలో వైద్యులు నిర్లక్ష్యంచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించినవారిని సహించబోమని వైద్యవిధులకు రాజీనామాచేసి వెళ్లాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలపరిధిలోని వెన్నచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఓపినమోదు, ప్రసూతివిభాగం, మందుల పంపిణీకేంద్రం తదితర వాటిని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వైద్యులువారంలో నాలుగురోజులురావడం లేదని, రోగులకు వైద్యపరీక్షలు, సరైనవైద్యసేవలు అందించడంలేదని కలెక్టర్‌కు గ్రామప్రజలు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ స్పందించి విధులపట్ల నిర్లక్ష్యం వహించిన డాక్టర్ ప్రశాంతను విధులనుంచి తొలగించాలని ఫోన్‌ద్వారా డిఎంహెచ్ఓను ఆదేశించారు. గ్రామీణప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులపై విశ్వాసం పెంచుకునేలా మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బందిపై ఉందన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని పోల్కంపల్లి గ్రామానికిచెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు బత్తులపద్మయ్యయాదవ్ భార్య గత మూడురోజులక్రితం మరణించగా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం ఆకుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. పరామర్శించినవారిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు అల్వాల్ రెడ్డి, రంగాపూర్ సర్పంచ్ క్యామమల్లయ్య, సతీష్‌రెడ్డి, జంగయ్య, వెంకట్ నారాయణ ఉన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

**ప్రజాపక్షం/వంగూర్ :** తెలంగాణరాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్‌ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలపరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో సబ్సిడిద్వారా రైతులకు స్ప్రింక్లర్ పైపులను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల అభివృద్ధికోసం కాంగ్రెస్‌ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తుందని, ప్రతిరైతుకు అండగా ఉంటూ రైతు పండించిన ప్రతిగింజను కొనుగోలుచేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తుందని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రతిపేదవాడికి కాంగ్రెస్‌ప్రభుత్వం హయాంలో న్యాయం జరుగుతుందన్నారు. అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు తప్పక అందుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ ఖలీల్, వంగూరు సర్పంచ్ యాదయ్య, రంగాపూర్ సర్పంచ్ క్యామమల్లయ్య, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు అల్వాల్‌రెడ్డి, రమేష్ గౌడ్, మార్కెట్‌డైరెక్టర్ నారాయణరెడ్డి, హరీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైకిళ్లపైనే అభ్యర్థుల ప్రచారాలు

**నేనుకూడా సైకిల్‌పై ప్రచారం చేస్తా**
**మంత్రి జూపల్లికృష్ణారావు**

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ఆధునికయుగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు వ్యాయామంపై అవగాహన కల్పించడంకోసం అభ్యర్థులు మోటార్‌బైక్‌లను పక్కనపెట్టి సైకిళ్లపై ప్రచారంచేయడంతో మీ ఆరోగ్యం మెరుగుపడుతుందని, నేనుకూడా సైకిల్‌పైన ప్రచారం చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తెలంగాణరాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు,ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లికృష్ణారావు పిలుపునిచ్చారు. మున్సిపాలిటి ఎన్నికల నేపథ్యంలో కొల్లాపూర్ మున్సిపాలిటిపరిధిలో 16వవార్డు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పెబ్బేటిశేఖర్‌ను గెలిపించాలని గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపనులే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని అన్నారు. కొల్లాపూర్ పట్టణం అన్నిరంగాల్లో సమగ్రంగా ఇంకా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపాలిటి ఓటర్లను కోరారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు నిరంతరం కృషిచేయాలన్నారు.

### అశీర్వదించండి అభివృద్ధి చేస్తా : అనిత

**మక్తల్ :** స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆశీస్సులతో మక్తల్ పట్టణంలోని 8 వ వార్డ్ కౌన్సిలర్ గా బరిలో ఉన్న తనను కాలనీవాసులు అందరూ కలిసి ఈ ఎన్నికలలో ఆశీర్వదిస్తే 8వ వార్డుని అన్ని రంగాలలో పెద్దలు సహకారంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తానని కౌన్సిలర్ అభ్యర్థి అనిత జుట్ల అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 8వ వార్డులో తన మద్దతు దారులతో కలిసి ఇంటింటి





ప్రచారం చేపట్టారు. ప్రచారంలో అనిత జుట్ల కు విశేష స్పందన లభించింది. వార్డుని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి తమ అమూల్యమైన ఓటు ముద్ర హస్తం గుర్తుపై వేసి, వేయించి అఖండ విజయం చేకూర్చాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో దత్త ఆంజనేయులు, డాక్టర్ శంకర్, శ్యామ్, నరేందర్ , శ్రీనివాస్, చెన్నయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీని గెలిపించండి : శైవిరెడ్డి

మక్తల్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని 9వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శైవి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తన మద్దతు దారులతో కలిసి 9వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి షైవి రెడ్డి జోరుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాపక్షం విలేకరితో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఇంటింటి ప్రచారంలో ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. స్థానిక రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో 9వ వార్డులో రోడ్లు డ్రైనేజీలు వీధి లైట్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు.
అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామన్నారు. కాలనీ సమస్యలను పరిష్కారం చేసేందుకు ముందుంటానని అన్నారు. 11న జరగనున్న ఎన్నికల్లో అమూల్యమైన ఓటు హస్తం గుర్తుకు వేసి గెలిపించాల్సిందిగా కౌన్సిలర్ అభ్యర్థి శైవి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో అమరేందర్ రెడ్డి, డి,నరసింహ, తిప్పన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌పై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దేవరకద్ర మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్, మండల వ్యవసాయ సంఘంను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్, మండల వ్యవసాయ అధికారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో యూరియా విక్రయం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే జరుగుతుందని తెలిపారు. యూరియా కొనుగోలు చేయవలసిన రైతు గూగుల్ ప్లేస్టోర్ నుండి యూరియా బుకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మీ యొక్క మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయి, మీ యొక్క పట్టాదారు పాసు పుస్తకం ఎంటర్ చేసి వచ్చిన ఓటిపి ద్వారా ఈ సిజన్‌లో రైతులు వేయబోయే పంట వివరాలను నమోదు చేస్తే సీజన్‌కు సంబంధించిన యూరియా ఎలిజిబులిటీ రైతుకు చూపించడం జరుగుతుందని అన్నారు. తదనంతరం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ యాప్ ద్వారా మొదలు పెట్టిన రోజు నుంచి ఇప్పటివరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 63,430 మంది రైతులు 23,0471 యూరియా బస్తాలను బుక్ చేసుకుని కొనుగోలు చేయడం జరిగిందని వెల్లడించారు. అలాగే గురువారం నాటికి 11892 యూరియా బస్తాలు ఇంకను రైతులకు బుక్ చేసుకోవడానికి వీలుగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే ఆల విస్తృత ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కొత్తకోట బస్టాండు ప్రాంగణ మరమత్తు పనులు, 50 పడకల ఆసుపత్రి, మార్కెట్ పనులకు శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ కొత్త జీవో గాని పనులు గాని చేయలేదన్నారు. పాత పనులకి రిబ్బన్ కటింగ్ చేస్తున్నారని విమర్శించారు. అదే విధంగా వృద్ధులకు పాత పెన్షన్లు అమలులో ఉన్నట్లు కాంగ్రెస్ ఇచ్చిన అమలు గాని హామీలు, గ్యారెంటీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందన్నారు.

### పెబ్బేరు మున్సిపాలిటీలో జోరందుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పెబ్బేరు మున్సిపాలిటీ లో ప్రచారం నిర్వహించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జల్లెల చిన్నారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిందని పట్టణాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీబీసీసీ ఓబీసీసీ లు ఉపాధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మాజీ ఎంపిటిసి మన్యం తోమలపల్లి కృపాకర్ రెడ్డి, పాతపల్లి చంద్రశేఖర్, మహేశ్వర్ రెడ్డి, రాంపురం ఈశ్వర్ రెడ్డి, గంధం సునీల్ తదితరులు పాల్గొన్నారు.
5 వనపర్తి 8ఎ

### సమ్మెకు మద్దతుగా పంచాయితీ కార్మికుల నోటీసులు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేస్తూ, ఈ నెల 12 న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రగతిశీల గ్రామపంచాయితీ కార్మికులు తాహసీల్దార్, ఎంపీడీవో , పంచాయితీ కార్యదర్శులకు సమ్మె నోటీసులు అందజేశారు. పేదల పనికి గ్యారెంటీ కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం చట్టాన్ని కొనసాగించాలని, కాంట్రాక్టు కార్మికులు, స్కీం కార్మికులతో సహా అందరికి కనీస వేతనం నెలకు రూ.26000 లు నిర్ణయించాలని వారు డిమాండు చేశారు. పంచాయితీ కార్మికులు వెంకటయ్య, మహేష్, రాములు, గంగయ్య, శ్యామలమ్మ ఉన్నారు.

## బ్యాలెట్ ముద్రణలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి**
**ఆదర్శ్ సురభి**

**ప్రజాపక్షం/వనపర్తి :** బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ విషయంలో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్లో మున్సిపల్ కమిషనర్లు, తాహసిల్దార్లు ఎంపీడీవోలతో బ్యాలెట్ పేపర్ల ముద్రణ విషయంలో టెలికాన్ఫరెన్సు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల వారిగా పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తుల వారిగా జాగ్రత్తగా చూసుకోవాలని, బ్యాలెట్ పేపర్ క్రమ సంఖ్య, నాణ్యత తదితర అన్ని అంశాలు జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్లో మున్సిపల్ కమిషనర్లు, తాహసిల్దార్లు ఎంపీడీవోలతో బ్యాలెట్ పేపర్ల ముద్రణ విషయంలో టెలికాన్ఫరెన్సు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల వారిగా పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తుల వారిగా జాగ్రత్తగా చూసుకోవాలని, బ్యాలెట్ పేపర్ క్రమసంఖ్య నాణ్యత తదితర అన్ని అంశాలు జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. పోలీంగ్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు. శుక్రవారం అన్ని మున్సిపాలిటీల పరిధిలో రెండవ దఫా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణ సందర్భంగా శుక్రవారం సాయంత్రం వరకు పోలింగు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఒకరోజు శిక్షణ కార్యక్రమం అన్ని వసతులతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఫిబ్రవరి 8వ తేది లోపు ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి. ఓటర్లందరికి బిఎల్ఓలు, వార్డు ఆఫీసర్ల ద్వారా ఓటరు స్లిప్పులు అందజేయాలని పంపిణీ ప్రక్రియ ఫిబ్రవరి 8లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు వాహనాల అనుమతి మున్సిపల్ కమిషనర్ల ద్వారా జరిగాలని, అదే విధంగా పార్టీ సమావేశాలు, ర్యాలీలకు పోలీసు అధికారుల నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు టెలికాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

## రైతుల భూమికి హద్దులతో భూఆధార్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** భూములకు ఆధునిక సాంకేతికతో కచ్చితమైన హద్దులు, నిర్దిష్టమైన కొలతలు నిర్ణయించి రైతులకు భూ ఆధార్ ఇచ్చేందుకు ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఇప్పటివరకు గ్రామ పటాలు లేని సమస్యాత్మక గ్రామాలను గుర్తించి రీ సర్వే చేయాల్సి ఉంటుందని, ఆధునిక సాంకేతిక పరికరాలతో భూమి సరిహద్దులు, కమతాలకు నిర్దష్టమైన కొలతలు నిర్దేశించడం జరుగుతుందని ఆమె తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లాలో గుర్తించి మూడు గ్రామాలలో రీ సర్వేకు సంబంధించి ఎడి సర్వే ల్యాండ్, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలు పెరగడంతో రైతుల భూములకు నిర్దష్టమైన కొలతలు చేసి భూ ఆధార్ ఇవ్వడం వల్ల వాటిక్ చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం ఈ భూముల రీ సర్వేను



ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. రీ సర్వేలో భాగంగా జిల్లాలోని నారాయణపేట్ మండలం శేర్నపల్లి, నర్వ మండలంలోని జంగం రెడ్డి పల్లి, కొత్తపల్లి గ్రామాలను ఎంపిక చేసిందని చెప్పారు. శుక్రవారం నుంచి ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, సర్వే ల్యాండ్, ఏ.డీ వేణు గోపాల్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, నారాయణపేటట్ తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

**బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి**
**బాసు హనుమంతు నాయుడు**

**ప్రజాపక్షం/గద్వాల్ :** గద్వాల జిల్లా కేంద్రం లోని మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 14,15వ వార్డు గంజిపేట కాలనీలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు 14వ వార్డు గంజిపేట రాజు, 15వ వార్డు మౌలాబి మద్దతుగా బాసు హనుమంతు నాయుడు ఇంటింటికీ తిరిగి బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి వేయించి, భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జి.రాఘవేంద్ర రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, బీచుపల్లి, చక్రధర్ రావు, అంగడి బసవరాజ్, రాజారెడ్డి, సూర్య గౌడ్, మస్తాన్, వెంకటేష్ నాయుడు, చక్రీధర్ రెడ్డి, భరత్ సింహారెడ్డి, మహబూబ్‌నగర్, ఎండ. మాజ్, ఇర్ఫాన్, తిమ్మన్న, ఖాజా హుస్సేన్, షబీర్, శేషన్న, నరసింహులు, ప్రవీణ్ ఉన్నారు.

## 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** పదవతరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ పదవతరగతి ఎస్సి సంక్షేమ వసతి గృహ విద్యార్థిని, విద్యార్థులకు, గురువారం అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన వార్షిక పరీక్షలపై ప్రేరణ, అవగాహన తరగతుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ వారు పరీక్షలకు ఏ విధంగా సిద్ధమవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు అనగానే భయం ఉంటుందని, మీకు కూడా భయం, ఒత్తిడి ఉందా? అని అడిగారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసంతో ప్రణాళికబద్ధంగా చదివితే ఎస్ఎస్‌సి పరీక్షలను సులభంగా పాస్ అవుతారని తెలిపారు. విద్యార్థులు కేవలం ఉత్తీర్ణతకే కాకుండా అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంగా కష్టపడి చదవాలని సూచించారు. ఈ కీలక సమయంలో విద్యార్థిని , విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునీత, సహాయ సాంఘీక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం, వార్డుల అభివృద్ధి జరుగుతుందని కొల్లాపూర్ మున్సిపాలిటి 13వవార్డులో కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వంగ అనూషరాజశేఖర్‌గౌడ్ అన్నారు. 13వ వార్డులో మండలకాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మేకలచంద్రయ్యయాదవ్, మాజీ సింగిల్‌విండోచైర్మన్ దేవరపాకబాలస్వామి ,మాజీసర్పంచ్‌లు రాంలాల్‌నాయక్, అరవింద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బాలస్వామి, చంద్రయ్య మాట్లాడుతూ వార్డుల అభివృద్ధి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని మంత్రి జూపల్లికృష్ణారావు నాయకత్వంలో వార్డులో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తూ హస్తంగుర్తుపై ఓటువేయించి మీ ఇంటి బిడ్డను గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు.

# రూ.8.40 కోట్లతో గ్రామ మహిళా సంఘాలకు భవనాలు

**ఆరు మండలాల్లో 84 భవనాల మంజూరు**
**ఊర్కొండకు 16, మిడ్జిల్ కు 5**
**రాజాపూర్‌కు 8, బాలానగర్‌కు 17,**
**జడ్చర్లకు 14 నవాబుపేటకు 24 భవనాలు**
**భవనాల నిర్మాణంతో**
**మహిళాభివృద్ధికి చేయూత**
**ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెల్లడి**

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా సంఘాలకు చెందిన 84 గ్రామైక్య సంఘాల (వీఓలు) కు రూ.8.40 కోట్ల వ్యయంతో సొంత భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. మహిళా సాధికారత సాధనలో కీలకంగా నిలుస్తున్న గ్రామ మహిళా సంఘాలకు సొంత భవనాల నిర్మాణంతో మహిళలు మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.
జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఈ భవనాల నిర్మాణం మంజూరైయిందని గురువారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక్కొక్కటి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే వీఓ భవనాల్లో ఊర్కొండ మండలానికి 16, మిడ్జిల్ మండలానికి 5, రాజాపూర్ మండలానికి 8, బాలానగర్ మండలానికి 17, జడ్చర్ల మండలానికి 14, నవాబుపేట మండలానికి 24 చొప్పున మంజూరు అయ్యాయని చెప్పారు. ఊర్కొండ మండలంలోని బొమ్మరాసుపల్లి, గుడిగానిపల్లి, గండ్లగుంటపల్లి, ఇప్పలపాడు, జగబోయినపల్లి, జకినాలపల్లి, లోక్యాతాండా, మాచారంపల్లి, మాదారం, నర్సంపల్లి, రాచాలపల్లి, రన్‌రెడ్డిపల్లి, రేవల్లి, తిమ్మన్‌పల్లి, ఊర్కొండ, ఊర్కొండపేట, మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి, ఈదులబాయి తాండ, బోయిన్‌పల్లి, వేముల, మిడ్జిల్ గ్రామాల్లో విఓ భవనాలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే బాలానగర్ మండలంలోని హేమాజీపూర్, గాంధీపాలెం, గంగాధరపల్లి, మోతీఘనపూర్, నేరెళ్లపల్లి, కేతిరెడ్డిపల్లి, గాలిగూడ, చింతకుంట తాండ, పెద్దాయిపల్లి, మాచారం, మోదంపల్లి, వీరన్నపల్లి, సూరారం, గుండేడ్ గౌతాపూర్, ఉడిత్యాల, చిన్నరేవల్లి గ్రామాల్లో విఓ భవనాలు మంజూరయ్యాయని చెప్పారు.
ప్రస్తుతం నియోజకవర్గంలో 84 విఓ భవనాలను రూ.8.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారని తెలిపారు. ఈ భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

భూమిక ప్రధాన పాత్రలో సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మాతలుగా సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

# స్వశక్తితో ఎదగాలని కోరుకుంటున్నా..

డైరెక్టర్ బాబీ కొల్లి



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న సినిమా. 'మా రెమ్మ. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆరట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిం ది. తాజాగా టీజర్‌ను లాంచ్ చేశారు. ఒక అంటువ్యాధి గ్రామాన్ని చు ట్టుముట్టి, ప్రజలు, పశువుల ప్రాణాలను బలిగొంటుంది. గ్రామస్తులు తమ గ్రామ దేవత మారెమ్మ తల్లిని ప్రార్థిస్తారు. ఆ దేవతకు సంబంధించిన పవిత్ర ఎద్దును కాపాడే బాధ్యత హీరోది. అయితే ఒక రోజు ఆ ఎద్దు అనూహ్యంగా అదృశ్యమవుతుంది. ఇక్కడినుంచే కథ కీలక మలుపులు తిరుగుతుంది. ఇది మాధవ్‌కు తొలి చిత్రమైనప్పటికీ, అతను ప్రస్తుత ప్రేక్షకుల అభిరుచులకు అ నుగుణంగా ఉండే కథను ఎంచుకున్నాడు. పూర్తిగా రూరల్ లుక్‌లో కనిపించిన మాధవ్, తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్నాడు. అతనికి జోడీగా దీపా బా లు నటించగా, గ్రామ పెద్ద పాత్రలో సీనియర్ నటుడు వినోద్ కుమార్ బల మైన ముద్ర వేశారు. తన తొలి ప్రయత్నంలోనే దర్శకుడు మంచర్ల నాగరాజు తెలంగాణలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా గ్రామీణ నేపథ్యంలో అద్భుతమైన కథను సిద్ధం చేశారు. సినిమాటోగ్రాఫర్ ప్రశాంత్ అంకిరెడ్డి గ్రామీణ వాతావరణాన్ని అద్భుతంగా చూపించారు. సంగీత దర్శకుడు ప్రశాంత్ ఆర్ విహారి పవర్ ఫుల్ నేపథ్య సంగీతంతో ఉత్కంఠను పెంచారు. దేవ్ రాథోడ్ ఎడిటర్, రాజ్‌కుమార్ మురుగేశన్ ఆర్ట్ డైరెక్టర్.మొత్తం మీద ఈ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. 'మారెమ్మ' చిత్రం త్వ రలోనే థియేటర్లలో విడుదల కానుంది.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాబి కొల్లి మాట్లాడుతూ రవితేజతో జర్నీ చేస్తున్నప్పుడు మాధవ్‌ని చూస్తూ ఉండేవాణ్ణి. రవితేజ ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా వచ్చారు. అలాగే మాధవ్ కూడా తన కాళ్ళ మీద తనే నిలబడాలని ఆయన కోరుకుంటున్నారు. ఈ టీజర్‌లో మ్యూజిక్ నాకు చాలా నచ్చింది. హీరో మాధవ్ మాట్లాడుతూ లాస్ట్ ఇయర్ ఇదేటైంకి షూటింగ్ మొదలుపెట్టాం.ఇప్పుడు టీజర్‌తో మీ ముందుకు రావడం చాలా హ్యాపీగా ఉంది. నాగరాజు టీజర్‌ని అద్భుతంగా చూపించారు. ఈ స్క్రిప్ట్ రావడం లక్కీగా ఫీల్ అవుతున్నాను. విజువల్స్ చాలా అద్భుతంగా వచ్చాయి. హీరోయిన్ దీపా మాట్లాడుతూ నేను తమిళ అమ్మాయిని. ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాను. ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఇందులో ఉండే ప్రతి క్యారెక్టర్ కనెక్ట్ అవుతుంది. కో ప్రొడ్యూసర్ కుశాల్ రెడ్డి మాట్లాడుతూ మేమందరం కొత్తవాళ్లైనప్పటికీ ఒక అద్భుతమైన టీంతో వర్క్ చేశాం.దర్శకుడు నాగరాజుకి అభినందిస్తున్నాను. ఈ సినిమాలో వికాస్ వశిష్ట , వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయా నంద్ రెడ్డి,రూపా లక్ష్మి తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఉమేష్ విలాసాగరం, డిపిఒ ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం ప్రశాంత్ ఆర్ విహారి,ఎడిటర్ దేవ్ రాథోడ్ఆర్ట్ డైరెక్టర్: రాజ్ కుమార్ మురుగేషన్, యాక్షన్ డైరెక్టర్: నటరాజ్, కొరి యోగ్రాఫర్ సాగ్గీ సాగర్,సాహిత్యం మిట్టపల్లి సురేందర్, కమల్ ఎస్లావత్.

# 'సుమతీ శతకం' విడుదలకు సిద్ధం

'ప్రెస్‌మీట్'లో హీరో అమర్‌దీప్ చౌదరి



విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిన 'సుమతీ శతకం' విడుదలకు సిద్ధమైంది. సాయి సుధాకర్ కొమ్మలపాటి నిర్మాణంలో, ఎం.ఎం. నాయుడు దర్శకత్వంలో తెరకెక్కించారు. అమర్‌దీప్‌చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ హీరో అమర్‌దీప్ చౌదరి మాట్లాడుతూ 'ఒక సామాన్య స్థాయి నుండి మొదలై ఎన్నో సంవత్సరాలు కష్ట పడి ఈరోజు ఇక్కడ వరకు వచ్చాను. సుమతీ శతకం ద్వారా మీ ముందుకు వచ్చాను. ఒక్క ఛాన్స్, ఒకే ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడండి. నన్ను నేను నిరూపించుకుంటాను. నాకు ఈ సినిమాతోనే మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను. కన్నడలో కెవిఎన్, తమిళ్ లో జికె డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు 'అని చెప్పారు.హీరోయిన్ శైలి చౌదరి మాట్లాడుతూ ఈ సినిమాలో నటించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.ఈ ప్రెస్ మీట్‌లో దర్శకుడు ఎం.ఎం. నాయుడు, నిర్మాత కొమ్మలపాటి సాయిసుధాకర్, నటి శైలజ, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, నటుడు తేజ, పాల్గొన్నారు.

# 'బుల్లెట్ సునీల్'గా రాజశేఖర్



హీరోగా పలు సినిమాలతో జనాన్ని అలరించిన రాజశేఖర్ ఇప్పుడు కొన్ని సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తున్నాడు. అంకుశం వంటి సినిమాలతో టాప్ స్టార్‌గా ఎదిగిన రాజశేఖర్ చాలా కాలంగా ఆయన హీరోగా నటించిన సినిమాలు పెద్దగా ఆడకపోవడంతో ఇప్పుడు క్యారెక్టర్స్ చేసేందుకు సిద్ధమైయ్యారు. ఈ క్రమంలో శర్వానంద్ హీరోగా బైకర్ సినిమాలో రాజశేఖర్ కీలకపాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో బులెట్ సునీల్ గా రాజశేఖర్ కనిపిస్తారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి రాజశేఖర్ పాత్ర బుల్లెట్ సునీల్‌ను పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రిలీజ్ చేశారు.గ్లింప్స్ పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది. మాజీ మోటోక్రాస్ రేసర్ సునీల్ – 'బుల్లెట్ సునీల్'గా పాపులర్. 18 ఇండియన్ ఛాంపియన్‌షిప్స్, 57 సౌత్ జోన్ టైటిల్స్, 100కుపైగా రేస్ విజయాలతో అద్భుతమైన ట్రాక్ రికార్డ్ తనది. అయినా అతడి ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. ఇండియన్ రేసర్లు ఓడిపోయేవాళ్లే అన్న భావన అతడిని కలచివేస్తుంది. ఆ అభిప్రాయాన్ని చెరిపేసి, రేసింగ్ సర్క్యూట్‌లో భారతదేశానికి ఉన్న నిజమైన శక్తిని ప్రపంచానికి నిరూపించాలని నిశ్చయించుకుంటాడు.గత విజయాలు గురించి ఆలోచించకుండా, సునీల్ తన అనుభవాన్ని మళ్ళీ పోరాటంలోకి మళ్లిస్తాడు. ఆ పాత్రకు రాజశేఖర్ ఇచ్చిన ఇంటెన్సిటీ, తపన, ఎమోషనల్ డెప్త్ ఆ ప్రయాణాన్ని మరింత ప్రభావవంతంగా నిలబెట్టాయి.ఈ సినిమాలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది.ఈ చిత్రం ఏప్రిల్ 3న థియేట్రికల్ రిలీజ్ కానుంది. సినిమాటోగ్రఫీ: జె. యువరాజ్, సంగీతం: గిబ్రాన్, ఎడిటింగ్: అనిల్ కుమార్ పి, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడక్షన్: ఎన్. సందీప్, ఆర్ట్ డైరెక్టర్ ఎ. పన్నీర్ సెల్వం పని చేస్తున్నారు.బ్రహ్మాజీతో పాటు బాలివుడ్ నటుడు అతుల్ కులకర్ణి కీలకపాత్రల్లో నటించారు.

# ఇలాంటి కాన్సెప్ట్ ఇప్పటివరకూ రాలేదు



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓ వీ ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడుడైరెక్టర్ కరుణ కుమార్ మీడియాతో మాట్లాడారు. సాహిత్యం కోసం చీకటి అనే కథ రాశాను. దాన్ని సినిమా తీద్దామని మా నిర్మాతలు వచ్చారు. హనీ సినిమాలో పిల్లి మాయ అనే ఒక వస్తువుని శోధించి సాధించే ఒక వ్యక్తి జీవితం చూపించాం. మెదడు అంతా చీకటి ఉన్నా మనసుల మధ్య జరిగిన ఒక కథ. నిజ జీవిత సంఘటన నుంచి స్ఫూర్తిగా తీసుకుని సినిమా చేయడం జరిగింది. మనిషి మెదడు కంటే పెద్ద దయ్యం లేదనేది ఈ సినిమా సారాంశం. కొత్త కథలు చేయడానికి ఎప్పుడూ ముందుండే నవీన్ చంద్ర ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. ఇందులో ఎప్పుడు చూడని నవీన్ చంద్రని చూడబోతున్నారు. అలాగే రాజా రవీందర్ పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. అలాగే దివి, దివ్య అందరు కూడా ఒకరికి మించి ఒకరు చేశారు. ఇలాంటి కాన్సెప్టు ఇప్పటివరకు ఇండియన్ సినిమాలో రాలేదు. ఫిబ్రవరి 6వ తేదీన సినిమా విడుదలవుతుందన్నారు. గతంలో నేను చేసిన పలాస సినిమా సూపర్ డూపర్ హిట్ అయింది. నేను తీసిన ఒక్కో సినిమా ఒక్కో వైవిధ్యమైన కథతో తీస్తున్నాను. పలాస ఒక గ్రామంలో జరిగే కథ అయితే, మట్కా మరో కొత్త రకం కథ. ఇప్పుడు హాని సినిమా కూడా కొత్తరకమైన కథ, కథనంతోనే తెరకెక్కించాను. దివి చాలా అద్భుతమైన నటి. తను తప్పకుండా పెద్ద స్టార్ అవుతుంది. దివ్య కూడా చాలా చక్కగా నటించింది. ఇది ఆలోచన రేకెత్తించే సినిమా. డివోపి మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. ఇందులో ఉన్న పాప కూడా చాలా చక్కగా నటించింది. ఈ కథ చెప్పినప్పుడు నవీన్ చంద్ర ఒప్పుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. తప్పకుండ ప్రతి పేక్షకున్ని ఈ సినిమా అలరిస్తుంది. ఆలోచింపజేస్తుంది.

# సైన్స్ ఫిక్షన్ మూవీ 'కిల్లర్'



జ్యోతి,పూర్వాజ్, లీడ్‌రోల్స్ లో నటిస్తున్న సినిమా 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను థింక్ సినిమా, ఏయూ అండ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి విలన్ క్యారెక్టర్ లో టాలెంటెడ్ యాక్టర్ మనీష్ గిలాడను పరిచయం చేశారు. ప్రతినాయకుడిగా మనీష్ గిలాడ పవర్ ఫుల్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు.ఈ చిత్రానికి డిఒపి జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ ఆశీర్వాద్, సుమన్ జీవ, చీఫ్ ఎడిటర్ బి.మనోజ్ కుమార్,ఆర్ట్ డైరెక్షన్ మణి, యాక్షన్ కొరియోగ్రఫీ రాజ్ కుమార్ గంగపుత్ర, లైన్ ప్రొడ్యూసర్స్ దశరథ మాధవ్, సీతారామారావు,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డిఎస్ బాష.

# 13కు మారిన 'స్కై' విడుదల




స్కై అనే సినిమా విడుదల వాయిదా పడింది. ఈ సినిమాను ఈనెల 6వ తేదీన విడుదల చేస్తున్నట్టు ముందుగా ప్రకటించారు. కానీ కొన్ని ఆర్థిక పరమైన సమస్యల వల్ల విడుదల వాయిదా పడినట్టు పరిశ్రమలో చర్చ జరుగుతోంది. 6వ తేదీన విడుదల కావలసిన ఈ సినిమాను ఎట్టకేలకు 13వ తేదీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. 'స్కై' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్‌థియేట్రికల్ రిలీజ్ కు రావాల్సిఉండగా వాయిదా పడింది. అనివార్య కారణాలతో వాయిదా పడిన ఈ సినిమాను ఈ నెల 13న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ భారతి, రాకేశ్ మాస్టర్, ఎంఎస్, కెవిఎల్ కెమణి బమ్మ, తదితరులు నటించారు. ఈ చిత్రానికి డిఒపి రసూల్ ఎల్లోర్, ఎడిటర్ సురేష్ ఆర్స్, డైలాగ్స్ , స్టోరీ పృథ్వీ పెరిచెర్ల, మురళీ కృష్ణంరాజు, మ్యూజిక్ శివ ప్రసాద్, పాటలు పృథ్వీ పెరిచెర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ స్వాతి పెన్మెత్స, లిఖిత గుంటక.

# కూలీలు మృతి (మొదటి పేజీ తరువాయి)

స్థలికి హుటాహుటిన చేరుకున్న సహాయక బృందాలు సెర్చ్ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారని ఆమె తెలిపారు. ఈ భారీ పేలుడు ప్రమాద ఘటన థాంగ్స్కు ఏరియాలో జరిగిందని డిజిపి వెల్లడించారు.ఇప్పటివరకు 16మంది మృతదేహాలను కనుగొన్నామని, బొగ్గుగనిలో సంభవించిన భారీ పేలుడు సమయంలో ఎంతమంది కూలీలు చిక్కుకుపోయి ఉంటారనే ఖచ్చితమైన సమాచారం ఇప్పటి వరకు తెలియలేదన్నారు. అయితే ఎక్కువమంది కూలీలు చిక్కుకుపోయి ఉంటారన్న భయాందోళనను ఆమె వ్యక్తంచేశారు. పేలుడులో ఒక వ్యక్తి తీవ్రగాయాలతో ఉన్నది గమనించి వెంటనే అతడిని సుత్నుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స జరిపించిన వెంటనే మెరుగైన చికిత్స కోసం షిల్లాంగ్‌లోని హాస్పిటల్‌కు తరలించడం జరిగిందని ఈస్ట్ జైంతియా హిల్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికాష్ కుమార్ చెప్పారు. ఈ పేలుడు అక్రమ బొగ్గుగని తవ్వకాలు జరుపుతున్న స్థలంలో సంభవించిందని అనుమానిస్తున్నామని, అయితే అది అక్రమ మైనింగ్ అయి ఉంటుందని విశ్వసిస్తున్నామని వికాష్‌కుమార్ తెలిపారు. ఆ గని అక్రమంగా నిర్వహిస్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 'అవును.. అది అలాగే కనిపిస్తోంది' అని ఎస్‌పి కుమార్ చెప్పారు. కారణం ఏమిటన్నది ఇప్పటివరకూ నిర్ధారణ కాలేదని, అయితే ఈ భారీ పేలుడు ఘటనపై విచారణ జరుగుతోందని వివరించారు. పర్యావరణ న ష్టం, భద్రతా ప్రమాదాలను పేర్కొంటూ మేఘాలయలో రాట్‌హోల్ కోల్ మైనింగ్ ఇతర అశాస్త్రీయ మైనింగ్ పద్ధతులపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) 2014లో నిషేధం విధించింది. అదే సమయంలో అటువంటి పద్ధతుల ద్వారా సేకరించిన బొగ్గు అక్రమ రవాణాను కూడా పరిమితం చేసింది. రాట్‌హోల్ మైనింగ్‌లో భాగంగా కార్మికులు సాధారణంగా 3 సుంచి 4 ఫీట్ల ఎత్తులో ఉన్నటువంటి ఇరుకైన టన్నెల్స్‌లోకి ప్రవేశించి తవ్వకాలు జరుపుతారు. క్షితిజ సమాంతర (హారిజంటల్) టన్నెల్స్‌ను తరచుగా 'రాట్‌హోల్స్' టన్నెల్స్ అని పిలుస్తుంటారు. ప్రతీ ఒక్కటి ఒక వ్యక్తికి మాత్రమే సరిపోతుంది. 2014 తర్వాత సుప్రీంకోర్టు ఆ నిషేధాన్ని సమర్థించింది. శాస్త్రీయ , పర్యావరణ రక్షణలతో కూడిన పద్ధతుల ద్వారానే మైనింగ్‌కు అనుమతించింది.

# మా దృష్టికి తేండి (మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయడానికి అత్యున్నత న్యాయస్థానం 4 వారాల సమయం ఇచ్చింది. ప్రకాశ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డిజిపి నియామకానికి ప్రతిపాదనలు పంపడానికి అనేక రాష్ట్రాలు, యుపిఎస్‌సి తీవ్ర జాప్యం చేస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ద్విసభ్య ధర్మాసనం పూర్తిగా సమర్థించింది. పోలీస్ సంస్కరణలకు సంబంధించిన ప్రకాశ్ సింగ్ కేసులో యుపిఎస్‌సి ఎంప్యానెల్ చేయబడిన ముగ్గురు సీనియర్ మోస్ట్ ఐపిఎస్ ఆఫీసర్స్ నుండి డిజిపిల ఎంపికను తప్పనిసరిచేస్తూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను నిర్దేశించింది. వారికి రెండు సంవత్సరాల స్థిర పదవీకాలాన్ని నిర్దేశించింది. డిజిపి ఎంపికను నిర్ధారించే విషయంలో మెరిటోరియస్, సీనియర్ అధికారులు జాప్యం చేస్తున్నారని యుపిఎస్‌సి ధర్మాసనానికి విన్నవించింది. అనేక రాష్ట్రాలు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను పూర్తిగా పెడచెవినపెట్టి డిజిపి నియామక ప్రతిపాదనను జాప్యం చేస్తూనే ఉన్నాయని రెగ్యులర్ నియామకానికి బదులుగా యాక్టింగ్ డిజిపిని నియమించడం ద్వారా తాత్కాలిక ఏర్పాటును చేసుకునేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నాయని యుపిఎస్‌సి వివరించింది. ప్రకాశ్‌సింగ్ కేసులో జారీచేసిన ఆదేశాలను ధిక్కరించకుండా చూసుకోవడానికి డిజిపి నియామకానికి సకాలంలో ప్రతిపాదనలు పంపించాలని యుపిఎస్‌సి రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాయడానికి తాము అధికారం ఇస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ధర్మాసనం తెలిపింది. రాష్ట్రాలు సకాలంలో ప్రతిపాదనను సమర్పించని పక్షంలో ప్రకాశ్ సింగ్ కేసులో దరఖాస్తును దాఖలు చేయాలని సుప్రీంకోర్టు యుపిఎస్‌సిని ఆదేశించింది.తెలంగాణ హైకోర్టు జనవరి 9న ఇచ్చి ఆదేశాలను సవాల్‌చేస్తూ యుపిఎస్‌సి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రం ప్రారంభించిన ప్రక్రియను కొనసాగించడం ద్వారా తెలంగాణ డిజిపి ఎంపిక ప్రక్రియ మొత్తాన్ని 4 వారాలలోపు పూర్తి చేయాలని హైకోర్టు కమిషన్‌ను కోరింది. ప్రకాశ్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువులోపు ప్రతిపాదనను సమర్పించకపోవడంలో తెలంగాణ రాష్ట్రం వైపునుండి తీవ్రమైన లోపం ఉందని సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా యుపిఎస్‌సి న్యాయవాది ఆరోపించారు. తెలంగాణలో చివరి రెగ్యులర్ డిజిపిని 2015లో నియమించారని, ఆ అధికారి 2017లో పదవీవిరమణ చేశారని యుపిఎస్‌సి సుప్రీంకోర్టుకు తెలిపింది. యుపిఎస్‌సి వీలైనంత త్వరగా ఎంప్యానల్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి, తెలంగాణ రాష్ట్రానికి డిజిపి నియామకం కోసం సిఫార్సు చేయాలని మేము ఎలాంటి సందేహం లేకుండా భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. ఇది చేయడానికి అత్యున్నత న్యాయస్థానం యుపిఎస్‌సికి అవసరమైన మరో 4 వారాల సమయాన్ని మంజూరు చేసింది.

# నివారణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్యావేత్తలు, దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ భద్రతా నిపుణులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణ, దర్యాప్తు, బాధితులకు మద్దతు విషయంలో తెలంగాణ సాధిస్తున్న నాయకత్వానికి ప్రతీకగా 'షీల్డ్2026' నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ, పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల మధ్య సమన్వయానికి ఈ కాంక్లేవ్ జాతీయ వేదికగా మారిందన్నారు. ఈ సందర్భంగా సిఎస్ కె. రామకృష్ణారావు మాట్లాడుతూ పాలన, ప్రజా సేవలు, కీలక మౌలిక సదుపాయాలపై పెరుగుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవాలంటే బలమైన, విధానపరమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. పరిపాలనలో అన్ని స్థాయిల్లో సైబర్ భద్రతను అంతర్భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అధునాతన దర్యాప్తు సాంకేతికతలు, ప్రత్యేక శిక్షణ, అంతరశాఖల సహకారం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిజిసిఎస్‌బి అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత బహుభాషా సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ 1930 సారథి, సహాయక వ్యవస్థ, వేగవంతమైన, ఏకీకృత సైబర్ నేరాల దర్యాప్తుకు రూపొందించిన ప్లాట్‌ఫారమ్ సెంటినెల్(సిసిఐటి)తో పాటు పిల్లలపై లైంగిక వేధింపుల (సిఎస్ఇఎఎమ్) డిజిటల్ సాక్ష్యాలను ఆటోమేటెడ్‌గా ప్రాసెస్ చేసే ఏఐ వ్యవస్థ సిసైట్ వంటి కీలక డిజిటల్ కార్యక్రమాలను సిఎస్ ఆవిష్కరించారు.

### చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఫలితాలు..

'షీల్డ్ 2025'లో ప్రారంభించిన చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సిపియు) ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించామని అధికారులు తెలిపారు. సిపియు ఏర్పాటుకు ముందు 37 కేసులు మాత్రమే నమోదు కాగా, ఏర్పాటు తర్వాత 1.20 లక్షలకు పైగా టిప్ లైన్లను ప్రాసెస్ చేసి, 866 కేసులు నమోదు చేసి, 421 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కాంక్లేవ్‌లో ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఎక్స్‌పీరియన్స్ జోన్ (టిఇజెడ్) ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రోబోటిక్ డాగ్స్, హ్యూమనాయిడ్ రోబోలు, డ్రోన్‌కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ, ఫ్లైట్ సిమ్యులేటర్లు, ఏఐ ఆధారిత భద్రతా పరిష్కారాలను ప్రదర్శించారు. 'షీల్డ్2026'లో భాగంగా జాతీయ సైబర్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 'సైఫర్ స్ప్రింట్'ను నిర్వహించారు. దేశవ్యాప్తంగా 500కు పైగా బృందాలు పాల్గొనగా, 17 ఫైనలిస్ట్ జట్లు వాస్తవ సైబర్ సవాళ్లకు పరిష్కారాలను ప్రదర్శించాయని పేర్కొన్నారు. విజేతలకు రూ. 5 లక్షల గ్రాంట్‌తో పాటు టిజిసిఎస్‌బితో కలిసి పనిచేసే అవకాశం లభించనుందని వివరించారు. 2025లో తెలంగాణలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు 6 శాతం తగ్గాయని, ఆర్థిక నష్టం 23 శాతం తగ్గిందని అధికారులు తెలిపారు. సుమారు రూ. 534 కోట్లు స్తంభింపజేసి, 47 వేల మంది బాధితులకు రూ. 367 కోట్లు తిరిగి అందించినట్లు వెల్లడించారు.

### భవిష్యత్‌కు భద్రత టిజిసిఎస్‌బి లక్ష్యం..

టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయెల్ మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యా సంస్థలతో కలిసి భవిష్యత్‌కు సిద్ధమైన సైబర్ భద్రతా పర్యావరణ వ్యవస్థ నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమాన్ని టిజిసిఎస్‌బి ఎస్‌పి హర్షవర్ధన్ వోటు ఆఫ్ థ్యాంక్స్‌తో ముగించారు. షీల్డ్ అనేది కేవలం సమావేశం కాదని, తెలంగాణ, దేశ భవిష్యత్ సైబర్ భద్రతకు ఒక మిషన్ అని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, ఆర్‌బిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసుదేవన్, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, టిజిపిఏ డైరెక్టర్ అభిలాష బిస్త్, సంజయ్ కుమార్ అగర్వాల్,డిజి (రాజస్థాన్), నీరజ, ఎడిజి(పంజాబ్), సాయి మనోహర్,ఎడిజి (ఎంపి), భువాన్ రిభూ,ఐసిపి(ఢిల్లీ) తదితరులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com